౭

బ్రాహ్మణీకం

గుడిపాటి వెంకటచలం

డిసెంబరు, 1937
మొదటి ముద్రణం, 1,500 కాపీలు

లక్ష్మీప్రెస్, తెనాలి.

బ్రాహ్మణికి

సుందరమ్మ వంశం చాలా పూర్వాచారపరాయణ భూయిష్టం. లోకమంతా యేవిషయాలు వుత్తమూఢ నమ్మకాలంటారో, వాటిల్లో వాళ్లకి అమితమైన విశ్వాసం. వారానికి ఒకసారన్నా వాళ్లింటో యెవరికో వొకరికి ఒక్క దెయ్యమన్నా కనపడి తీరుతుంది. అందులో ఆ దెయ్యాలన్నీ దుష్టమైనవి. పూర్వాన్నించీ కూడా ఆ వంశానికి భయంకర శాప మున్నదనీ, మొగవాళ్లు చావడమూ, ఆడవాళ్లు వితంతువులు కావడమూ, నిశ్చయమనీ, వాళ్లకి గట్టినమ్మకం. ఆపత్తులు వాళ్లకి మామూలైపోయినాయి.

ఆ వంశంలో చచ్చినవాళ్ల కెవరికీ ఊర్ధ్వలోక నివాసంగాని, పునర్జన్మలుగాని వున్నట్టు లేవు. అందరు ఆయింటి చుట్టుపక్కలే, చూర్లనూ, చెట్లనూ, పట్టుకు గబ్బిలాలవలె వేళ్లాడతో, వాంఛల ప్రకారం, జ్యోతిషాలలోనూ, సోదెలలోనూ, పూనడాలలోనూ తమ సంతతివారితో సంభాషిస్తో, తమకోర్కెలు తెలుపుకుంటో, తమ కోపాలకీ, శాపాలకీ, కారణాలు వివరించుకుంటో వుంటారు.

"ఏడేళ్ల తొమ్మిది నెలల మూడురోజుల వెనక మీరు అట్లు పోందుకుని, నాకు అట్లు యిష్టమని తెలిసివుండికూడా, నాకు పెట్టక, అన్నీ మీరే తిన్నారు. అందువల్ల నాకు కోపంకలిగి, నీ మునిమనమడునాలు

గేళ్లప్పుడే అట్లు తిని చావాలని శాపం పెట్టాను." అంటుంది ఒక చచ్చిన ముత్తవ.

"నువ్వు చుక్కల చీరెలు నాలుగు కొనుక్కుని కూడా, ఒక్కటన్నా నాపేర ముత్తైదుకి పెట్టుకున్నా వుశావు. కనక నీకూతుఁకి చీరెకట్టే యోగ్యతలేకండా చేశాను," అంటుంది ఒక మేనత్త.

ఈ శాపాలకి శాంతులు చెయ్యడంతో సరిపోతుంది బతికి వున్నవాళ్లి ధనమూ, శక్తీ, కాలమూ.

మొత్తానికి ఆయింటో వాళ్లు బతికివున్న మనుషులతోకన్న, చచ్చినవాళ్లతో యెక్కువకాలం గడుపుతారు. ఎవరు యింటికి వెచ్చినా, మూలుగులూ, ఏడుపులూ, భయాలూ, వ్యసనాలూ, తప్ప యింకేమీ కనపడక పోవడంచేత, బంధువులకు వాళ్ల యింటికి వొచ్చి వుండడం దుస్సహం.

కాని ఆగృహము పావనమైనది. సమస్తకాలమూ వేదాధ్యయనమూ, పురాణపఠనమూ, మంత్రజపమూ, యాగమూ, పూజా, వీటిలోనే నిమగ్నులై వుండే వారు స్త్రీ పురుషులు. ప్రయాణమూ, వార్తాపత్రికలూ, కలహమూ, సంస్కారమూ, ఇవి ఎన్నడూ ఆ వైపులకు రావు. నీచభావాలూ, భౌతికకాంక్షలూ, యీర్ష్యా, ఆపేక్షా, వీటిపేరగనే యెరగరు. దేహాలూ గదులూ, భోజనమూ, శుచీ, మనసూ, ఆలోచనలూ వున్నతాలుగా వుంచకోడం అలవాటై పోయింది. ఆయింటి చుట్టూగాని, వాళ్ల ప్రాతలలోని జలమే,

ఒక విధమైన నిర్మలమైన పరిమళాన్ని కలిగివుండేది.

ఆవంశంవాళ్లందరూ గర్విష్టులు అధికారవంతులు. ప్రపంచం సంబంధం పెట్టుకోరు. కాని పొలము కాపులు, కరణాలు, పండితులు, అందర్నీ అధికార వంతంగా, నిర్లక్ష్యంగా, తక్కువగా చూసి మాట్లాడడం అలవాటయింది. ఆపూరివారు యిచ్చిన గౌరవమే అట్లామార్చింది వాళ్లని. ఇతరులతో పని పెట్టుకోరు, యాచించరు—తమ సౌఖ్యాలను ధనాన్ని, పొలాలను పెంచుకున్నారు గాని, లౌకికాధికారుల్ని ఒక్కర్ని యాచించలేదు.

తరతారాలనించి శిష్టాచారపరులై, నియమాలు తప్పని నిర్మలమైన అభ్యాసాలు కలిగి, భక్తిలో, భయంలో పితృదేవతల్నీ, ఉచ్ఛదేవతల్నీ పూజించే వైదిక సాంప్రదాయం కలిగిన వుత్తమ బ్రాహ్మణ వంశంలో పుట్టడంచాత, ఆవంశం వారందరూ ధ్యానించే దేవతల సౌందర్యమంతా సుందరమ్మలో మూర్తిభవించిందా అని తోస్తుంది. ఆమె అందమంతా కదలని, నవ్వని, నిబ్బరపు శాంతవిగ్రహపు సౌందర్యం లాగున వుంటుంది. మాటలూ, నవ్వులూ, గంతులూ లేక, నెమ్మదిగా చందమామవలె, చల్లగా ఆ చీకటియింటో, శబ్దంలేకండా, తిరుగుతో వుంటుంది.పుట్టినప్పటి నించీకూడా,ఆమె కళ్లలో అపారమైన ఖేదంతోస్తుంది. కళ్లు కోలగా శాస్త్రాలలో వర్ణించినట్లు, నల్లని కనిబొమ్మలకింద, పరుచుకుని,

కణతలమీద పడే జుట్టుని తాకుతో వుంటాయి. కను పాపలు-తెల్లని మబ్బుకింద సగం మాయమయే చంద్రుడివలె దిగులు కొల్పుతో పై రెప్పలకింద సగం అణిగి వుంటాయి. పసితనంలో కూడా ఆమె యొక్కువ విలాసాలు చూపకపోయినా, ఆమెని చూడడమే ఆనందం, ఆమె నడకలే నవ్వులు, ఆమె ముఖకాంతులే ముచ్చట్లు.

పెళ్లి ఐన దాకా కూడా సుందరమ్మ తనయిల్లు తప్ప ప్రపంచ మెరగదు. శాస్త్రాలు, వేదాంతాలు, పురాణాలు తప్ప వేరే విజ్ఞానము ఆమె మనసులో లేదు. పూజలతో, కర్మకలాపాలతో మునిగిన ఆ పల్లెటూరు కుటుంబంలో, కాలమాగి పోయింది. దేశమంతా కాలచక్రానికీ, కర్మానుభవానికీ లోబడి తిరిగిపోయి, మారిపోతూ వుంటే, ధ్రువనక్షత్రంలాగు ఆవంశం పూరాతనత్వంలో, అట్లానే నిలిచిపోయింది. మోటార్లు, వితంతు వివాహాలు, లెజిస్లేటివ్ కౌన్సిళ్లు, సగంవరకు మీసాలు, ఆంధ్రోద్యమాలు, వీటి మోత దూరంనించి, ఏదో పాతాళలోకంనించి కొంచెం కొంచెం వినపడుతో వుంటుంది, ఆయింట్లో వాళ్లకి.

సుందరమ్మ ముఖ్యమైన సుగుణమూ, ఆమె లోపమూ కూడా భూతదయ. తాను యెంత స్వంత విచారాన్నైనా భరించగలదు. కాని ఎవరిలోనైనా, చివరికి చీమనీళ్లలోపడినా, తాను సహాయం చెయ్యకుండా

వుండలేదు. సహజమైన యీ దయవల్ల ఆమె అనాచారాలకి దిగి తన బంధువులకి చాలా విషాదం కలిగించిన సమయాలు అనేక మున్నాయి.

ఎనిమిదో యేటనే మేనత్త కొడుకుకి సుందరమ్మకి పెళ్లి చేశారు. పెళ్లి కాగానే అతను మైసూరుసంస్కృత విద్యాభ్యాసానికై వెళ్లి ఆరేళ్లు అక్కడే గడిపి వొచ్చినందువల్ల సుందరమ్మ అతన్ని చూడనేలేదు. అతను మైసూరునించి సరాసరి మామగారి యింటికి వొచ్చి కార్యము చేసుకుని, భార్యని తనతో తీసుకుని వెళ్లాడు. సుందరమ్మ భర్త, పండితుడు, సౌమ్యుడు, రసికుడు, శృంగార కావ్యాలలోని వర్ణనలు పఠించినప్పుడల్లా, వాటి అన్వయంకన్న వ్యాకరణంకన్న వాటి సౌందర్యం మీదనే దృష్టినివుంచి పుట్టింటో పెరుగుతున్న భార్యని తలచుకునేవాడు. లోకాన్ని చూసినవాడు, కాని తన శాస్త్రములో విశ్వాసం చెడనివాడు. సుందరమ్మని చూడగానే అతనికి ఏకాగ్రత యేర్పడ్డది. వాళ్లవూళ్లో మూలనున్న యింటిని డాబాగా మార్చి, ఒక మేడగది కట్టించాడు. ఆగదిలో భార్యతో కూడా మాయమై ప్రపంచంతో సంబంధం కల్పించుకోడం ప్రారంభించనే లేదు.

ఎర్ర కలవవలె విచ్చిన ఆమె అందాన్ని చూచి అతను సమ్మోహనుడైనాడు. ఎరుపు నునుపులోనించి క్రమంగా తెలుపు నీడలోనికి మారే ఆ మెత్తని దేహకాంతులూ, మెరగా కస్తూరి పమరి

శంతో కూడిన పెదవులూ, ప్రియుడిముద్దుల నెరగక నిద్రపోతున్నట్లు, పొడుగైన కనుబొమ్మల కింద మూర్ఛలు పొయ్యే కళ్లూ, నున్నని రాళ్లమీద నించి దొర్లే ప్రవాహంలాగ మెరిసే బుజాలమీదనుంచి వేళ్లాడే జుట్టూ,నాజూకైన కంఠం చివర పెద్ద పువ్వు వలె వికసించిన మొహమూ, ఆమె ఠీవీ, నిదానమూ, బలుపూ, తులసీదళాలూ, కర్పూరమూ, కుంకమూ, కలిసి యింకగా యేర్పడ్డ దేహ పరిమళమూ—యీ ఆభరణాలతో వొచ్చింది సుందరమ్మ అతని యింటికి. కాళిదాసు వర్ణనలూ, శంకరుడి దేవీ స్తవమూ, తనప్రత్యేక స్వప్నాలూ కలిసి, మూర్తిభవించి నట్టు తోచింది సుందరమ్మ.

అతని తల్లీ, సన్యాసం పుచ్చుకుని సంసారాన్ని దయార్ద్ర హృదయులకు వొదిలి వెళ్లిన మేనమామ భార్యా పిల్లలూ, అతని బంధువులు. కనక అతనిసేవ అతి సౌఖ్యప్రదంగా జరుగుతుంది.

ఆపైన గదిలోనుంచి వాళ్లకి, మామిడి చిగుళ్ల మీది మంచుబొట్లూ, కాంతిలో కనబడకండా దూసుకుపొయ్యే చిలకల రంగులూ, పచ్చని చేలమీద నీడలుపడేస్తూ పయనమయ్యే మబ్బులూ తప్ప యింకేమీ కనిపించవు. కోయిలకంఠమూ, జెముడు కాకి మూలుగూ, ఝాలపిట్టల కూతలూ, కలుపు కూలీలపాటలూ తప్ప యింకేమీ వినిపించవు. అవన్నీ చూశారో లేక ఒకరినొకరు చూసుకోడంలో ప్రమత్తు

లైనారో, ఆశబ్దాలన్నా విన్నారో, లేక అలిసి మూర్ఛలుపోయి, అన్నిటికీ అతీతులైనారో! మొదట్లో వెన్నెల రాత్రులు తోటలోనికి దిగివొచ్చారు. తరవాత మానేశారు. కొన్నాళ్లు ఉదయాన వొంటిగంటకి భోజనానికి దిగేవారు. అదీ మానేశారు. సుందరమ్మే భోజనం పైకి తీసుకెడుతోంది. భోజనం వొండిపెట్టడం తప్ప కిందివాళ్లకీ పైవాళ్లకీ సంబంధం లేదు. కొత్తగా వొచ్చిన మైసూరు పండితుడి సారస్యము గ్రహిద్దామనీ, అపరూపమైన బంధువుణ్ణి ఆదరిద్దామనీ, తాము సాగుచేసే పొలాల అధికారిని చూడాలనీ, వొచ్చిన జనమంతా కిందనే తిరిగి పోతున్నారు. వాళ్లకేం జవాబు చెప్పాలో అతనితల్లికి తెలీటంలేదు.

పుట్టింటి నించి తల్లీ తండ్రీ వొస్తే, ఒక నిముషం కంటె యెక్కువ మాట్లాడడానికి సుందరమ్మకి వ్యవధి లేకపోయింది. ఎవరువెళ్లి తలుపుకొట్టినా తియ్యరు. కొట్టడానికి ఎవరికీ ధైర్యం లేదు. విననట్టే వుంటారు; వినబడదో! సుందరమ్మ కిందికి వొచ్చిందా, ఒక్క నిముషం ఆగదు, అతను యీలోపల మాయమౌతాడనో, విరహం భరించలేక మూర్ఛపోతాడనో - మాట్టాడదు - ఏడుస్తున్న చంటిపిల్లని వొదిలివచ్చిన తల్లివలె, పైకి పరిగెత్తుతుంది. కిందికి నవ్వులూ, పరుగులూ, పాటలూ మాత్రం వినబడతాయి. అప్పుడప్పుడు-పూలూ, గంధమూ, కస్తూరీ, తప్ప యింకే అవసరాలు లేవు పైవాళ్లకి.

ఇట్లా రెండేళ్లు గడిచింది.

ఒకరోజు పొద్దున్న సుందరమ్మ మేడ దిగివొచ్చి, అత్తగారితో—

"మీ కోడుక్కి జబ్బుగా వుంది" అంది.

నెలరోజుల కిందనుంచి, కొడుకో కోడలో భోజనం తగ్గించారని ఆమెకి తెలుసు. కొడుకుమీది ప్రేమ చేత, అతను తినగా వొదిలిన పదార్థాలున్న కంచాన్ని పరీక్షించి, అతని సాన్నిధ్యాన్ని కల్పించుకోవాలని ప్రయత్నించేది ఆమె. కాని ఆనంద భోజనం చేస్తూన్నారేమో, యింక యీ భౌతికాహారం అక్కర్లేదేమో, కొద్ది దినాల్లో యిదీ సంపూర్ణంగా విసర్జిస్తారుగావు ననుకుంది ఆమె. బతికివున్న యిరవై సంవత్సరాలలోనూ ఆమె భర్త ఆమెకున్న చాదస్తాన్నీ, నిశ్చయశక్తినీ, మూర్ఖాన్నీ, మనోబలాన్నీ, సంసార సుఖమనే పేరుకింద నాశనం చేశాడు. కనక పురుషుడంటే చాలా భయం, ఆలోచనలేని భక్తి ప్రశ్నించని అడకువా చూపుతుంది.

వారంరోజులైనా కొడుకు జబ్బు తగ్గలేదు. వియ్యంకుడికి కబురంపింది. మేడతలుపులు తియ్యక తప్పిందికాదు. ఆయన వొచ్చి, అల్లుడిలో మార్పు చూసి చాలాభయపడి చప్పున ఆయుర్వేద వైద్యుణ్ణి తీసుకొచ్చి మందిప్పించాడు. పదిహేను రోజుల్లో స్వస్తత కనపడ్డది. కాని ఆవైద్యుడు 'రోగి భార్యతో రెండు నెల్లవరకు కాపరం చెయ్యకూడ'ద న్నాడు.

తండ్రి సుందరమ్మని తనతో తీసికెడతానన్నాడు. అల్లుడు వీల్లేదన్నాడు, కూతురూ రానంది. పత్యం మాత్రం చేస్తామని వొప్పుకున్నారు. కాని ఆరాత్రి కిందబడుకున్న కూతురు తెల్లారేప్పుడికి మేడమీాద తలుపు బిగించుకుని వుండడంచేత, తండ్రి దడిసి, కూతుర్ని బలవంతంగా ప్రయాణంచేసితీసికెళ్లాడు.

సుందరమ్మ తండ్రితో వెళ్లిందన్నమాటేగాని యింటిదగ్గిర, ప్రాణాలన్నీ అత్తవారింటో వొదిలి వొచ్చినదానివలె, కదలక మాట్లాడక, ఓమూాల కూచుంది. కళ్లనీళ్లు పెట్టుకుంది, మరీబతిమాలి అడిగితే "నేను లేంది, ఆయన బతకరు," అంటుంది. నాలుగో రోజు రాత్రి ఎవరో లేచి చూసేప్పటికి, అల్లుడు సుందరమ్మ పక్కలో వున్నాడు. ఆరాత్రికి రాత్రి అన్ని మైళ్లు నడిచివొచ్చాడట—పొద్దున్నే మామగారు చివాట్లేశారు. అతను మాట్లాడకండా విని చిరునవ్వుతో "ఈ విషయం మీాకర్థం కాదులెండి." అన్నాడు.

"ఇంటోంచి పొమ్మని యెట్లా అంటారు? సుందరమ్మని అందరి మధ్యా పెట్టుకుపడుకున్నారు. కాని పగలు ఒకర్ని వొకరు వదల్రే! మాటిమాటికీ సుందరమ్మని పిలిచి పనులు చెప్పారు. కాని ఎంతసేపని ఎన్నిసార్లని కాపాడగలరు? పని కాగానే అతనిదగ్గిరికి ప్రతిసారీ పరిగెత్తుతో వుంటే! ఒకరాత్రివేళ దొడ్లో చప్పుడయింది. మామగారు గేదె యీా

నిండేమో నని వెడితే, తెల్లగా దెయ్యాలు రెండు కనబడ్డాయి. మంత్రం నీళ్లు మీద చల్లబోతే కూతురూ అల్లుడూగా మారారు. మర్నాడు రాత్రి సుంద రమ్మని తల్లి పక్కలో పడుకోపెట్టుకుంది. కానిరాత్రి వేళ లేచి వెళ్లిపోయింది సుందరమ్మ. తండ్రికి చాలా కోప మొచ్చింది.

"ఇంతమాత్రం జ్ఞానం లేకపోతే యెట్లా? "

" నీకు అర్థం కాదు, నాన్నా!"

" నిజంగానే అర్థం కావటంలేదు, ఆరోగ్యం చెడ గొట్టుకుని ఏం కావుకుందామని ! అతని మీద నిజ మైన ప్రేమవుంటే అతన్ని రక్షించడమే ముఖ్యంగా పెట్టుకుంటావు. ఇది పిచ్చి. "

" ఆయన నిలవలేరు. నేనేం చెయ్యను?"

" బుద్ధి చెప్పు. "

" నా చాత కాదు. "

మర్నాడు రాత్రి అల్లుడే వొచ్చి తల్లీ, కూతురూ పడుకున్న మంచం పక్కన కూచున్నాడు. సుంద రమ్మ రానంటుంది, అతను మాత్రం వెళ్లడు. ఇంక ఇంటోవాళ్లందరికీ విసుగెత్తి ఏమనడానికీ తోచక, అసహ్యమేసి, ఈ కొత్తజబ్బుకన్న ఆపాతజబ్బే నయంగా కనపడి, యెవరికర్మ ప్రకారం అట్లా జరుగు తుందని వూరుకున్నారు. ఐదోరోజున అల్లుడు మళ్లీ పక్కవేశాడు, కాని భార్యని వొదలలేదు.

తండ్రి మళ్లీ సుందరమ్మని గట్టిగా చివాట్లు

పెట్టాడు.

" ఏమే, నీమొగుడికి బతకాలని లేదా యేమిటి? ఏదో వొకటి చెప్పండి-బోలెడు డబ్బుపోసి ఆమందులు కూడా కర్చెందుకు? "

సుందరమ్మ పెద్దగా యేడ్చింది.

" లాభంలేదు, నాన్నా! ఆయన నాకు దక్కరు. ఆ సంగతి ఆయనకీ తెలుసు. జాతకంలో ఇంతకన్న ఆయుస్సులేదు ఆయనికి. నేను కనపడకపోతే మరీ కొట్టుకుంటారు, ఆ నిమిషాన్నే ప్రాణంపోతున్నట్టు. కనపడితే సరేసరి. కాని నాన్నా, నాకర్మప్రకారం జరుగుతుంది. నువ్వు వూరికే చింతపడి ఏం లాభం ? నాగతి తప్పించడం నీతరమా? "

ఏమంటాడు? చిన్నప్పణ్ణించీ తను మాట్లాడినవీ, తర తరాలనించీ వంశంలో నమ్ముతున్నవీ, జాతకాలూ, కర్మా ఆమాటలు మరి కూతురు కూడా నేర్చుకుని, విశ్వసించి జవాబు చెపితే! ఏమంటాడు ?

పదహారో రోజున అల్లుణ్ణి భూశయనం చేశారు.

అతనికేమీ బాధలేదు. నిండుస్పృహలో వున్నాడు. కాని నూనె ఆఖరైన దీపంవలె కుంకి పోతున్నాడు. ఇంకా ఒకచెయ్యి, మీదపడి యేడ్చే సుందరమ్మ మెడమీదనే వుంది. అందర్నీ పొమ్మని సౌంజ్ఞ చేశాడు.

" యేడవకు, కాలగతికి మనమేం చెయ్యలేము. ఈ రెండేళ్ల స్వర్గం తరవాత చావంటే నాకు వ్య

సనం లేదు. నిన్ను వొదలడమే నా విచారమల్లా. కాని నిన్ను వొదలను. నాచావు తరవాత కూడా నిన్నే అంటిపెట్టుకుని వుంటాను. ప్రతినిమిషం నీతోనే వుంటాను. నీ జన్మానికంతా నేనే నీభర్తని" అన్నాడు.

"నేనూ మీవెంటనే వొస్తున్నా!" అంది. కాని అతను మాట్లాడలేదు. మామగార్ని పిలిచాడు,

"మీరు నాకొకటి వాగ్దత్తం చెయ్యాలి. నేను పోయినా దానిలో నివసించబోతున్నాను. దాని అందాన్ని అమితంగా ప్రేమిస్తున్నాను. దాన్ని వికారం చెయ్యవొద్దు. చెయ్యనని ప్రమాణం చెయ్యండి. కనపడక పోయినా దానికి భర్త వుండనే ఉంటాడు" అని అత్తమామలచేత ప్రమాణంచేయించుకున్నాడు.

"మీ కూతుర్ని ఏ అఘాయిత్యం చెయ్యకండా కాపాడండి. ఇదిగో, చావు సహజంగా వొస్తే రానీ, మనం కలుసుకుందాము. కాని బలవంతంగా ప్రాణం తీసుకున్నావా, నువ్వు నాకు అందవు. చచ్చిననన్ను మళ్లీ హత్యచేసినట్టే."

భర్త పోయింతరవాత సుందరమ్మని బతికించు కోడం చాలా కష్టమయింది. ఆర్నెల్లు పెద్ద జబ్బు పడ్డది. అందులో స్పృహలేని జాడ్యం. నయమైన తరవాత కూడా మాట్లాడదు, తిరగదు, తినదు, చీకట్లో ఓమూల కావిడిపెట్టెమీద కూచుంటుంది, ఇరవైనాలుగు గంటలూ. అక్కడే నిద్రవొస్తే పడుకుంటుంది. లేచి కూచుని వుంటుంది. చీకట్లోనే

ఎవరితోనో రహస్యంగా మాట్లాడుతుంది. తలుచుకు తలుచుకు ఏడుస్తుంది. నాబోటి బంధువు వాళ్ళయింటికి వెడితే, ఒకమూల, సన్నగా, పొడిగి, తెల్లగా, పొడుగ్గా, నల్లని పెద్దజుట్టు విరబోసుకుని, చీకట్లో కోలకళ్ళలో మెరిసే గుడ్లతో వెర్రిగా చూస్తో, కన పడుతుంది. అంత చీకట్లో, అంత విచారంలో, ఎంత అందంగా వుందని! ఈ లోకానికి సంబంధించిన, కొవ్వూ, మాంసమూ కరిగిపోయి, ఆత్మకి సంబంధిం చిన, మెరుగు శరీరంలోనూ, కాంతి కళ్ళలోనూ కన పడుతోందనిపిస్తుంది. సౌందర్యాన్ని, ముఖ్యంగా కళ్ళ లో ప్రకాశించే ఆత్మ ముఖానికిచ్చే సౌందర్యాన్ని వొదలక వెర్రిపడే నేను ఆమెని చూసి, అక్కడే ఆచీకట్లోనే ఆమెని చూస్తో ఆరాధిస్తో కూచోడానికి వీలవుతుందా, ఆశరీరంలోకి, కొత్తబలాన్ని, ఆకళ్లలోకి కొత్తవుత్సాహాన్ని తెప్పించే మార్గమున్నదా, అని తపనపడ్డాను.

కొత్తలో శ్మశానానికి పోయి, తెల్లార్లూ బిగ్గరిగా అతన్ని పిలుస్తో యేడ్చేదిట.

ఇట్లా మూడు సంవత్సరాలు గడిచింది. సుంద రమ్మ యింకా ఆమూల అట్లానే కూచునివుంది. వొళ్లంతా పాలిపోయింది— కాని తేజస్సు ఒకరవ్వ చెడలేదు. గంభీరత యెక్కువయింది. తపశ్శాలినివలె తోస్తుంది. మాట్లాడదు. కదలదు.

౨

తండ్రి చచ్చిపోయినాడు. బతికి వున్నన్నాళ్లూ అతని ఆస్తి సంగతి యెవరికీ తెలీదు. ఆయనకీ తెలీదేమో! ఆర్నెల్లలో అప్పుల వాళ్లు అన్నీ వేలాలు వేశారు. ఇంటో చేరిన వితంతువులూ, బ్రహ్మచారులూ యెక్కడ వాళ్లు అక్కడ సద్దుకున్నారు. సుందరమ్మనీ తల్లినీ యిల్లు విడిచి పొమ్మన్నారు. సుందరమ్మ భర్త ఆస్తి వుంది. కాని దానికోసం యెవరి నడగాలో, యెట్లా తెచ్చుకోవాలో తెలీదు. లోకమంటే యెరగరు. గూడుపోయిన పిట్టల వలె దిక్కులు చూస్తో కూచున్నారు. చివరికి బెజవాడలోవున్న సుందరమ్మ మేనమామ వెంకట్రామయ్యకి యీసంగతి తెలిసి, తల్లినీ కూతుర్నీ రమ్మని వుత్తరం వ్రాశాడు.

ఆయింటో చీకటి మూలనించి కదిలి- బైటికి - కాదుఆయిల్లే విడిచి, ఆవూరే, యెరిగిన మనుషుల్నే విడిచి, తానెన్నడూ చూడని, లోకంలోకి, తల్లి తప్ప ఏసహాయమూ లేకండా వెళ్లాలంటే, సుందరమ్మకి చాలా భయంవేసింది. తను ఆడుకుని జన్మ అంతా తనకి శరణ్యంగా వుంటుందనుకున్న యింటిని యితరులు ఆక్రమించుకుని, తమ పూజా స్థలాన్ని తాము ఇతర కులాలవాళ్లని అడుగన్నా పెట్టనీని పవిత్ర ప్రదేశాల్ని, యిష్టం వొచ్చినట్టు భక్తి లేకండా వుపయోగిస్తారు. తమని నమ్మి, ఆయింటిని ఆశ్రయించుకుని పూజలు పొందే దేవతలు పాపం యామవ్వు

తారు? చివర వరకూ, ఏదో అద్భుతమైనస్థితి తటస్థిస్తుంది; ఎక్కడో ధనం దొరుకుతుంది. ఎవరో సహాయ పడతారు. ఇన్నాళ్లు పూజలు పొందిన దేవతలు తమను యీ ఆపత్సమయంలో ఆదుకోరా అనే ధైర్యంతో యేమీ యోచించ లేదు - కాని. ఆ దేవతలనే వాళ్లు వున్నారో లేదో, యిన్నితరాలు వూరికే వుత్త అర్థం లేని పేర్లకే, ఏమీ లేని ఊహలకే, అశక్తిలేని బొమ్మలకే పూజలు, ప్రార్థనలు, నైవేద్యాలు, ధనము, శక్తి, కాలము, అంతా, అవివేకులై, ధారపోశారో! ఆదేవతలు వున్నా వాళ్లకి సుందరమ్మకు సహాయం చేసే శక్తి వుందో లేదో!... వాళ్ల కన్న బలవంతులైన దేవతలు, యీ వంశం చేత పూజలు పొందని వారు, అపకారం సాగించారేమో!

ఇవన్నీ సుందరమ్మ ఆలోచించ లేదు. విశ్వాసానికి, సమన్వయం కుదర్చాలని ప్రయత్నం చేసే నా వూహాలేగాని!

తనకర్మ యిట్లా వుంటే, దేవతలేం చేస్తారనుకుంది. ఆ వొక్క ఆలోచనతో, ఆమెకి మనుషుల మీద గాని, దేవతలమీద గాని, యేద్వేషమూ, నిరాశా, తోచనేలేదు. కన్నీళ్లతో ప్రతిగదినించీ, దొడ్లో చెట్టునించీ, దేవతల ఆసనా స్తలాల నించీ శలవ తీసుకుంది. సామాను సద్దాలి. సుందరమ్మ తన విచారాన్ని మరిచి తిరగాలి, ఆమెకి కాళ్లనూ, చేతుల్నీ, కదిల్చే ఆలవాట్లే పోయినాను. కళ్లు కూడా

కాంతిని భరించలేవు. ఆమె బైటికి వొచ్చిందంటే, చూడడానికని, వూరంతా మూగారు.

అధికార ఐశ్వర్య పదచ్యుతి పొందిన మనుషుల మీద లోకానికి వున్న కోపం యెవరి మీదా వుండదు. తమస్థానాన్ని నిలబెట్టుకో లేని వాళ్లు, తమ కన్న అధికులమని ఇన్నాళ్లు తమని మోసం చేశారే అనుకుంటారు. ఔన్నత్యంలో వున్నన్నాళ్లు, ఆమను షులే, వాళ్ల స్వభావం లోనే ఔన్నత్యం వుందను కుంటారు. అధికారమూ, ధనమూ, 'ఛాన్సు' వల్ల గాని, అదృష్టం వల్లగాని తటస్థించిన విషయాలను కోరు. కాని పతనం కలగగానే, వాళ్లు గూడా తమ వంటి సామాన్యులేనని తెలుసుకుని మండిపడతారు. ముఖ్యంగా అందులో, ఆ దీనత్వంలో కూడా అహం కారాన్ని పూని, తమ వద్ద ఆశ్రయించని ధీరుల్ని చూస్తే, ఉగ్రత్వాన్ని తలుస్తుంది లోకం- పాపం! అని పెదవులతో అని, చాటుగా ఒక్కరాయి విసురు తుంది.

కాని లోకంతో సంబంధం మానివేసుకున్న సుందరమ్మకి ఇవేమీ కనపళ్లేదు. ఆగుంపు వంక తలన్నా యెత్తలేదు. కాని ఆమెతల్లి గుంపులో వాళ్లని తిడుతోంది.

సామాను సర్దాలంటే, తల్లి ఏమీ వొదలక అన్ని మూటలు కడుతోంది, రోళ్లు, బోషాణం, వడ్లబస్తాలు అన్నీ, సుందరమ్మకి కూడా ఏమీ తెలీదు. బళ్లవాళ్లు

వొచ్చారు. సహాయానికై పొరుగువాళ్లు వొచ్చారు. వాళ్లని యింట్లోకి రానీదు. బ్రాహ్మలు కావాలంటుంది తల్లి.

"రేపణ్ణించి యెవరు తిరుగుతారో! వాళ్లనిరానీ" అంది సుందరమ్మ – కాని లాభం లేదు.

చివరికి కరణం వొచ్చి, ఆ సామానులన్నీ తీసికెళ్లడానికి వీలులేదనీ, రైలుఛార్జీ, బెజవాడలో యింట్లో స్థలమూ, ఇవన్నీ మాట్లాడి వొప్పించాడు ఆమెని. దేవతలూ, దేవతార్చన సామానూ, ఎవరినీ తాకనీ లేదు. వూరగాయ జాడీలో! అన్నీ ఒక బ్రాహ్మణ్ణి పిలిచి దానం చేశారు. పదేళ్ల కిందపెట్టిన వూరగాయలు కూడా వున్నాయి.

సుందరమ్మా తల్లీ కలిసి దేవతల్ని బండిలో యెక్కించారు. వీళ్లు సరిగా బెజవాడ చేరతారా అని అనుమానంగా వుంది వూరివాళ్లకి.

రైలులో యెక్కగానే వికారపెట్టిందిసుందరమ్మకి. ఆపెట్టెలో వాసనే ఘోరమనిపించింది, నిర్మలమైన గాలి అలవాటైన ఆమె ముక్కుకి. ఇంతలో ఒక ఆమె చుట్ట వెలిగించింది. కొంత సేపటికి ఒకామె లెవటరీ, తలుపు తెరిచింది.

"ఇంకెంత సేపు ఉండాలి అమ్మా, యీ నరకంలో మనము?"

"ఓ గంట ఉండాలేమో!"

"ఎందుకూ ఆమనిషి లోపలికి వెళ్ళింది?"

" అది పాయిఖానా దొడ్డి. "

ఆమనిషి వొచ్చింది—

"మరి కాళ్లు కడుక్కోడేం? చేతులు కడుక్కోడేం?"

వాళ్లవూళ్లో స్నానం చెయ్యడం మామూలు.

"నీళ్లేవీ యిక్కడ? "

" మరి— — "

" మాట్లాడకు, అది వింటోంది. "

మాటలు వినాలని ఆ సాలెమనిషి యింకా దగ్గిరికి వొచ్చింది.

" కొంచెం దూరంగా కూచో. అట్లా దగ్గిరికి వొస్తావేం? " అంది తల్లి.

" ఏం ఆచోటు చాలదూ నీకు? ఇదంతా నువ్వే కొనుక్కున్నావా ? "

తక్కువ జాతిస్త్రీ అట్లా మాట్లాడడమే! సుందరమ్మ రక్తం వేడెక్కింది. స్వభావంలోనే వున్న అధికారగర్వం అణగక పోట్లాడింది.

పక్క స్టేషనులో ఇంకో ఆమె యెక్కి వీళ్ల ముందుగా వెడుతోంది.

అదృష్టంలో తమకు సమానమైనా, వంశంవల్ల అధికులమని సూచించే ఆ బ్రాహ్మల్ని క్షమించ తలుచుకో లేదు ఆ సాలెమనిషి.

" అట్లా వెళ్లకండమ్మా ! వారు ఆ బెంచీనంతా కొనుక్కున్నారుట ! "

" కొనుక్కోడమేమిటి ? " అని వాళ్లపక్కనే

చతికిలపడ్డది.

"ఎక్కడనించి, మరియమ్మా! నువ్వు!"

"ఈవూళ్లో కాన్పుచేసి వెళ్తున్నానమ్మా!"

"ఎవరేనువ్వు!" అంది తల్లి.

"ఎవరే ఏమిటి? ఏంగొప్ప!"

"మరి కానుపుచేసి, స్నానంచేశావా?"

"స్నానం? అదంతా మీ బ్రాహ్మలు! కిరస్తానీలం మాకా పిచ్చిలేదు."

"ఛీ, ఛీ, కిరస్తానివా? దీంటో యెక్కావేం? ఆ మూలకూచో."

నివ్వెరపోయి చూసింది మరియమ్మ.

పెట్టెలో వాళ్ళంతా ఆశ్చర్యంతో వేళాకోళంగా చూస్తున్నారు.

"ఈమూట యెందుకూ, పైన పెట్టండమ్మా!" అంటో తియ్యపోయింది.

"తాకకు, తాకకు."

"మరితియ్యి."

"ఎక్కడ పెట్టను?"

"కిందపెట్టు."

"వుమ్మ్లు – అవి మాదేవతలు."

"దేవతలు – దేవతలు! మట్టిబొమ్మలా? కొయ్యబొమ్మలా? నీ దేవుళ్ళూ నువ్వూను! పెంటలో పారెయ్యి."

అని మూటని లాగింది. సుందరమ్మ సహించలేక

పోయింది. పెదిమ వ్రణీకింది. తన దేవతల్ని, వందల కొలది యేళ్లనించి పూజించిన సుందర విగ్రహాలని-కంఠం వొణికింది. కళ్లలో నీళ్లు కమ్మాయి. నుంచుని చెయ్యిజాచి—

"నువ్వు,నువ్వు...మాలదానివి...నీచురాలివి... అంటుదానివి...మా దేవతల్ని...తాకుతావా ? తాకి బతుకుతావా ? నీతల చెక్కలుకాదా ! జాగ్రత్త."

అని గంభీరంగా పలికి, వొణికి కూలబడి కళ్లుమూసుకుంది. మరియమ్మ పక్కన నవ్వింది. కాని బండిలో వాళ్లంతా ఆమె ఆవేశము, ఆమె సౌందర్యము, ఆ వాక్యాలలోని వాస్తవమైన ధ్వని విని ఆశ్చర్యపడి చూశారు—

మరి ఆ దేవతలే వున్నారో, లేక సహజశక్తులే కరుణించాయో, లేక "ఛాన్సు" తటస్థపడ్డదో, పైటికి చూస్తున్న మరియమ్మ తలమీద కిటికీ చెక్క జారిపడ్డది. గాయమై రక్తం కారింది.

బ్రాహ్మణ ద్వేషంతో పరమతపక్షానికి వొప్పు చెప్పిన హిందూ హృదయాలన్నీ సుందరమ్మ పాదాక్రాంతాలైనాయి.

"చూశారమ్మా, దేవతలమహిమ!" అని అట్లా జరిగిన నిదర్శనపు కథలు చెప్పుకోడం మొదలు పెట్టారు. కాని ఒక్కరూ మరియమ్మకు సహాయం చేసినవాళ్ళు లేరు.

తెనాలి స్టేషన్‌లో "దిగండి, దిగండి" అని అరు

స్తున్నారు. అందరూ దిగారు. తల్లీ సుందరమ్మా యింకా సామాన్లు దింపుకుంటున్నారు.

"ఇంకా ఏమిటి దింపుతున్నావూ? బండీ వెనక్కి కదులుతోంది. ఏ పిల్లా ! దిగు దిగు"

"ఇంకో మూట వుంది. అమ్మాయి వెళ్ళవే."

సుందరమ్మ తలుపుదగ్గిరికి వచ్చేప్పటికే రైలు కదిలింది. "జాగర్త" అంటో ఆయన జబ్బపట్టుకో పోయినాడు. తప్పించుక దూకింది. తాను వెల్లకిత్తలా వడ్డది. మూట రైలుసందున పడ్డది. మూటయెత్తి యివ్వడంబకులు, తిడతున్నాడు ఆయన లేచి నుంచుని. ఆయనవంక చూచింది కోపంగా. చప్పున గొంతు తగ్గించి, పోయినాడు ఆయన. బాగా దెబ్బతగిలింది. కళ్ళంబడి నీళ్ళు తిరుగుతున్నాయి. తల్లికి చెప్పలేదు. ఆమె దేవతలమూట మొయ్యలేక సుందరమ్మ బుజాన పెట్టింది. ప్రపంచాలన్నీ మోసే దేవతలు, సుందరమ్మ బుజానికి భారమైనారు.

ఇదేమిలోకమా, నిజమా, కలా, అని చూస్తో నుంచుంది.

"ఎక్కడికి ?"

"బెజవాడ ?"

"వెళ్ళరేం? రైలుపోతోంది."

"ఎక్కడా? నాయనా, యీనాలుగు మూటలు తీసుకురా"

"నేనా?" అంటో పోయినాడు, సుందరమ్మవంక

ఆమె సిగ్గుపడేట్టు చూస్తో.

ఎవరూ సహాయం చెయ్యరేం? వూరికే నే తిరుగుతున్నారు చాలామంది! తమకష్టం కనపట్టంలేదూ ?

బెజవాడ రైల్లో మొగవాళ్ల పెట్టెలో యెక్కాడు వితంతు వివాహం చేసుకున్న ఆయన తటస్థపడ్డాడు. తల వెంట్రుకలున్న వితంతువుని చూసేప్పటికి, అతని మనసు తహతహలాడి పొయ్యింది. ఎదురుగా కూచుని ఓ అంటుజోళ్ల ఆయన, పనిలేక వాళ్లని ప్రశ్నలడుగుతున్నాడు, వూరు, పేరు, గోత్రం, అత్తవారి యింటిపేరు, తాతపేరు - ఎదటవాళ్ల అయిష్టం గుర్తించ తెలుచుకోరు - వొదలరు. ఆప్రశ్నలకు తల్లి మెల్లిగా జవాబు చెపుతోవుంటే, వాళ్ల సామానులన్నీ వీధులో పారేస్తే యెట్లావుంటుందో అట్లావుంది సుందరమ్మకి. చెప్పకపోతే, కోపమొస్తుంది. వెక్కిరిస్తారు. రిపార్మరుకూడా చేరాడు.

"అమ్మాయికి వైధవ్యమొచ్చి యెన్నేళ్లు ?"

"పిల్లలా ?"

"నగలు వున్నాయా ?"

"అత్తవారి వూరు ?"

ఇట్లా అడిగి అడిగి ఒక్కనిమిషం సందేహించి,

"అమ్మాయి యవ్వనమంతా వృధాగా పోతోంది" అని పెద్దనిట్టూర్పు విడిచాడు. కలవరపడుతున్న సుందరమ్మ ముఖంచూసి పక్కన వున్న చాదస్తుడు అందుకున్నాడు.

"ఆ యవ్వనం పురుషుడి వుపయోగార్థమా?"

"కాదా ?"

"ఏమీ దేవతల కర్పణ కా కూడదా?"

"దేవతలేమిటి? పాపం ఆ అమ్మాయి బాధ మీ కేం తెలుసు?"

సుందరమ్మకి తనను చీరె విప్పి నుంచోపెట్టి నట్ట యింది.

"అమ్మాయీ, నీకు చక్కని పెనిమిటిని తీసుకొ స్తాను చూడమా."

"మే మట్లాంటివాళ్ళం కామండి" అంది తల్లి. కోప మొచ్చింది ఆయనకి—

"అట్లాంటి వాళ్ళమంటే, మేమేం చెడిపోయిన వాళ్ళమా?"

"ఏమోలెండి, మీసంగతి మాకెందుకు?"

"ఈనాడు మీకు తెలీదు. చివరకి మీరే విచా రిస్తారు నామాట విన లేదని! మీ వుద్దేశ్య మేమిటి! పునర్వివాహం పాపమనా? ఎందుకు పాపము? మొగ వాడు పెళ్ళిచేసుకుంటేనో—"

అంటో మామూలు కారణాలు మొదలుపెట్టాడు. వితంతూవివాహం, పాపం కానీ కాక పోనీ, పుటక వల్ల, అలవాట్లవల్ల, సాంప్రదాయం వల్ల పునర్వివా హాన్ని ఏవగించుకునే వాళ్ళు వున్నారని, భావన చేసుకోలేదు. స్పష్టంగా తెలిసీ యీ మాత్రపు సంస్కరణాన్ని అర్థం చేసుకోలేరేమో అను

కుంటాడు. మూఢదేశమని తిడతాడు. కాని తన కులాభిమానమూ, శాకాహార నియమమూ, శివార్చనా, అన్నీకూడా హేతువాదానికి నిలబడవని అతను పరీక్షించుకోలేడు. వృథాపొయ్యే ఆమెయవ్వనం మీద దయేగాని, అటువంటి భావమే లేని ఆమె మనసులో తాను కదిలిస్తున్న వికారాల్ని గురించి తలుచుకోడు. ఆ సౌందర్యం ఏపురుషుడి కళ్ళనో ఆనందపరిస్తేనే కాని నిష్ప్రయోజన మనుకోడం న్యాయమో కాదో యోచించలేదు.

అదృష్టవశాత్తూ బెజవాడ వొచ్చింది. ఆమె యవ్వనాన్ని గురించి వ్యసనపడ్డ మనిషి సుందరమ్మ మూడు మూటలు మోసుకు పోతోవుంటే చూసి, ఆలేత ఎమికలు పడే బాధను గుర్తించక, తన భావమెదితో నవ్వుతో వెళ్ళిపోయినాడు. షికారుగా వొచ్చిన సోమయాజులు అనే కుర్రాడు చూశాడు. సుందరమ్మనిచూడగానే ఆస్టేషనులో చప్పున దీపాలు ముట్టించినట్లు మిరుమిట్లు గొలిపాయి అతనికళ్ళు. శుష్కించిన చేతులతో ఆమూటలు పట్టుకుని, వొంగి బాధ భరించలేక కళ్ళలో నీళ్ళు కుక్కుకునే ఆ పిల్లనిచూసి:

"నేను తెస్తాను" అన్నాడు బిడియంగా.

"బ్రాహ్మలా?"

"అవును."

ఇచ్చింది. బండీదాకా తెచ్చాడు. సామానులు

బండీలో పెట్టారు. ఒక్కమాట మాట్లాడకండా, తిరిగి చూడకండా సుందరమ్మ బండీలో యెక్కింది.

అట్లా ఆబాడికేసి చూస్తో, అర్థంకాని బాధని, అనురాగాన్ని, లోపల అణుచుకొంటూ, నుంచున్నాడు సోమయాజులు. కొందరు స్త్రీలు (పురుషులు కూడా) ఏదో తెలీనివి, ఎన్నడో మరిచిపోయినవి, కొంటెంగా స్ఫురణకు వచ్చి బాధ పెట్టేవి, ఏవ్వో సంబంధాలను, అందాలను తోపించి, మరపురాని, బాధను కలిగిస్తారు. పాపం సోమయాజులు ఆమె రూపాన్ని వొదలలేక వ్రైదలలేక, దృష్టిని మరిల్చాడు. కాని "నీ బాధ ఎట్లాపోతుంది? నీవుద్దేశ్యం ఏమిటంటే!" చెప్పలేదు. టాజ్‌మహల్‌ని, హిమాలయ శిఖరాల్ని, పండువెన్నెల రాత్రిని చూస్తే కలిగే బాధకూడా అంతేకదా!

సుందరమ్మ మనసులో సోమయాజుల్లేడు. ఎక్కడికి? ఏ యిల్లు? ఎవరుంటారు? తనని ఆదరిస్తారా! ఏ కష్టాలు ప్రాప్తిస్తాయో! తన గతి యేమవుతుందో! అనుకుంటోంది.

జీవితం ఆ మూలరక్షణలోనున్న శిష్టాచారపరురాల్ని సుందరమ్మని, మోసగాళ్లు, క్రూరులు, నీచులు, ఆచారరహితులు, నూతనవిద్యాపండితులు, ధనాన్వేషాకరులువుండే యీక్లిష్టమైన లోకంమధ్య పారేసింది, ఏమాత్రమూ కరుణలేకుండా, తామర పువ్వును ముళ్లకంచలమధ్య పెద్దగాలి పడవేసినట్టు.

3

వెంకట్రామయ్య పూర్తిగా పట్టణ వాసాని కల వాటుపడ్డ బ్రాహ్మణుడు. ఆచారాల్ని కాలాను గుణ్యంగా మార్చుకునే బాధలన్నీ ఆయన తండ్రి కాలంలోనే జరిగిపోయినాయి. కొన్నిపనులు బ్రాహ్మణులు చెయ్యకూడని పనులని స్ఫురణకి రావడం కూడా మానేసింది ఆయింట్లో వాళ్లకి. దిక్కులేక వాళ్లయింట్లో చేరిన పల్లెటూరి సుందరమ్మకీ, తల్లికీ, యేదో కొత్తవిచిత్రలోకానికి వెచ్చి నట్టుంది. కంచాలలో తినడమూ, మైలబట్టలతో పీటలమీద కూచోడమూ, స్వంతంగా క్షురం చేసుకోడమూ, చాకలి తోడిన నీళ్లు స్నానం చెయ్యడమూ చూసి, విభ్రాంతులైనారు. తల్లి వెంటనే, అన్నమే మాని, స్వయంగా రొట్టె కాల్చుకుని ఒకమూల తింటోంది. కాని సుందరమ్మకి కర్మక్షీణం తప్పలేదు. మొదట్లో 'ప్రొటెస్టు' చెయ్యాలనిపించింది. కాని కొత్తయిల్లు, యెరగని మనుషులు, హక్కు లేదు, దిక్కులేదు. పూరుకున్నది.

కాని 'నెసెసిటీ', ప్రాణాలు నిలుపుకోవలిసిన అవశ్యకత, కొత్తలోకాన్ని చూచి భయం, ఇవన్నీ యీదేశాన్నంతా యెట్లా బలవంతంగా మార్చివేశాయో, అట్లానే సుందరమ్మని మార్చాయి. ఈ యిద్దర్నీ వెంకట్రామయ్యగారి కుటుంబం ఎంతో ఆదరించింది, ప్రేమ చూపింది, వాళ్లు రావడమే ఘన

తగా ఎంచింది. కాని వీళ్లకోసం వాళ్ల ఆచారాలను రవ్వంత కూడా మార్చుకునేట్టు లేరు. లోకం తల్ల కిందులైనా, ఆఫీసు వేళకి భోజనం తయారు కావాలి. ఆయన సౌఖ్యమనే సూత్రం మీద ఆ సంసార చక్రం తిరుగుతోంది. ఏమార్పు కావాలన్నా ఆయనకి, ఆయన సుఖానికీ 'రిఫర్' చేస్తారు. ఆయనతో చను వుగా మాట్లాడ్డానికి, ఆయన భార్యకీ, కూతురుకే, గుండెలులేవు. ఆయన ఆఫీసు లోకంలో, యీ ఆచా రాలు, సెన్టిమెంట్లు, పరిచయాలు, వ్యక్తిత్వాలు వీటికి వేటికీ ప్రవేశం లేదు.

సుందరమ్మ ఆచారమంతా అలవాటే గాని, ఒక్కటీ ప్రిన్సిపుల్, కాదు. కనక కొత్త వాతావర ణంలో చాలా తొందరగా "ఎక్జస్టు" అయిపో యింది. కాఫీకూడా తాగింది. జుట్టుకూడా దువ్వు తుంది. చీరెలు లేనప్పుడు ఆ కూతురు చీరెలుకూడా కట్టుకుంది. అంత ప్రేమతో యిస్తే యెట్లా నిరాక రిస్తుంది?

కూతురికి పదేళ్ళు. ఆమెకి చదువుచెప్పడానికని ఒకబీద ట్రెయినింగు విద్యార్థి చంద్రశేఖరాన్ని తన యింటోనే వుంచుకుని భోజనం పెడుతున్నాడు. అతను సంగీతవిద్యార్థి కూడాను. అందుకని ఆపిల్లకి, సంగీతంకూడా చెపుతున్నాడు. వెంకట్రామయ్య గారు సుందరమ్మని కూడా పాఠాలదగ్గిర కూచో మన్నారు. తరవాత తరవాత సుందరమ్మకీ యిష్టం

కలిగింది.

"కమలసులోచన ... మరాళగామిని ... కరిహార మధ్యే ... కస్తురి కుంకమ సంకలితే—"

అనిపాడుతో వుంటే, ఆమె చిన్నతనము, దేవీ పూజా, సహస్రనామార్చనా, కుంకుమపూజా, హారతులూ, జ్ఞాపకం వొస్తాయి.

"కచకుచధరసుమమాలా, కరసరసిజ పరిపాల సూనృతవర శుభగాత్రీ...కళ్యాణీ" అని పాడుతో వుంటే శరీరం పులకరించేది. ప్రతిదినమూ తన దగ్గిరిగా కూచుని పాట వింటో, విశాల నిర్మల నేత్రాలను అంతర్ముఖం చేసి, ఆనందం ముఖాన వెలుగుతో వినే ఆమంగళ విగ్రహాన్ని చూసి, ఆ తేజస్సులో కొంత మొదట తన పాటవల్లననీ, తరవాత తన వల్లనేననీ, మోనహాయ్యే, ఆ యువ్వనుడి విభ్రాంతిని ఆమె గ్రహించనే లేదు.

అనుభవమూ, రసజ్ఞతా లేని, ఆయువకుడు తన బాధను మింగుకుని, మింగుకుని, ఆమే తనకు ఏదో విధంగా తెలియ చేస్తుందని ఆశ పడి,పడి, యింటినంతా పువ్వులతో నింపుతున్నట్టు తిరిగే ఆమె శుభ శృంగారాన్ని భరించలేక, యవ్వనులకు సహజంగా తోచే, మార్గాలను వుపయోగించడం ప్రారంభించాడు. మెల్లిగా సంగీత పాఠాలుకూడా స్వరజతుల్ని చేరుకున్నాయి .

"కరివరదా,మరిమరి నాఅధరము గ్రోలర"

నేర్చుకునే శిష్యురాలి ధ్యాస తాళం మీదా స్వరంమీదా, వినే సుందరమ్మకి ఆవాక్యంలో మొదటిభాగంమీదా, నేర్పే గురువుకి రెండోభాగం మీదా వుండేది ధ్యాస. "నీదు స్మరణగాక వేరే యెరుగను" అని ఆమెవంక చూస్తాడు. ఆమె ఇంకో అర్థంలో ఆమాటలనే తలుచుకొంటో ఎక్కడో చూస్తుంది.

మొదటినించీ పరాధీనుడూ, ఇతరుల దయలో మెలగవలసినవాడు కావడంచాత, అతనికి ధైర్యమే నశించింది. తనపాటలతో ఆమె హృదయం మేలుకొని, తనవేపు తిరుగుతుందని అతని ఆశ. కాని ఆమె తనయెడల వాంఛచూపకపోతే, కలలోనన్నా ఆమెకి తనకోర్కె తెలపలేడు ఆమె మనసులో ఏమి జరుగుతోందో కనిపెట్టె తెలివిలేదు.

"నిన్న మొదలు నిదురలేదే చెలి" అన్నా, చివరికి "తొడలు, తొడలు" అని పాడినా లాభంలేక పోయింది. ఆమె కొంచెం సిగ్గుపడడమో, కోపపడడమో, కనపడ్డా అతనికి ఆశ వుండును. ఆభావ ఆపిల్లకి ఎంత అర్థమవుతుందో సుందరమ్మకీ అంతే అర్థమవుతోంది. భర్త చితిమీదనే ఆమె శృంగార భావంకూడా తగలపెట్టి వొచ్చినట్టుంది.

కాచుకుని వుండగా వుండగా అతని అదృష్టంవల్ల అతనికి చక్కని సమయం లభించింది. ఆదుర్గమ దుర్గంలో ఒక్కమూల ప్రవేశమార్గం లభించింది.

ఆమె నిర్మల హృదయపద్మంలో అతి మృదువైన దళం అతని కందింది. ఆమె స్వభావంలో వున్న ఒక్క మెత్తని స్థలంమీద తలవని తలంపుగా అతని వేలుపడ్డది.

అతనికి జ్వరంరావడం కారణం. కష్టాలు కూడా జీవితంలో యిట్లానే వుపకారానికి కారణాలవుతాయి. దూరదృష్టితో చూస్తే చివరికి అపకారమే పర్యవసానమవుతుందేమో! ఇతరులమీద ఆధారపడే సమాజంలో చంద్రశేఖరం, సుందరమ్మా, సఖులు కావడంచాత సహజంగా పరస్పర సానుభూతి వుంటుంది. అతనికి అప్పుడప్పుడు సుందరమ్మ జావా, మందూ యిస్తోంది. గిన్నె అందిచ్చేప్పుడన్నా ఆమె వేలు తగులుతుందేమోనని ఆశపడతాడు. కొంచెం ఆగి రెండుమాటలు మాట్లాడకూడదా? ఆమె నిలుచున్న నాలుగు నిమిషాలూ, అతనికి గొప్ప ఐశ్వర్యం పట్టి నట్టుంటుంది. తాగడం ఆలిస్యం చేస్తాడు. ఒకనాడు జావతాగి పెద్దమూలుగు మూలిగాడు.

"ఏమి ?"

మాట్లాడడు.

"నెప్పా?"

మాట్లాడడు.

"నయంలేదా?"

"ఎప్పటికీ నయంకాదు."

"ఎందుకు అట్లా అనుకుంటావు? వుత్త జరానికి?"

"నాకు కుదరదు."

"కుదురుతుంది. విచారపడకు." అని వెళ్లిపోయింది. పనిలేకండా పడుకుంటే అదే ఆలోచన. జ్వరంలోకూడా తాపజ్వరం విడవలేదు. ఎన్నో ప్లానులు వేసుకుంటాడు. ఆమె రాగానే భయం వేస్తుంది. మళ్ళీ ఆమె అసాధారణ తేజం చూస్తేనే విభ్రమం కలుగుతుంది. ఆమెని చూస్తే చెయ్యాలనుకున్నవన్నీ మరిచిపోయి, నోరు తడబడి వూరుకుంటాడు. ఒకసారి ఆమెని చూడగానే అతని ఆలోచన లేకండానే కళ్ళనీళ్ళు కారాయి. ఆమె జాలిపడ్డది.

"మీవాళ్లెవరూ లేరా?"

"వున్నారు. వాళ్ళకి నేనక్కర్లేదు."

"పిలిపించమని చెప్పనా?"

"వొద్దు."

"మరి దిగులుపడతా వెందుకు?"

అని వెళ్ళిపోయింది.

కోపమొచ్చింది అతనికి. సాధారణమైన జాలి కూడా లేదే ఆమనిషికి! కాని కొంచెం జాలిచూపితే దాన్ని "ఎడ్వాన్టేజ్" తీసుకుని, దాన్ని ప్రేమగా భావించి పీడించిన పూర్వపురుషుల దౌర్జన్యంనించి బాధపడ్డ స్త్రీలరక్తం ఆమెలో ప్రవేశించి సహజ ముగ్ధత్వాన్ని ప్రసాదించలేదా మరి?

రాత్రి సుందరమ్మ జావతెచ్చినప్పుడు, అక్కర్లేదన్నాడు. ఆమె కొంచెం బతిమాలింది.

"నా కాకలిలేదు. సయించదు. నేనిక బతకను." ఆమె సహజమైన దూరత్వాన్ని మరిచింది. మాతృత్వం విజృంభించింది. అతి దయతో "నాకోసం తాగు" అంది జాలిపడి. పాపం, వొంటరి బ్రతుకు, ఎంత దిగులుపడి పోయినాడో అన్న భావమే ఆక్రమించింది ఆమె మనసుని.

"నీకోసమా? ఐతే తాగుతాను. నిజంగా నేను తాగాలనే వుంటే, కొంచెం యిట్లా వీపుమీద చెయ్యి వెయ్యి. వికారంగా వుంది." అన్నాడు.

ఎక్కడో తప్ప సాధారణంగా పురుషుడు వొచ్చి తన చూపులతో, మేల్కొలిపితేనే గాని మొదటి సారి స్త్రీత్వం నిద్రలేవదు. అందులో సుందరమ్మ వంటి పూర్వాచారపరులకు, శిష్టశిక్షణులకు, ఆరోగ్యవంతులకు, పురుషుడు వొదలగానే, మళ్లీ కునికిపాట్లు పడుతుంది కామోద్రేకం. భర్తతో, భర్తృపూజతో భక్తితో, మిళితమైన స్త్రీకి భర్త కనపడితేనేగాని, మనోవికారం కలగదు. తక్కినవారి యెడల లింగభేదమే తోచదు. పురుషుణ్ణిచూసి కలవరపడి, సిగ్గుపడి, యెడంగా పోయే ప్రతి స్త్రీ హృదయం లోనూ, వ్యభిచారం దాక్కునే వుంది.

"వెర్రివాడా, యింతేనా? పాపం, జబ్బులో దగ్గిరకూచునే వాళ్లెవరూ లేరా? ఆమాట చెప్పవేం?"

కామవికారంలేని స్త్రీకి, పురుషుడి మనసులో తన మీద కోర్కి వున్నట్టు, తెలుసుకోడం చాలాకష్టం.

అతని మోహసంజ్ఞలన్నీ గుర్తుపట్టగల పూర్వజ్ఞానమే వుండదు ఆమె మనసులో! కాని యీనాడు, పురుషుడి సాధారణ వాక్యాలూ, మామూలు చూపులూ కూడా అపార్థాలతో స్ఫురిస్తున్నాయి నాగరికతగల పతివ్రతలకు.

ఆమెమాటలు విని సంతోషించాలో, విచారించాలో తెలీలేదు అతనికి. ఆతనిమీద చెయ్యివేసి పట్టుకుంది.

" నామీద చెయ్యివేసిన సంగతి ఎవరితో చెప్పకేం ? "

" ఏమి ? "

" బాబుగారికి తెలుస్తుంది. "

" తెలిస్తే? "

" తప్పు అర్థం చేసుకుంటారు. "

" ఛా "!

ఇంకా అర్థంకాలేదు, అమాయకురాలికి !

" వొద్దు. నామీద వొట్టే. "

" సరేలే. "

మర్నాడు రాత్రి సుందరమ్మ కన్న ముందు, అతని శిష్యురాలు మందు తీసుకొచ్చి యిచ్చింది. మందు వొద్దన్నాడు. కారణమడిగితే వికారమన్నాడు.

సుందరమ్మ జావ తీసుకొచ్చింది.

" జావకూడా నువ్వు తీసుకురావను కున్నాను. "

" ఏమి ? "

" మందు యివ్వలేదుగా ? "

" ఎవరిస్తే నేమి ? "

" ఒకటి ఎట్లా అవుతుంది ? "

" వెఱ్ఱివాడా, నువ్విట్లా పంతాలుపడితే, యెట్లా బతుకుతావు ? "

ఆజాలి మాటలతో అతని విచారమూ, నిరాశా అన్నీ పోర్లి వొచ్చాయి.

" నువ్వులేనిది బతకలేను. నువ్వే నా జీవనాధారం. నీమీంది ఆశతోనే బతుకుతున్నాను నన్ను చంపు, కొయ్యి. అనేశాను ఇంకేమైనా సరే. "

అని ఆమెకాళ్ళమీందపడ్డాడు. అంత జ్వరంలో కాకపోతే, ఆమాట లనడానికి ఎన్నేళ్లయినా అతనికి ధైర్యం వొచ్చేదికాదు.

చప్పున కళ్ళమీంద పొర తొలిగినట్టయింది. ఆమె కర్థమవుతోంది. కళ్ళు తిరిగాయి. భయమేసింది. అకళ్లు వొదిలించుకుని దూరంగా పోయింది.

"నేనేమిటి? నేనేమిటి?" అంటూ లోపలికి వెళ్ళింది. అతనికి రూఢి యేర్పడ్డది, ఇంక లాభం లేదని. తప్పకండా వెంకట్రామయ్యగారితో చెప్పు తుంది. ఆయన హెడ్మాష్టరుగారితో చెపుతాడు. డిస్మిస్ చేస్తాడు. 'స్టైపెండు' ముదరా యిమ్మం టారు. ఎక్కణ్ణించి తీసుకొస్తాడు? ఆ బెంగతో మోహమూ జ్వరమూకూడా మాయమైనాయి.

ఆవాళ్క బెంగే పనిచేస్తోంది. ఆమెని బతిమాలుకుని ఎవరితోనూ చెప్పకండా చెయ్యాలి.

రాత్రి పదిగంట లయింది. తల్లి వొంటిల్లు కడుగుతోంది. సుందరమ్మ దొడ్లో బాదంచెట్టుకింద కూచుని ఆలోచించు కుంటోంది. ఆమె భయమూ, ఆశ్చర్యమూ, కోపంగా అసహ్యంగా మారుతున్నాయి. ఏమిటి వాడిధైర్యం? తనని, తనవంటిదాన్ని, ఆపవిత్ర వంశస్తురాల్ని, ఆపండితుడి భార్యని, ఏమన్నాడు? ఏమనుకున్నాడు? ఆమె అభిప్రాయంలో చాలా నీచ స్త్రీలు మాత్రమే అట్లాంటిపనులు చేస్తారు. అంత నీచస్త్రీ కిందకట్టాడు తనని. ఇంక తనబతుకెందుకు? ఛీ, నీచుడు, బుద్ధిహీనుడు. వాడివంక చూడకూడదు. వాడితో మాట్లాడకూడదు.

"చూడు."

చంద్రశేఖరం తూలుతో వొస్తున్నాడు. హడలిపోయి, యిదేమిటా యీ దెయ్యమిట్లా పట్టిందన్నట్టు, ఒక్కమాటలేకండా యింటోకిపోతోంది.

"ఒక్కమాట. ఈమాట ఆఖరిమాట. నన్ను క్షమించాలి."

ఆగుమ్మంర దగ్గిర ఆగింది.

"ఇందాక నేనన్నమాట లన్నీ అబద్ధం. పూరికే అన్నాను."

"సరేలే!"

"నువ్వేటువంటి దానివో పరీక్షించడానికి

అన్నాను. ”

లోకంలో తనకి ముందు వేలకు వేలు పిరికి ప్రేముకులు యీమాటలే అన్నారని అతనికి తెలీదు.

“ నమ్ముతున్నావా ? ”

ఆమెకు మరీ అసహ్యం యెక్కువయింది.

“ సరేలే. వెళ్లు. ”

“ ఎవరితోనన్నా చెపుతావా ? ”

“ నాకేం పని ? ” అని వెళ్లిపోయింది.

నాలుగురోజులు సుందరమ్మ అతనివేపు వెళ్లలేదు. అతనికి భయమెక్కువయింది. చెప్పిందేమోనని ఇంటోంచి పారిపోదా మనుకున్నాడు గాని లేవలేక పోయినాడు. ముసుకుపెట్టుకుని పడుకున్నాడు. ఆదుర్దాపడి డాక్టర్ని పిలిచారు. డాక్టరు జ్వరంలేదు, పెంకెతనం లాగువుంది అన్నాడు. పరాధీనుల్ని చూస్తే డాక్టరకికూడా చులకనేకదా అనుకున్నాడు చంద్రశేఖరం. తిండిలేక పోవడంతో మోహమూ, జ్వరమూ, విరహమూ, మాయమైనాయి. కాని పాపం సుందరమ్మ నవనీతహృదయం తాళలేక పోయింది. తనవల్లనే అతను ఆవిధంగా లేవలేకండా పడుకున్నాడని దిగులుపడ్డది. ఇంకోహృదయం తన కోసం కోర్కెపడుతోందంటే, స్వయంగా యిష్టం లేకపోయినా స్త్రీ హృదయం సంతోషించకండా వుండడం సృష్టికే విరుద్ధం. సుస్వభావులు జాలిపడి తీరతారు. దుర్మార్గులు అదే వీలని స్వార్థాన్ని

సాధించుకుంటారు.

సుందరమ్మ అతనిపక్క దగ్గిర నుంచుంది.

"వెర్రివాడా! యేమిటీ పెంకితనం? ఎవరికన్నా తెలిస్తే నవ్వరా!"

మాట్లాడలేదు.

"మామయ్యతో చెప్పనా?"

అతని బలహీనత్వం ఆమెకూడా కనుక్కున్నది. మాత్రపని చేసింది.

"వొద్దు."

"మరి సరిగా పత్యం తీసుకుని లేచి తిరుగుతావా లేదా?"

"ఊహూ."

"ఐతే చెవుతా. "........."

"మరి యీపంతమేమిటి?"

"ఇది నీకు పంతంలాగు కనపడుతోందా? నిజంగా నాకేమీ సయించదు. నాబాధ యెవరితో చెప్పుకోను? దిక్కులేని వాణ్ణి! నాకు అమ్మా, అప్పా! ఇట్లానే మాడి చస్తే, లోకానికే పీడ వొదిలిపోతుంది. ఇట్లాంటి వెధవని నేను బతికేం బతక్కేం? నీకుమాత్రం యీదయ యెందుకు? ఈ నిర్భాగ్యుణ్ణి యిట్లా చావనీ."

ప్రతిమాటా, పాపం ఆవెర్రి హృదయంమీద మోగుతోందని తెలుస్తోంది అతనికి. ఆమె కళ్లలోని విచారమూ, ఆచేతుల ఆత్రుతా, పెదిమ వొణకడం,

అన్నీ తెలుపుతున్నాయి. యోచిస్తోంది. ఏం మాట అంటుందో, తన అదృష్టమెట్లా వుందో!అని అతి ఆత్రుతతో చూస్తున్నాడు.

"తప్పు. అట్లాంటి వుద్దేశ్యమే ఘోరమైన పాపం. నేనెన్నటికీ వొప్పుకుంటాననే ఆశపడకు. నీకైనా, నాకైనా చావే నయం."

నిరాశ! ఆపలుకుల్లోనే తెలుస్తోంది. ఆమె కంఠంలోని నిశ్చితత్వమే తెలుపుతోంది. కాని—

"చస్తాలే వెళ్ళు. పైగా వొచ్చి నన్ను ఏడిపించడం యెందుకు?"

"నీకు జ్వరంలో మతి చలించింది. కాకపోతే నీ దుర్మార్గం నీకు బోధపడి ఉండును. నేనెవరను కున్నావు? నా ప్రాణముండగా అట్లాంటిది జరుగుతుందని ఆశ పెట్టుకోకు." లాభం లేదని తెలుస్తోనే వుంది. కాని "నామీద యిష్టం లేదుగావును! అవును నేనేమి ధనవంతుణ్ణా, రూపవంతుణ్ణా—"

"చాలు. ఊరుకో. ఎవరైనా సరే, మాయింటా, వంటా లేదు. మా కుటుంబసంగతి నీకు తెలీదు. ఇక్కడ దిక్కు లేక చేరామని మమ్మల్ని ఏమేమిటో అనుకుంటున్నావు. అట్లాటి వెర్రిఆశలు పెట్టుకోకు. ఎవడైతే నేం— నేనేమిటి? నా మనసు మారడమేమిటి ?"

కళ్లు మెరుస్తున్నాయి. ప్రపంచాన్నే లెఖ్ఖచెయ్యక, తమ దీక్షలో, తపస్సులో, గర్వించి, అధి

కారాలనూ, ఐశ్వర్యాలనూ ధిక్కరించిన తనవంశీయ
పురుషుల తేజం ఆమెముఖంలో తాండవమాడింది.
శపించవచ్చిన పార్వతీదేవిలాగు, తన అద్భుత సౌంద
ర్యంతో వెలుగుతో నుంచుంది. చంద్రశేఖరం
విభ్రాంతుడైనాడు.

"క్షమించు. ఇంకెన్నడూ అట్లా అనుకోను" అని
కన్నీళ్లు పెట్టుకున్నాడు. ఆ ఒక్కమాటతో ఆమె
మనసు కరిగి, అతని దగ్గిరిగా కూచుని మీద
చెయ్యేసింది. పార్వతీదేవి, వరా లియ్యడానికి
సంసిద్ధురాలయింది. "నువ్వే, నువ్వు నాకో తమ్ముడు,
అట్లా వుండు. నాకు తమ్ము డుండా లని ఎంతో
వుండేది! మా అమ్మకన్న నాకే యెక్కువ ఆశ!
అట్లా వుండుగాని. ఏమి?"

కాని ఎంతఅగ్నిని మూటకట్టుకుంటుందో ఆదయ
వల్ల ఆమె యెరగదు. ఒక్కసారి పురుషహృద
యంలో మోహం మొలకెత్తిన తరవాత అది మచ్చే
కనపడక యెండకన్నా యెండాలి, లేక కాలుకింద
నలగనన్నా నలగాలి. కాని యిట్లా నీళ్లు పోసి,
యింకోదోవన తిప్పొదా మంటే, యెవరితరమూ కా
దని తెలీదు ఆమెకి. ఎటువంటి క్షుద్రుడికి తన
హృదయ సామీప్యాన స్థల మిస్తోందో ఆమె కెట్లా
తెలుస్తుంది? ఈసోదర ప్రేమ, పితృప్రేమ, 'అన్‌కుల్'
ప్రేమ, యిట్లాంటి విభజన లన్నీ, మాటల్లోనేగాని'
హృదయాలలో వాస్తవత్వం లేని విషయా లని

తెలుసుకోగలదా? దొంగతనానికి, మోసానికి వుప యోగించే చక్కని తెర లనే సంగతి తెలీనే తెలీదు.

లోకమంటే యేం తెలుసును? తనపుణ్యాలో కాలనువిడిచి, అన్యాయపు శాపంవల్ల దాటితప్పి, విచిత్రపాపలోకాలలో చిక్కి, వాటి సంగతి అర్థం గాక బాధపడే ఉపాకన్యవలె, పాపం సుందరమ్మ, ప్రతివిషయంలోనూ, కలవరపడుతోంది. తన వూళ్లోనే, యింటోనే, తన ఆచారంలో, పవిత్రతలో పూజలలో, అర్చనలలో, వుంటె ఇటువంటి నీచప్రజ ఆమెవంక కన్నెత్తి చూడటానికి వీలయ్యేదా? కాఫీకి, సన్నని చీరెలకి, పంపుదగ్గిర నీళ్ళకీ, చాకళ్ళకీ, సబ్బు బిళ్లలకీ, రైళ్లకీ, రోడ్డుదుమ్ముకీ, సిగరెట్టు పొగలకీ, లేకిచూపులకీ లొంగిపోయింది గనుకనే, సామాన్య బాలికవలె తోచింది, అంత చులకనగా అతని కళ్లకి!

"నేనింకో వుద్దేశ్యంతో అనలేదు. నామీద దయగా వుండమన్నాను అంతే" అన్నాడు గుటకలు మింగుతో.

"మంచివాడివి.

జబ్బు నయమై లేచాడు. అప్పణ్ణించి సుందర మ్మని జలగ మల్లే పట్టుకున్నాడు. ఎప్పుడూ తనకు కనపడుతో వుండాలి, వీలైనప్పుడల్లా దగ్గిర కూచో వాలి, మాట్లాడాలి. ఎవరన్నా అట్లా వెడుతున్న ట్టుంటే ఏమీ ఎరగనట్టు లేచిపోవాలి. చనువు తీసుకోపోతాడు. అది తమ్ముడి చనువుగా వుండదు.

తదేక దీక్షతో, దిగులుతో, ఏదో తనని ద్రోహం చేసినట్టు చూస్తాడు. ఆమె సౌందర్యంముందు దీపాన్ని తాకెందుకు వీలులేక, చుట్టూతిరిగి బతిమాలే పురుగు లాగైనాడు. కాని దీపం సహించ లేకుండా వుంది.

ఇదెక్కడ భ్రాతృత్వం కొని తెచ్చుకున్నాను అను కుంటోంది సుందరమ్మ. సాయింత్రం చీకటి పడు తోంది. బాదం చెట్టుకింద సుందరమ్మ కూచుంది. ఆసల్లో సన్నని చంద్రుడు వూగుతున్నాడు. ఎంతో శాంతంగా కూచుని ఆలోచించుకోవచ్చును కదా అనుకుంటో వుండగా చంద్రశేఖరం వొచ్చాడు.

"మధ్యాహ్నం రాలేదేం?"

"ఎందుకు వూరికే రమ్మంటావు?"

"ఇదేనా స్నేహం?"

"స్నేహమా? స్నేహమైతేమాత్రం? అమ్మ అడి గితే ఏం చెప్పను?"

"ఎందుకడుగుతుందేం?"

"ఎందుకడగదు?"

"నేను బలవంతం చెయ్యడమేగాని, నువ్వు నీ అంతట రావు కదా?"

"వొస్తున్నది చాలు."

"చాలా, చాలా, ఇదేనా? ఇందుకేనా నన్ను బతికించింది? నువ్వు చెప్పినవన్నీ అబద్ధాలేనా?" అని యేడ్చాడు. ఆమె మనసు కరిగింది.

స్త్రీ ఒకమాటవల్ల, చూపు వల్ల పురుషుడికి

సందిచ్చిందా, ఇంక అతని అధికారానికి, ప్రార్థనలకి, కోరికలకి అంతం వుండదు. అసలు పర్యవసానం అక్కర్లేని స్త్రీ మొదటినుంచీ విముఖంగానే వుండాలి. నిప్పు వొళ్లోనూ వుండాలి, కాలనూ కూడదని చాలమంది మూర్ఖుల ఆశ. కోర్కెలు హెచ్చుతున్నకొద్దీ, భయాలు హెచ్చుతున్నాయి. ధైర్యం లేని కాకి బతికిన కప్పని పట్టేట్టు, కొంచెం దగ్గిరికి వొచ్చి ఆశపెట్టేదీ, బాగా దూరంగా జరిగేది. వొదల లేదు, వొదలుకో లేదు. కావాలి, మళ్లీ అపాయం లేకండా కావాలి. ఇది చాలామంది ఆలోచించి కొలిచి, చేసి, సమీపించి ఇతరుల బాధచూసి, ఆనందిస్తారు. కొందరు యితరులకు బాధగావుంటుందేమో అనేది యోచించక, తమ స్వార్థాన్నే చూసుకుంటారు. పాపం సుందరమ్మబోటి అమాయకులు, అపాయమే వున్నదని తెలీనివాళ్లు, గోతులో పడతారు.

ఇంకో రాత్రి దీపందగ్గిర కూచుని చదువుకుంటోంది సుందరమ్మ. అరుగు అవతల చివర కూచుని, తగ్గించిన కంఠస్వరంతో చంద్రశేఖరం మాట్లాడుతున్నాడు. రాత్రి పదిదాటింది. అతను నొచ్చుకుంటాడనే భయంతోనే ఆమె కూచుంది అంతసేపూ మేలుకొని.

"ఈరాత్రి నువ్వెంతో బావున్నావు."

సుందరమ్మ మాట్లాడలేదు.

" మాట్లాడవేం? "

" ఏం మాట్లాడను? "

" అవును. నాతో మాట్లాడాలంటే నీకు ఏమీ తోచదు. "

మాట్లాడ లేదు.

" పోనీ, ఇష్టం లేదన రాదూ? "

ఏమీ చాతకానప్పుడు పోట్లాటవల్లనైనా సామీప్యం దొరుకుతుం దేమోనని ప్రయత్నిస్తారు మానవులు.

సుందరమ్మ పోట్లాడదు. మాట్లాడదు. అతని కేదో వాగ్దత్తం చేశామే, నమ్మించామే అనుకుంటుంది, అతని రోదనవల్ల.

చుట్టుచూశాడు. అతనికాంక్ష అతనికి సాహసాన్నిచ్చింది. చప్పునలేచి దగ్గిరికి వెళ్లి కూచున్నాడు. ఆమె తలవొంచుకు చదువుకుంటోంది. మీద చెయ్యి వెయ్యాలనుకున్నాడు. కాని కోపంవస్తే, ఆమెకువున్న దయకూడా — యీమాత్రం చనువుకూడా తప్పిపోతే! కాని నెలలనించి తాను పడుతున్న బాధ తలుచుకున్నాడు. ఎన్నాళ్లయినా ఇంతేగదా? చెయ్యి యెత్తబోయినాడు. వూరుకున్నాడు. ఏమీతోచక కూచున్నాడు. ఆమెమెడమీద పురుగు పాకుతోంది. పురుగుఅని తీసేశాడు.

మళ్లీ చెయ్యిఅక్కడే పెట్టాడు.

దూరంగా జరిగింది.

" ఎందుకు దూరంగా వెడతావు? "

" నన్ను తాకవొద్దు. "

" ఇంతలో ఏమయింది? "

" నాకు యిష్టంలేదు. అట్లాతాకితే నేనురాను."

" ఎంత బావున్నావూ! "

"బావుంటేబావున్నాను."

తనకేమీ లాభం లేదని తెలుస్తోంది. కాని కోపం ఎక్కువవుతోంది. అతనిమీద ఆమె దయ తలిచివుండకపోతే, అతను గౌరవంగా దూరంనించే పూజించి వుండును. కాని యిప్పుడు తనని నమ్మించి మోసంచేసినట్టు కనపడుతోంది అతనికి.

"ఒకటే పురుగులు!" అంటో చప్పున దీపం ఆర్పి ఆమెమీదపడి చేతులతో పట్టుకుని, తన ముఖంతో ఆమె ముఖాన్ని వెతుకుతున్నాడు. ఒక్కనిమిషంలో విడిలించుకుని తటాలున లేచింది. ఇంకా మోకాళ్లు పట్టుకుని వేళ్ళాడుతున్నాడు. కాళ్ళు యీడ్చుకుని వొదిలించుకుంది.

"ఛీ, దుర్మార్గుడా, పాపీ, ఛీ, ఛీ, పాడుబతుకు! పాడులోకం! ఛీ, ఛీ, పాపపులోకం!" అనుకుంటో లోపలికి వెళ్ళిపోయింది.

చంద్రశేఖరం ఆమెమీద తాచువలెపగపట్టాడు. ద్వేషానికీ మోహానికీ చాలా సన్నిహితం. రెండూ వున్నాయి అతని మనసులో. ఆరాత్రి శపథం తీసుకున్నాడు, లోకాలన్నీ ఏమయినాకానీ, సుందరమ్మని అనుభవించాలనీ, లోబరుచుకోవాలనీ. "ఇప్పు

డేమంటావు?" అని బిగ్గరిగా నవ్వాలనీ, తనను ప్రేమింప చేసుకుని, తాను తృణీకరించి, ఏడిపించాలనీ — చంద్రశేఖరం — ఉదారత్వంలో, సహృదయుత్వంలో, ఆత్మవిశాలత్వంలో, పావనత్వంలో, తేజస్సులో, అందంలో, దేనిలోను ఆమె గోరుకు పోలని చంద్రశేఖరం, యీకృత్రిమ ప్రపంచ సహాయంతో, స్త్రీని గాజుపాత్రవలె ప్రతినిందకూ, అనుమానానికీ, గాయపడేట్టు, అతిహీనంగా చేసి, ఆమె రోదనానికి బధిరమైన యీనాగరికతా సహాయంతో వశపరుచుకోవాలని చూశాడు.

తాను చేసిన పని యెవరితోనూ చెప్పని ఆమె వుదారత్వమూ, తనమీద జాలిపడి, యిష్టం లేకపోయినా ఆదరించిన ఆమెదయా, తన నీచత్వాని, క్షుద్రత్వాన్ని మరిచిపోగలిగిన ఆమెసౌశీల్యమూ, పరపురుషుడంటే కన్నెత్తని ఆమె నిర్మలత్వమూ, ఆమె సౌందర్యములోని శుభతేజస్సు, ఏమీ అతని మనస్సుని మార్చలేదు.

ఏనిందవచ్చినా స్త్రీకదా మొదట భరించవలసింది? ఆమె తన బాధ చెప్పుకున్నా తప్పు ఆమెదే అంటారుకదా! పురుషుడు దౌర్జన్యంచేసినా, పవిత్రుడే. పతిత, అయ్యేది ఆమే కదా! సృష్టితన ముద్రను ఆమె ఉదరంమీదనేకదా లిఖించేది! పురుషుడికన్న జిత్తులతో టక్కరన్నా కావాలి, అతనికి స్థలమివ్వని పాషాణమన్నా చేసుకోవాలి హృద

యాన్ని. ఎక్కడా బయటపడని మోసగత్తె, అబద్ధీకు రాలన్నా కావాలి, లోకంలో కీర్తిపొందాలంటే! మంచివారని కీర్తిపొందిన స్త్రీలందరు, యీజాతిలో ఒకదానికి చెందినవారే! దయ, రసన, న్యాయము, సత్యము—యీసుగుణాలే స్త్రీని అధోగతికి లాగే గుణాలు.ఇటువంటి అధోగతికి తెచ్చింది స్త్రీని యీ పాతివ్రత్యాదర్శము; యీపవిత్ర సిబంధన.

౪

మళ్లీ నెలలు గడిచాయి తన ఆఖరు 'డెస్పరేట్' ప్రయత్నంకోసం సమయం కనిపెట్టివున్నాడు చంద్రశేఖరం. ఆమెతో మాట్లాడడు. ఆమెవొంక చూడడు. ఆమె చాలసార్లు కనికరించి మాట్లాడాలనుకుంది. కాని అతని కోపలక్షణాలు చూసి మానింది.

వెంకట్రామయ్య కుటుంబంవారు పెళ్లికి వెళ్లారు. ఆయన మేడమీద పడుకున్నాడు. తల్లి వంటింటో పడుకుంది. గుమ్మానికెదురుగా హాలులో సుందరమ్మ పడుకుంది. ఆరాత్రి తన విజయవ్యూహం పన్నాడు చంద్రశేఖరం. తాను పూజించిన దేవతలందరూ, తమ వంశాభివృద్ధికోసం క్షేమంకోసం, వాళ్లు ఆహ్వానించిన దేవతాశీర్వచనాలన్నీ ఆమెను కాపాడుతున్నారన్న అభిప్రాయమున్నట్టే నిద్రపోతోంది సుందరమ్మ. ఏకలతా లేనిమనసుతో, ముసుకున్నా

అందాలోలికే కళ్ళతో, వూపిరితోపాటు వొంపులుగా లేచిపడే తెల్లని నిర్మలవక్షంతో, వొంటి వొంపుల్ని వ్యక్తపరిచే సన్నని చీరెకుచ్చెళ్ళతో— తన జీవితాన్నంతా మార్చి, మాడ్చి, రూపులేకుండా నాశనంచేసే, ప్రళయం సమీపిస్తోందనే ధ్యాసే లేకండా నిద్ర పోతోంది ఏ పితృదేవతలూ, కలలోనన్నా ఆమెకు హెచ్చరిక నివ్వలేదు. ఏదోమ రూపాన కూడా ఏదేవతలూ, ఆమెకి మెళుకువ తెప్పించ లేదు. ఎవరూ లేరో, వుండి సహాయం చెయ్యరో, యీపూజలు ప్రార్థనలు, జపాలు, మంత్రాలు, అన్నీ ఏమిలేని శూన్యంలోకి పంపుతున్నారో, ప్రజలూ, ఆదేవతలూ, దెయ్యాలూ, ఆత్మలూ, వుండికూడా సహాయం చెయ్యలేవో, ఏపాపంవల్ల, యిట్లాంటి ఘోరవిపత్తు తనమీదికి తానెరగకండా తెచ్చుకుందో ఏమీ ఎరగనిది, పరమపావనురాలు, దయాపూరిత హృదయ, ఒక్కచీమకు హాని చెయ్యనిది, ఒక్క కల్మషమైన ఆలోచన లేనిది, లోకక్షేమానికై నిరంతరమూ దేవతల్ని యాచించేది, సుందరమ్మని, రెక్కలు విరిగిన పక్షిని పిల్లినోటి కందిచ్చే విధాత, సృష్టికర్త చంద్రశేఖరానికి వప్పచెప్పాడు.

అర్ధరాత్రి మెల్లిగా లేచి హాలు తలుపుదగ్గిర నుంచున్నాడు. సంతోషించాడు. ఇట్లా ఆలోచిస్తే, తనగతి అంతేవని వురెక్కించుకున్నాడు. గుమ్మంలోకి పోయి ఆమెని చూచాడు. నిష్కారణమైన జాలి

తలెత్తింది. నొక్కి చంపేశాడు. ఆమె అందాన్ని చూసి, తనకు కలగబొయ్యే సౌఖ్యాన్ని తలుచుకున్నాడు. దీపమార్పెయ్యాలా? ఆమె అరిస్తే? కాని అరిచేదైతే తనని చూడగానే యింకా అరుస్తుంది. జాకెట్టు లేకండా ఆమెని చూడాలని వుంది. ఆచీరె లేకండా కూడా ! కాని ధైర్యంలేదు. వెల్లి చప్పుడు కాకండా ప్రవేశించి దీపమార్పాడు. ఎన్నాళ్లనించో కోరుకుంటున్న సౌఖ్యం లభించపోతోంది. ఆతృతవల్ల కొంతభాగమూ కామోద్రేకంవల్ల కొంతభాగమూ, రక్తం కొత్తకొత్త మార్గాల అతనెన్నడూ ఎరగని విధాల ప్రవహిస్తోంది. తన మనోరథం సఫలమన్నా కావాలి, లేక ఆయింటోంచి తన్నులుతిని లేచన్నా పోవాలి. చీకటయ్యేప్పటికి అతనికి ఏమి కనబడలేదు. మంచమెటో ఆమె యెటువుందో కూడా తోచలేదు. తల తిరుగుతోంది. ఇప్పుడు చూచిన వెస్తువులే ఎంతనిగూఢమై పోయినాయో ! మెల్లిగా అడుగు మీద అడుగు వేస్తో వెళ్లాడు. మంచం తగిలింది. ఆగిచేత్తో మెల్లిగా యిటూ అటూ వెతికాడు. ఆమె తొడతగిలింది. ఆమె తలనితాకి చూసుకుని, పక్కనే పడుకొని ఆమెమీద చెయ్యివేసి బుగ్గమీద అనుకున్నాడు. ఇంతవరకు స్త్రీ నెరగక, ఎప్పుడు యిట్లాంటి సౌఖ్యం దొరుకుతుందా అని కాచుకుని వున్న అతనినరాలు మహదానందంలో వూగులాడాయి. గొప్పసంతోషం సంతుష్టి కలిగి, భయమే

మరిచి పోయినాడు.

ఆమెకి మెళుకువ వచ్చింది. చటాలున పురుగునో, పామునో తోసేసినట్టు రెండుచేతులతో నెట్టింది. కాని, ముందే ఆలోచించుకున్న ప్రకారం అతను గట్టిగా తనచేతిని ఆమెనోటికి కడ్డంపెట్టి యిట్లా అన్నాడు:

"నే నేమీ చెయ్యను. నామాట ముందు విను. తరవాత నీయిష్టంవొచ్చినట్టు చెయ్యవొచ్చు. బాబుగారితో చెప్పి చెప్పుతో కొట్టిస్తే పడతాను. నేను యెట్లానూ పోవడానికి సిద్ధపడ్డాను. నీకు వొచ్చిన అపాయం లేదు. అరవకు. నామాట వింటా నంటే నా చెయ్యి తీస్తాను."

ఆమె పెనుగులాడడం మానింది. చెయ్యి తీశాడు.

"ముందు యీ చెయ్యి తియ్యి."

తీశాడు.

"న న్నంటకుండా అట్లా నుంచో."

దూరంగా జరిగి కూచున్నాడు.

"చెప్పు."

"నేను ఎంతకాలంనించో నిన్ను మోహించాను. కాని నువ్వు నామీద దయ చూపలేదు. పైగా మోసగించావు. ఇంక నాకు జీవితంమీద నిరాశ పుట్టింది. నీదయ లేక నేను బతకలేను. నువ్వు వొప్పుకుంటే, నాఅదృష్టం, నీపేరు చెప్పుకు బతుకుతాను. వొప్పుకోవా నీముందు యిక్కడే చచ్చిపోతాను."

సరిగా ఆమె మనసును కరిగించ గల మాటలు అతనికి తెలిశాయి. ఆలోచించకండానే ఆచీకట్లో కూడా అతనికి తెలుస్తోంది ఆమె జాలిపడుతోం దని. అతనిమాటల్లో వున్న సగం వాస్తవమైన బాధా గుర్తించింది. కాని, తక్కినసగంనాటకాన్ని గుర్తించ లేదు. అబద్ధీకులైతేనే గాని అబద్ధాన్ని గుర్తించ లేరు. కాని యింకా ఆమెశీలం ఆమెజాలికి అడ్డుపడు తోనే వుంది. నిజంగా చచ్చిపోతా డని నమ్మింది. పురాతనంనించి పెరిగిన సర్వభూతదయ, పరప్రాణి కోసం తన సౌఖ్యాన్ని త్యాగం చేసిన ఔదార్యం, బ్రహ్మహత్యాపాతక మహాభయం, అతిధి మోహ తృప్తికోసం శీలాన్ని అర్పించిన మహాపతివ్రతలకథలు అన్నీ ఆమె నిశ్చయాన్ని బలహీనపరిచాయి.

"తప్పు. పాపం."

తనని తృణీకరించకుండా, 'ఆర్యూ' చెయ్యడం లోని బలహీనత్వాన్ని కనిపెట్టాడు. ఆమెమీదికి వొంగి కావిలించుకున్నాడు.

"ఫో."

"వెళ్ళను."

"అరుస్తాను."

"కానీ. నన్ను చంపించు. నేను వొదల్లేను."

తప్పించుకునే పిట్టను పట్టుకొని వేళ్లాడే పిల్లివలె పెనగులాడాడు.

"పిలుస్తాను. నిన్ను చంపుతారు, పో."

"పిలు. చంపనీ. నా ప్రాణాల్ని నీకోసం అర్పిస్తాను."

"ఎవరన్నా చూస్తే!"

ఆమాట స్త్రీనోటినించి వొచ్చిందా, ఇంక భయం లేదు. ఆహ్వానంతో. తుల్యమైనది. సంతోషంతో, స్వతంత్రంగా, మాట్లాడకండా, యింకా ఆక్రమించుకున్నాడు. చేతివేళ్ళు, ఎవరూ, ఆభర్త తప్ప, ఎవరూ, తాకని, తాకకూడని స్థలాల్ని వెతకి, అపవిత్రం చేసి అనుభవిస్తున్నాయి. సృష్టి, కష్టపడి నునుపు పెట్టిన మృదుభాగాలు, దేవతలకైనా చూడడానికైనా అర్హత వున్నదా అనిపించే భాగాలు, ఏ అందాన్ని కల్పించగలమా అని చిత్రకారులు నిరాశ చెందే మృదుత్వమూ లావణ్యమూ గల అవయవాలని తాకే అదృష్టం, ఎట్లా సంపాయించాడో ఆ యువకుడు! ఏపూజలు చేసి, ఏదేవతల్ని తృప్తిపరిచాడో !

ఆమె శరీరం తిరగబడి, అతన్ని అభిలషించింది. ఆనందించింది. ఇంకా దగ్గిరగా కోరింది. పాపం, యింకా ఆమె ఆత్మ తిరుగబడుతోనే వుంది. 'లోబడి పోతున్నావు, ఇంక వెనక్కి మార్గం లేని మహాకూపంలో పడుతున్నావు. వొద్దు' అని అరుస్తోంది

"ప్రమాణం చెయ్యి."

"నీ కళ్ళమీద, యీ......మీద ప్రమాణం చేస్తున్నాను."

ఆ రెండోమాట ఆమె వినలేకపోయింది.

"ఛీ" అని అతనిమాటనూ, అతన్నీ విదిలించింది. పవిత్రత హీనస్వరంతో అసహ్యపడుతోంది. కాని యీ దేహానికి సంబంధించిన నరాలు అతన్ని దగ్గిరిగా పిలిచి ఆమెనోరు నొక్కాయి. అంతే; ఆఖరు. గొంతు బిగిసి వూపిరాడలేదు. అంతరాత్మ అనేది కళ్లు తేలవేసింది. దేహంవిజృంభించి రాజ్యం చేసింది. ఆమె రెండు చేతులూ అతని నడుంమీద వేసి ఆ అల్పుణ్ణి మళ్లీ మళ్లీ లాక్కుంది. అతని చేతుల్నీ బుగ్గల్నీ కరిచింది. జుట్టుని చీదరగా లాగిలాగి నరాల బాధ తీర్చుకుంది. అతన్ని ఆనంద డోలికల్లో వూగించింది.

"వొద్దన్నావు!" అని విజయభేరి మోగించాడు ఆ నీచుడు.

"మాట్లాడకు" అంది ఆమెశరీరం.

అలిసి తనపక్కన సోలిన చంద్రశేఖరాన్ని చూసి అతిజాలితో కౌగలించుకో బోతోంది. కాని ఆ మహా ద్రుష్టం అతనికి లేదు. ఈ ప్రపంచంలో కృతజ్ఞతతో స్త్రీలు యిచ్చే బహుమానాల్లో కల్లా బహుమానమయిన ఆ కౌగిలిని స్వీకరించే ఔదార్యం అతనికి లేదు.

అతను బనియను సర్దుకుంటో వూడేబట్టని ఒక చేత్తో పయికి కట్టుకుని పక్కదిగి కాళ్లు తుడుముకుంటో వెళ్లి పోతున్నాడు. అతిదయతో అతనివంక ఆమె, వాన వెలిసిన తరవాత మబ్బులవంక సూర్యుడు

చూసే చూపువంటి ఆమె చూపుగాని...తరవాత అతి తృణీకారంతో అతనివంక చూసిన వెనక చూపు గాని అతను ఆచీకట్లో చూడలేదు......

"నువ్వు చేసిన పనేమిటి? ఆలోచించాలి. పట్టు" అంది ఆమె అంతరాత్మ. "నోరు మూసుకో. అయి పోయిం దేదో అయిపోయింది, ఇంక అది మళ్లీ జరగ బోవడం లేదు. ఇంకెందుకు అప్రస్తావన" అంది ఆమె మనస్సు. "కాదు. ముందు నీ నీచత్వం తెలుసుకుంటే ఏనాటి కయినా మంచిది" అంది అంతరాత్మ. "నాకు నిద్రవొస్తోంది. అయినా నేనేమీ ఆ విషయం ఆలో చించ తలచుకోలేదు. ఇంక పడివుండు" అని కసిరి ఆమె నిద్రపోయింది.

తెల్లవారగట్ల పెద్ద భయంతో ఆమె వులికిపడి లేచింది. ఏదో కల వచ్చింది. జ్ఞాపకం తెచ్చుకోవా లంటే చేతకాలేదు. పక్కమీద వొణుకుతో కూచుంది. దీపం వెలిగితే బావుండును! కాని కాలు గాని చెయ్యిగాని కదిలించడానికి భయం. నిప్పు పెట్టె యెక్కడవుందో! మెల్లిగా అమ్మని పిలిచింది.

"ఎందుకే?"

"నాకు భయమేస్తోందే."

"భయమా? ఎందుకు భయం? భయమేమిటి! ఇట్లా వచ్చి పడుకో..." అంది తల్లి. ఆమె కంఠం వినేప్పటికి కొంచెం భయం పోతోంది. ప్రయత్నించి మెల్లిగా లేచి వెళ్లి తల్లి వీపువైపు పడుకుని ఆమెని

కావిలించుకుంది. అంతరాత్మ మళ్లీ మేలుకుంది. "సీతల్లి ఎంత సాధ్వి! పాపం నువ్వు చేసిన నేరాన్ని ఎరగదుకదా! ఎన్నడూ ఇటువంటి నీచాలకు లోబడ్డది కాదుకదా సీతల్లి! నిన్ను ఇంత ప్రేమించి నమ్మి నందుకు చివరికి ఇట్లా చేశావా? దిక్కు లేక-డబ్బు లేక-ఇతరుల పంచను తల వొంచుకొని బతుకుతో ప్రాణాలన్నీ నీమీదే పెట్టుకొని వుంటూన్న సీతల్లిని ఎంత అన్యాయం చేశావో తెలుస్తోందా?"

అంతరాత్మని తిట్టి వూరుకోమని సుందరమ్మ నిద్రపోయింది.

మర్నాడు, రాత్రిసంగతి తలుచుకున్నప్పుడు-భర్తా- ఆయనతో తాను గడిపిన రాత్రులూ జ్ఞాపకం వొచ్చాయి. కాని ఆ ఆలోచనల్ని తోసేసి పగలంతా పనుల్లోనూ మాటల్లోనూ గడిపింది. రాత్రి పడుకోడానికి వచ్చి పక్క చూసేప్పటికి అనాలోచితంగా పెద్ద సంతోషం వచ్చింది. అది వుత్తమంచం కాదు, దుప్పటికాదు, జీవితానికంతా వెలుగునిచ్చే మహాశక్తితో పవిత్రమయింది. ఆనందానుభవంవల్ల సుందరమయింది. చూస్తోనుంచుంది. వెంటనే తన ఆనందానికి భయం వేసింది. ఏమిటిది? ఆపాపకార్యం-నీచకార్యం తలుచుకుని సంతోషపడుతోంది తాను. ఇంక తనగతి ఏంకాను? అసలు అతను వస్తాడా?... ఆ ఒక్క రాత్రేనని వాగ్దానం చెయ్యలేదా అతను? ...రాడు. రాకపోతే తనకు తోచదు. చంద్రశేఖ

రము- ఆమె కామజ్వరానికి మందివ్వగల చంద్ర శేఖరం ఆమెశరీరం ద్వారా హృదయాన్ని ఆక్ర మించుకున్నాడు. అతని నీచత్వం - అతను ప్రాథేయ పడడం - అన్నీ తన దేహసౌఖ్యంలో అనుభవానం దంలో మరిచి పోయింది.

సాధారణంగా కవులు స్త్రీహృదయానికి మార్గం ఆమె మనస్సు అంటారు. కాని చాలా హృదయా లకి మార్గం రెండో చివర వుంటుంది. అందువల్లనే సామాన్యస్త్రీలంతా పెండ్లిచేసుకొన్న పురుషుణ్ణి ఆరాధించడానికి వీలు అవుతోంది. స్త్రీ నిజంగానే కళ్ళుతెరిచి పరీక్షించి ఏరుకునేట్లయితే యీ మొగ వాళ్ల కెవరికయినా వివాహయోగ్యత వుంటుందా? కుక్క హృదయంలో అపారమైన ప్రేమ అనే "ఇన్ స్టింక్టు' వుంది. దానిని ఎవరిమీదనో ఒకరిమీద కనపరిస్తేనే కాని కుక్కకి శాంతి వుండదు. అందుకని ఆమనిషి స్వభావం ఎటువంటిదా అని యోజించ కండా ఒకముద్ద అన్నం పడవేసిన వాణ్ణి ప్రేమించి తనని తన్నినా, వెంటబడి ఆరాధించి తన జీవితాన్ని సార్థకం చేసుకుంటుంది. చాలామంది స్త్రీ లింతే.

పూలమొక్క తీగె సాగేసరికి దేనిమీదనో ఒక దానిమీద అది పాకాలి. పాకకుండా బతక లేదు. ముళ్ళచెట్టుగాని, చెదలుపట్టిన కర్రగాని ఏమీఆధార మివ్వని రాయిగాని దగ్గరలోవున్న దేన్నయినా గాని ఆధారం చేసుకుని పాకుతోంది. అలాగే స్త్రీకూడా

సంఘమో, విధో, అదృష్టమో, యజమానో, ఎవరో దేన్ని ఆధారంగా చూపితే దాన్ని వివక్షత లేకండా గుడ్డిగా ఆధారం చేసుకున్ని ప్రావిలించుకుం టుంది. తన యవ్వనాన్నీ, తన సౌందర్యాన్ని, తన పూజ్యభావాలనీ - సమస్తాన్ని అర్పించి ధన్యత పొం దుతుంది. ఆమోదుని, వాననించి, ఎండనుంచి, శత్రు వులనించి, కష్టాలనుంచి కాపాడే ప్రయత్నంలో తన శరీరాన్నీ తనయావత్తునీ అర్పిస్తుంది. ఆ మొద్దునే అధికుడంటుంది. రసికుడంటుంది. స్వర్గమంటుంది. దైవమంటుంది.

ఆ సౌందర్యమూ, ఆస్వర్గమూ, ఆరసికత్వమూ, తన హృదయంలోనే కాని ఆ మొద్దులో ఆమోదులో లేవని తెలుసుకోలేదు. ఏ వెంకటచలమో కథలు వ్రాసి కళ్ళు తెరిపించేదాకా ఒక నీచుడి కాళ్ళకిందపడి దొర్లుతో అదే స్వర్గం అదే ఆనందం అనుకుంటుంది.

అన్నిసమయాలలో కళ్ళు తెరవరు. తెరవలేరు. తెరిచేశక్తీ ధైర్యమూ వుండదు. వాస్తవమయిన విలువా జీవితంలోని కాపట్యము, తెలుసుకుంటే అక్కడ ఒక్క నిమిషం ఆ నిర్జీవక్షుద్రపరిస్థితులతో తృప్తి పడి బతకలేరు. గతాభిమానలై గాయపడి తమ అల్పత్వాన్ని గుర్తించి తిరుగుబాటులో దౌర్జన్యంలో తమ కోమలత్వాన్నీ సూనృతాన్ని భగ్నం చేసుకుం టారు. ప్రయత్నించి వివేకంతో సాహంసతో, నూతనంగా జీవితనాశాన్ని మళ్ళీ చిగిరింప చేసుకో

గల శక్తిగలవారు అరుదు. అందువల్లనే లోకంలో ఇంత అలసతా, అబద్ధమూ, కపటమూను; సంస్కార మంటే, నూతనత్వ మంటే యింత ద్వేషం.

"వొస్తాడా?...రావడానికి గుండె లున్నాయా? వాగ్దత్తం చేసి పయిగా సిగ్గులేక భయంలేక వొస్తాడా? వొస్తే...తనని ఎంత నీచురాలినిగా అను కుంటున్నా డన్నమాట! ఇష్టం లేకపోయినా శరీర సౌఖ్యానికి దాసురా లయ్యేరకం మనిషిని అని తలి చాడు కాబోలు!"

అయితే ఆమె అంతరాత్మకి తెలుసు; శరీరంకోసం దాసురా లయ్యే మనిషే నని. కాని మనోవీధిలోకి ఆ తలపుకు రానీదు ఆమె. ఒప్పుకోదు నిజ మని. ఒప్పుకుంటే ఆమెకు శాంతి వుండదు. ఆ వాస్తవం ఆమె మనసుని కొలుస్తుంది. కనక ఆ ఆలోచన నొక్కిపట్టి తప్పు అంతా చంద్రశేఖరంమీద నెట్టింది.

"ఒకవేళ మళ్లీ వొస్తాడేమో? ఎట్లా? వొస్తేనేం, తనకి యిష్టం లేకపోతే ఏం చేయగలడు" అని ఆలో చించలేదు. అట్లా ఆలోచించదు. "పోనీ అమ్మదగ్గిర పడుకుంటే అప్పుడు అతను రావడానికి వీ లుండదే? రాకపోతే ఎట్లా? వీ ల్లేదు." ఆ ఆలోచన రాకూ డదు. అవును. త నెందుకు పడుకోవాలి అమ్మదగ్గిర? భయమా? తన కేం భయం? త నెందుకు భయప డాలి? "భయపడుతున్నట్టు తెలిస్తే మరీ మితిమీరు తాడు. గౌరవమే పోతుంది. రానీ వాడికి బుద్ధి

చెప్పాలి. వెధవ! రానీ! చెపుతా! రాకపోతే ?...
వొస్తాడులే. వొస్తే బాగా తిట్టి వాణ్ణి ఏడిపించి పంపి
తేగాని కసి తీరదు. వొస్తాడులే, రాకుండా ఎట్లా
వుంటాడు? రాత్రి ఎంత ఆనందించాడు? వొదులుకో
గలడా? వొస్తాడు," అనే ఆలోచనలలో తన మనో
వాంఛను పాతిపెట్టి తనను తానే వంచించుకుని నిద్ర
పోయింది.

నిజంగా వొచ్చాడు.

ఆమెకి వొళ్లు తెలియకముందే అతను నియుక్తు
డయినాడు.

పెద్దభయంతో ఏదోఘోరంస్వప్నంలోనించి బాగా
కళ్లు తెరిచింది.

"ఛీ, పో." అని బిగ్గిరిగా అంది.

"అరవకు. నేను బతకలేక వొచ్చాను." అని తన
పాతరాగం ప్రారంభించాడు అతను

"అమ్మని పిలుస్తాను."

"పిలు. నీకే నష్టం?"

తనకు లోబడిన స్త్రీని, ఆమె కెంత ఘనత వున్నా
లేన, తక్కిన విధాల ఎంత ఆధిక్యం ఆమెకి వున్నా
లేస పురుషుడు గౌరవించడు.

అతన్ని ఆమె నెట్టివేయడమూ అత నామెని
బలవంతం చెయ్యడమూలో ఇద్దరూ అసలు సంగతి
మరిచి కుస్తీ ఆరంభించారు. ద్వేషాలూ, తిట్లూ,
ప్రార్థనలు, ప్రాధేయపడడమూ, ఒట్లూ, పట్లూ,...

జరిగినయి. స్త్రీ అంగీకారం లేంది ఎంత బలవంతు డయినా పురుషుడు నిస్సహాయు డనే సృష్టి నిర్ణయం వ్యక్త మయింది.

ఓడిపోయి సిగ్గేసి స్త్రీ చేతుల్లో అపజయాన్ని భరించలేక చంద్రశేఖరం ఏడ్చాడు అలిసి చెమటలు పోసి విసుగెత్తి ఆ పట్టుదల తనకు ఎందుకో అర్థం కాని సుందరమ్మ చంద్రశేఖరం కన్నీళ్ళవల్ల గొప్ప జాలిలో కరిగిపోయి అతన్ని చప్పున కావిలించు కొన్నది. కాని మరుక్షణమే తన మూఢత్వం, బల హీనత్వం అర్థం అయినాయి. కాని కాలం దాటి పోయింది. లాభం లేకపోయింది.

అతనికోర్కె తీరింది. తన చేతుల్లో సుందరమ్మ గాని కొయ్యబొమ్మగాని ఏ దయినా ఒకటే ననిపిం చింది అతని కంఠకుపూర్వమే. పక్కన కూచుని ఆమెవంక చూచాడు. ఆమె దేహం దేహమే కానట్లు జీవమే లేనట్లూ కప్పుకేసి చూస్తో తనస్నేహం లేని సుందరమ్మని చూసేప్పటికి అతనికి సహితం తన నీచ త్వం మనసుకు తట్టి లేచినవాడు కాళ్ళు రాక అట్లానే నుంచున్నాడు.

"మాట్లాడవేం" అన్నాడు. దెబ్బతిన్న లేడి వేట గాడివంక చూసినట్లు ఆమె అతనివేపు చూసి గుడ్లు తిప్పి కళ్లుమూసుకుంది. "కోపమా?" అన్నాడు. ఆమె మాట్లాడలేదు. ఆమెకి పెద్దదిగులు పట్టుకుంది. ఇంక తనకి శక్తిలేదు. తన బతుకంతా ఇట్లా పాపం

లో నీచత్వంలో గడపవలసిందే. అంతే. పీడువొదలదు, వొదలలేదు. వొదిలినా ఏ పురుషుడు సమీపించినా నిగ్రహించే శక్తిలేదు. ఇంతే, ఎప్పుడూ ఇంతే, అని మూలుగుతోంది హృదయం.

“దుఃఖమా?” అని మళ్లా అతను అడిగాడు. మాట్లాడదు ఆమె. అతనికేమీ సంతుష్టిలేదు. ఏ అద్భుతలావణ్యాన్ని చూచి భ్రమిసి అతను ఆమెని కోరాడో ఏ అందాన్ని చేతుల్లో పట్టుకుని దాచుకోవాలనుకున్నాడో అది గాలిలో మెత్తదనంలాగు పువ్వుల్లో లేతరంగులాగు తననించి తప్పించుకుంది. ఆ చీకట్లో ఆభయంలో ఆ సుందరమ్మ అయితేనేం ఆమె తల్లిఅయితేనేం? భేదం స్వల్పమే. అతనికి ఎముకలూ మాంసమూ చిక్కినట్టు తోచింది. ముఖ్యంగా యీ ఆనందంలేని నిర్జీవమయిన సుందరమ్మ ఎందుకు? ఈ కారణంవల్లనే రహస్యవ్యభిచారంలో ఎంతో ఆనందం వుందనుకొని వూటలూరిన మానవులూ ప్రాణాన్ని సహితం వదిలే అపాయాల్లోకి దిగేరసికులూ చివరికి దానిలోని నిస్సారాన్ని అనుభవించి చాలా త్వరలో విముఖులై నీతిబోధకులు అవుతారు.

“నీతో మాట్లాడాలి. లేచిరా” అన్నాడు చంద్రశేఖరం. ప్రశ్నార్థకంగా కళ్లు విప్పి మూసుకుంది ఆమె. “రావాలి. తప్పదు” అని ఆమె చెయ్యిపట్టుకు లాగాడు. మాట్లాడకండా లేచి గుడ్డిగా అతని వెంటనే

నడిచింది బావివెనక నిమ్మచెట్టు కింద ఆగాడు. అపరిమిత మయిన చలిగావుంది. ఆకుల్లోంచి మంచు బొట్లు పడుతోన్నాయి. చంద్రశేఖరం ఏడ్పు మొదలెట్టాడు. ఆమె తనకి సంబంధం లేనట్లే నుంచుంది. తనదుఃఖ్ఖం ఆమెని కదిలించలేక పోవడం, తన చివరిఆయుధం కూడావ్యర్థం అయిపోయిన మహారథుడి స్థితిని కల్పించింది అతనికి.

"ఇంకెప్పుడూ నీజోలికి రాను. నిన్నిట్లా క్షోభ పెట్టను. నిజం. ఒట్టు."

వాగ్దానాలు అతని నోట్లోనేగాని మనసులో పని చెయ్యవు. "మాట్లాడు. నామాటలు నమ్ముతున్నావా? లేదా?"

"సరే."

"సంతోషంగా లేదూ?"

"నీయిష్టం. కాని నన్నిట్లాచేస్తే నాకు బతుకుమీాద నిరాశ పుడుతుంది. నీయిష్టం." తన బలహీనత్వంలోపాన్ని కప్పేందుకు అతన్నించి మనోబలాన్ని ఎరువడుగుతోంది ఆమె. కాని ఆమాటలు చాలు అతనికి. "ఇంక ఎన్నడూ; నమ్ము. చేసిన పాపం చాలు" పాపం, ఆ మాటలు అతనే నమ్మకపోయినా సృష్టి వాటినే ఖాయపరుస్తోందని అతనికి తేలీదు. కాని ఆమే తన్నని బతిమాలి వేడుకుని ప్రౌఢాశ్చేస్థితికి రావాలని ఆఖరుయత్నం. "నీ అందాన్ని మరవలేను, ఇక్కడే వుంటే నిన్ను వదలలేన్ను భరించలేను.

నిన్ను ప్రతిదినమూ చూస్తో. నేను వెళ్లిపోతాను. నా ట్రయినింగ్ - నావుద్యోగమూ - నాగౌరవమూ అన్నీ వదిలిపోనీ; నేను వెళ్లిపోతున్నాను. తప్పదు. ఇంక కనపడను. ఏమీ చెయ్యను!"

ఆమె ఏమీ మాట్లాడలేదు.

"వింటున్నావా?" ఇంత అధికారంతో స్ఫుటంగా మాట్లాడడం అతను ఎరగడు. మళ్లా "వెడుతున్నాను నిన్నువిడిచి. కాని నిన్ను వదలలేను. నువ్వు నాదానివి. నేను ఎక్కడవున్నా ఏలోకంలో వున్నా నువ్వు నాదానివి. శాశ్వతంగా నాకు నీవు ముడిపడ్డావు. నన్ను మరిచిపోకు. ఎప్పుడు నిన్ను కలుసుకుంటానా అని ఎదురుచూస్తో వుంటాను. నీ అందాన్ని వికారం చేసుకోకు. నువ్వు నాదానివి."

గొప్ప శోకగీతం వ్రాస్తున్న మహాకవి హృదయంలాగా వొణికింది అతని హృదయం. రంగస్థలం మీాద తన వ్యక్తిత్వం మరిచిపోయిన నటుడివలె ఆమెని కావిలించుకోబోయినాడు.

సుందరమ్మ ఒప్పుకోలేదు. ఆకాశం నించి విన పడ్డటయింది. ఇదివరకే ప్రొద్దున్నించి భర్తయెడల దోషంచేశాననీ, అతనిఆత్మకి కోపం వచ్చివుంటుందనీ భయపడుతున్న సుందరమ్మ యీామాటలు వినడం తోనే పెద్ద కేకవేసి వెనక్కి పడిపోయింది. చంద్ర శేఖరం చప్పున లోపలదూరి తనమంచం మీాద సుర క్షితంగా ముసుకుపెట్టుకొని పడుకున్నాడు. ఆకేకకి

యింట్లోవాళ్లు లేచి వొస్తారని నిశ్చయంగా అతను యెంచుకున్నాడు. మంచులో ముళ్లలో సుందరమ్మను వదిలి పెట్టివస్తున్న ఆలోచనే రాలేదు అతనికి. కాని ఎవరూ లేవనేలేదు. చాలాసేపు అంతా నిశ్శబ్దంగా వుంది. భయపు మడతల అడుగునబడ్డ చంద్రశేఖరపు కారుణ్యం అతన్ని బాధించి దొడ్లో! పంపించింది. అక్కడే ఆ చెట్టునీడలో మూర్ఛపోయిన సీతలాగా వొంటరిగా పడివున్న సుందరమ్మని చేతుల్లో యెత్తుకుని తీసుకొచ్చి మంచంమీద పడుకోబెట్టి నిద్రపోయినాడు.

అతని అంతరాత్మ అతని ధర్మబుద్ధికి కరుణాస్వభావానికీ ధైర్యానికీ మెచ్చుకొని అతనికి జోలపాటలు పాడింది. తీరా మానవస్వభావ పరిశీలనా కుశలులు పరిశీచేసి అతని కరుణకాదేమో, అతని భయమేనేమో సుందరమ్మకి సహాయం చేసింది అనుకుంటారు. అంతరాత్మని యీశ్వరీవాణీ - నీతీ - అని ప్రజలు నిర్ణయిస్తున్నారు. అంతరాత్మే ఈశ్వరీవాణీ నీతీ అయితే ఆ యీశ్వరుడు చాలా మూర్ఖుడయి వుండాలి. ఆ యీశ్వరుడికే అందని అగాధపు క్షుద్రత్వమూ ఆ యీశ్వరుడికే అర్థంగాని మహోన్నత ఉదారత్వమూ వున్నాయి మానవ హృదయంలో.

చంద్రశేఖరానికి సుందరమ్మ బతికివుందో లేదో ఏ స్తితిలో వుందో పరిశీలించేటంత వ్యవధికూడా దొరకలేదు. ఈజరిగిన కథంతా యెందుకు జరిపించా

వంటే అతను సుందరమ్మమీద ప్రేమవల్లనని నిస్సం దేహంగా అంటాడు. మర్నాడు సుందరమ్మ మంచం మీదినుంచి లేవలేదు. జ్వరం వచ్చింది. పిచ్చిమా టలు మాట్లాడుతోంది. ఆ పిచ్చిమాటలలో తనపేరు చాలాసార్లు రావడం చూసి చంద్రశేఖరం ఎవరి తోనూ చెప్పకండా మాయమయినాడు. వెంకట్రా మయ్యగారు అతనికోసం వెతికించి "ఇంతేకదా! తీరా సుందరమ్మకి జ్వరంవచ్చి ఇంటో మనుషులులేని సమయంలో పనిచెయ్యవలసి వస్తుందని వీడు మాయ మయినాడు...ఎవరినన్నా కనికరించడం బుద్ధితక్కువ పని" అన్నారు."

౫

పొద్దున్నే ప్రతిరోజూ వచ్చేడోకుల్ని చూసి మొదట సుందరమ్మ తల్లి అనుమానపడ్డది. అను మానం ఆమెకు స్థిరమయిన తరవాత అడిగింది. సుందరమ్మ "నాఖర్మం" అనడం తప్ప మరొకజవాబు చెప్పలేదు. ఎన్నిసార్లు ఎన్నివిధాల అడిగినా, తిట్టినా, ఏడ్చినా బతిమాలినా, అంతకన్న మాట్లాడదు. ఇంటో అందరికీ తెలిసిపోతుందని తల్లికి భయం. అందుకని కప్పిపుచ్చింది. కాని ఎంతకాలం దాచడం అనే భయముకలిగింది. ఎప్పుడోప్పుడు యెట్లాగూ తెలు స్తుంది. తెలిసింతరవాత యెట్లానూ యింటోంచి

తరుముతారు. ఎక్కడికి పోవడం- యీ పిల్లని, యీ పిల్ల పిల్లని పెట్టుకుని ఎట్లా బతకడం?... కుళ్లి యేడుస్తోంది.

తనస్థితి సుందరమ్మకి చాలారోజుల కిందటే తెలిసింది. బెంగపడి ఏడ్చి లాభం లేదనుకుంది. తన రక్తంలో వున్న కర్మసిద్ధాంతాన్ని సహాయం తీసుకుని పలక్కుండా వూరుకుంది. చిన్నతనంలో ఆపదలు ఎక్కువబాధ పెట్టవు; మనసు ఏదో ఒక సంతోషముతో వుండి ఆపదను మరిచిపోతుంది. చిన్నతనంలో వున్నవాళ్లని, తన పూర్ణవికృత భీకరస్వరూపంతో బాధలు అనుభవంలోకి రాకపోవడంవల్ల రాబోయే ఆపదలు బాధలు భయపెట్టవు.

తనభర్తని ద్రోహంచేశానని సుందరమ్మకి బాధ పట్టుకుంది. భర్తని అమితంగా ప్రేమించింది. అతను చనిపోతే చాలా ఏడ్చింది. కృతజ్ఞతవల్ల, ప్రేమవల్ల జన్మంలో అతన్ని మరిచిపోననీ పోకూడదనీ అనుకుంది. అతనికి అపరాధం ఎన్నడన్నా చేస్తానేమో అనే ఆలోచనే రాలేదు. చెయ్యగల పరీక్ష సంభవిస్తుందనే తోచలేదు. కాని కాలక్రమేణా అతని రూపము, ధ్యాసా, అతని కోసం దిగులూ ప్రేమా మాసిపోయినాయి. ఆమరువు కృతఘ్నత అనీ, నీచత్వం అనీ తనని తానే నిందించుకుంది. దుష్టురాలనీ, చపలచిత్తురాలననీ అంత వున్నత ప్రేమకు అనర్హురాలననీ తనని తాను తిట్టుకున్నది. తన కామో

ప్రదేశంలో తన నియమాన్ని దాటినందుకు ఆయనకు శాశ్వతంగా చెందిన తన శరీరాన్ని - అర్ధాంగాన్ని పరపురుష స్పర్శతో మలినం చేయనిచ్చినందుకు తనని తాను అమితంగా ద్వేషించు కుంటోంది.

తనని నమ్మి యింకోలోకంలో కలుసుకుంటానని వాగ్దానంచేసి చనిపోయిన భర్త తనదోషాన్ని తెలుసుకుని విచారంతో కుంగిపోయినట్టు, ఆమె కలల్లో, చీకట్లో, పక్కదగ్గిరా కనబడుతున్నాడు. ఏడుస్తో చూస్తాడు. కోపంతో బెదిరిస్తాడు. పక్కచుట్టూ తిరుగుతున్నాడే అనుకుని బిగ్గిరిగా తన హృదయమంతా విప్పి చెప్పింది.

మెల్లిగా ఏడ్చింది. నమస్కరించింది. క్షమించమంది బ్రతిమలాడింది. లాభమున్నట్టు తోచలేదు. చచ్చిపోవాలని నిశ్చయించుకుంది. ఆ పరిహారం వల్లనేగాని తన పశ్చాత్తాపాన్ని తెలియచెయ్యడానికి వీల్లేదు అనుకుంది. తన దగ్గిరికి వచ్చినందు కాయన సంతోషిస్తాడు. వొంటరిగా అట్లా తన వెంట తిరుగుతో వుండడు. కాని తనని నిరాకరిస్తాడేమో! పోనీ తనతల్లికి దుఃఖం, దిక్కులేనిస్థితి వచ్చి మాడడం అవమానం, ఇన్నీవస్తాయి. మళ్ళా చావంటే భయం. ఆత్మహత్య అంటే ఘోరమయిన పాపం అని నమ్మకం. దెయ్యాలవుతారని భయం. అయితే దానంతట చావు వొస్తే బావుండును. చంపమని దేవతల్నీ భర్తనీ ప్రార్థించింది. అపాయకరమయిన స్థలాలకు

వెళుతుంది. బావిఅంచున నడుస్తుంది. కత్తిపీటమీద పడబోతుంది. దీపంమీద కుచ్చెళ్లు తగిలించబోతుంది. భయమయి వూపిరి బిగించుకుంటుంది.

మూడో నెలలో సుందరమ్మ వ్యవహారం యింటో వాళ్ళకి తెలిసి గుసగుసలు ప్రారంభించారు. త్వరలోనే వెంకట్రామయ్యగారి నోటీసులోకి వెళ్లింది. ఆయన జీవితాన్ని గురించీ, జీవితంలో అనవసరమయినవీ లాభంలేనివీ అయిన చిరాకుల్ని గురించి చక్కగా ఆలోచించిన మనిషి. కష్టాలు కలిగినప్పుడూ, నష్టాలు కలిగినప్పుడూ ఏడుపులూ, తిట్లూ, ఇతరులమీద నింద మోపడాలూ అవివేకమని ఆయనకు తెలుసు. ఒకప్పుడు బ్రహ్మసమాజంలో పడబోయే అపాయం తప్పించుకున్నాడు. ఆచారాల మూఢత్వం, అర్థవిహీనత్వం తెలుసుకున్న తరవాత వాటిని అనుసరించినా ఒకటే అనుసరించకపోయినా ఒకటే! అనుసరించక తన బంధువులకీ స్నేహితులకీ దూరమయి తల్లికీ భార్యకీ ఆజన్మాంతం విరోధి అయి వాళ్ళు ప్రేమించాలనుకొన్నా ప్రేమ చూపలేని స్థితిలోకి పోవడం మూర్ఖమనుకున్నాడు. లోకాన్ని దానితోవన దాన్ని పోనీక తనదోవకి తిప్పాలనే వెర్రిఆశ అతన్ని పీడించలేదు.

ఈ ప్రస్తుతవ్యవహారంలో కర్తవ్య మేమిటి? అని యోచించాడు. ఎవర్ని తిట్టీ ఏమీ లాభం లేదు. జరిగింది జరిగింది. యవ్వనంలో పిల్లపొరబాటు పని

చేసింది. పిల్ల అట్లాంటి ఆపదలో పడకండా జాగ్రత్త తీసుకోకపోవడం పెద్దవాళ్ళ తప్పు. సుందరమ్మ తల్లిని పిలిచి ఆమెకు తెలిసిన విషయాలు చెప్పమన్నాడు. ఆమె ఫూరికే ఏడవడమూ - తన కూతురి దుర్బుద్ధిని తిట్టడమూతప్ప ఏమీ చెప్పలేదు. ముందు కసిరి ఏడ్పు మాన్పించాడు. తిట్టడం మానమన్నాడు, "మీరు చూసిన విషయం చెప్పండి" అన్నాడు.

"నే నేమీ చూడలేదు. చూస్తే ఫూరుకుంటానా? ...అది అల్లాంటిపిల్ల కాదు. దానికేదోదయ్యమో..."

"పొద్దస్తమానమూ సుందరమ్మతో వున్న మీరేం చూడలేదంటే మీకు కళ్లు లేవన్నమాట. ఇట్లాంటిది ఒకనిమిషంలో జరిగే పని కాదు...సుందరమ్మ బుద్ధిమంతురాలు; మంచి మనస్థైర్యం కలది. అట్లాంటప్పుడు పొరబాటున తటాలున జరిగి వుండదు. మీరే తెలివిగా చూసివుంటే యీ ఆపద తప్పించివుందురు. ఆ పిల్లను తిట్టి ఏం ప్రయోజనం? వినండి, యిప్పుడు మనం చేయకలిగింది ఒకటే పని. దీనికి ఎవరు కారణమో వాణ్ణి తెలుసుకుని, ఇద్దరికీ పెళ్ళి చేద్దాము."

"పెళ్లీ! ఏమిపెళ్ళీ!! కొంప ముంచారు".

"నేను ముంచేదే ముంది. కొంప యిదివరకే మునిగింది. నేను లేవనెత్తా లని చూస్తున్నాను... మీగతి ఏమవుతుంది ? నాకు అభ్యంతరం లేదు. కాని నాభార్య మిమ్మల్ని యింటో నిలవనీదు. నా

బలవంతం మీాద వుండనిచ్చినా యిక్కడ మీా బతుకు అతి నీచమవుతుంది. ఆ కూతుర్నీ మనమరాల్నీ పెట్టుకుని ఏమవుతారు మీారు? ఇకముందు ఆపిల్ల గతేమిటి?...ఎవ రెవరి చేతుల్లో పడుతుందో? ఏగతికి వస్తుందో? లోకమంటే ఎరగదే ఆపిల్ల పాపం! లోకం సంగతి తెలిస్తే - తెలిసేటట్లు పెంచివున్నట్లయితే యిట్లా అధోగతి పాలయ్యేదా ఆపిల్ల! వెళ్ళండి. ఎట్లానయినా వాడిపేరు సంపాయించండి." అన్నాడు వెంకట్రామయ్య.

కాని ఆమె మళ్లీ ఆయనదగ్గిరకు పోలేదు.

సుందరమ్మనే పిలిపించాడు. "అమ్మా, రా, యిట్టా కూచో. ఎట్లా వున్నావు?...ఏమన్నా చదువుకుం టున్నావా? ఆ వెధవ చంద్రశేఖరం వెళ్ళినప్పణ్ణించీ ఎవరూ చెప్పేవాళ్లే లేరనుకుంటాను." అంటూ ఆమె ముఖంవంక జాగ్రత్తగా చూస్తున్నాడు.

అనుమానం నిశ్చయమవుతోంది. వాడు మాయ మవడానికి కారణం యింకేముంటుంది?...

"నీకు అవస్థ వొచ్చిందని దిగులుపడకు. ఏడ్చి లాభంలేదు. కాని మళ్లీ యిట్లాంటిది జరగకండా వివేకపడు. ఇట్లా మళ్ళాజరిగితే నాశనమయిపోతావు. ఇప్పుడు నీకు సహాయం చెయ్యాలనే ప్రయత్నిస్తు న్నాను. జరిగినదానికి వీలయినంతవరకూ పరిహారం చెయ్యాలి...మరి ఒక్క ప్రశ్నకు జవాబు చెప్పు... ఎవరు?"

సుందరమ్మ మాటాడలేదు. నాలుగయిదు సార్లు బతిమాలాడు. "నన్నడక్కండి." అని నిశ్చితంగా అన్నది. ఆమె హృదయ ఔన్నత్యాన్ని అర్ధంచేసుకుని వూరుకున్నాడు.

"చంద్రశేఖరమే అయితే యింత గొప్ప ఆత్మగల పిల్లని ఆనీచుడికి కట్టివెయ్యడానికి ఆయన మనస్సు వొప్పలేదు. కాని యింకోగతి ఏది యీక్రూర ప్రపంచంలో? ఇట్లా జీవుల్ని ఒక అధోగతినించి యింకో అధోగతికి యీడుస్తోంది యీప్రపంచం. సుగుణాలు వున్నకొద్దీ గాయపడుతున్నారు ప్రజలు, ప్రతివాడూ కన్నువేసి వాంఛించే యవ్వన శోభనూ. సహజమయిన స్త్రీ కాంక్షను కల్గించి సృష్టిప్రుద్దేశం నెరవేర్చే గర్భాన్ని కల్పించి ఆ కారణాలతోనే అధోగతికి లాగి బహిష్కరించి, ద్వేషించేట్టు చేసి, నలిపి, నరకంలో తోసేది బుద్ధీ దయా గలిగిన దేవుడేనా?" అనుకున్నాడు.

"ఆ యీశ్వరుడి కేమీ జోక్యంలేదా ? మానవులే యీ సంఘ స్థితులను కల్పించింది!.. ఆ నీచుడికి యీ ధీరురాల్ని కట్టడంకన్న వేరుగతి లేకండా చేసింది యీలోకం. పాపం ఆ వీరేశలింగంగారి వల్ల యీమాత్రం మార్గం లభించింది. యీ ఆంధ్రలో కానికి! లేకపోతే యేంచెయ్యాలి యీసుందరమ్మని, గొంతుపిసకడం తప్ప" అని అనుకున్నాడు. ఆలోచించాడు. ఏమీ తోచలేదు.

"ప్రస్తుతం యీపిల్ల గతేమిటి? యీ చేత్తోనే యీ ఘాతుక కార్యం చెయ్యాలి కాబోలు. మార్దవాన్ని చంపుకుని కఠినత్వం వహించాలి. ఏకార్యమయినా చక్కగా సాధించి ప్రయోజకుడు కావాలంటే, యితరులకు వుపయోగపడి సౌఖ్యం కలిగించాలి అంటే మనుష్యుడు తన అంతరాత్మనీ, కారుణ్యాన్నీ, న్యాయబుద్ధినీ, యుక్తా యుక్త వివేచననీ చంపుకోవాలి. ఏ వితంతువుల మీద దయచేత ఆ వీరేశలింగం పంతులు త్యాగం చేశాడో ఆయనే ఆ వితంతువుల్ని సర్కసు జంతులవలె కొరడాతో పాలించక దయదలిస్తే ఒక్క వివాహం చెయ్యగలిగి వుండేవాడా? దయదలచి సామాన్య మానవత్వంతో సౌభ్రాతృత్వంతో చూశామా యీ వితంతు శరణాలయాలూ, బోర్డింగులూ ఒక్క దినం నిర్వహించడానికి సాధ్యమవుతుందా?" అనుకున్నాడు.

ఇక చంద్రశేఖరాన్ని వెతికి పట్టుకుని రావడానికి నిశ్చయించుకున్నాడు. అతని పల్లెటూరూ బంధువుల పల్లెటూళ్ళూ వెతికించి వెతికించి చివరికి ఆయనే సరాసరి ఆవూరు వెళ్ళాడు. చంద్రశేఖరం హఠాత్తుగా వెంకట్రామయ్యగారి కళ్ళ పడేటప్పటికి అతను నివ్వెరపోయినాడు.

"అంతా తెలిసింది" అన్నాడు వెంకట్రామయ్య.

"ఏమిటి?"

"ఇంకెందుకు? సుందరి చెప్పింది."

ఏమంటాడు, చంద్రశేఖరం. గుడ్లు మిటకరించాడు.

"నువ్వు చేసినపని న్యాయం కాదు."

అతను తల వేళ్ళాడవేశాడు.

"నేను నీకు చేసిన మేలుకి చాలా మంచి ప్రత్యుపకారం చేశావు. ఇప్పుడు నిన్ను ఖయిదీలో పెట్టించగలను. నీహత మార్చగలను."

వెంకట్రామయ్యగారి సామర్థ్యంలో చంద్రశేఖరానికి అమితమయిన విశ్వాసం వుంది. అందులో అతనికి 'లా' అంటే ఏమిటో అసలే తెలీదు. చంద్రశేఖరంవంటి వాళ్ల విషయంలో వాళ్ళ ధర్మబుద్ధికి 'అప్పీలు' చేసి లాభముండదని వెంకట్రామయ్యగారికి తెలుసు. వాళ్ల పిరికితనానికి వేడి తగిలించాలి.

"నువ్వుగనక నిజముగా పశ్చాత్తాప పడితే క్షమిస్తాను." అన్నాడు.

వొణికిపోతున్న చంద్రశేఖరానికి గుండె కుదటపడ్డది. అతను వెంకట్రామయ్యగారి కాళ్ళమీదపడి యేడ్చి క్షమించమన్నాడు,

"నిశ్చయమేనా?"

"చిత్తం...పరిహారం సెలవీండి......నాప్రాణం కావాలన్నా సరే"

"నువ్వు చేసిన పని ఎంతఘోరమో, నీచమో, తెలుస్తోందా?

"ఆ."

"ఆపిల్లగతి ఏంకాను? జాలిలేదా!"

"ఉంది. బుద్ధితక్కువ పని చేశాను."

"ఆ పిల్లని ఏవిధంగానన్నా రక్షించగలిగితే ఆపని చేస్తావా?"

తన మెడ యేదో వుచ్చులో దూరుతోందని అనుమానం కలుగుతోంది. కాని భయమే విజృంభించింది. "చిత్తం, అట్లాగే చేస్తాను." అన్నాడు చంద్రశేఖరం.

"ప్రమాణం చెయ్యి."

ప్రమాణం చేశాడు. "అయితే వ్రాసి యియ్యి" అన్నాడు. అతను తానుచేసిన పని సంగతీ, పశ్చాత్తాప పడుతున్నాననీ వ్రాశాడు. టీచరు ట్రెయినింగ్ కాకపోతే అతనట్లా వ్రాసి యిచ్చేవాడు కాడు.

"సుందరమ్మని పెళ్ళిచేసుకో."

"పెళ్ళి! ఎట్లా?"

"వితంతువివాహం."

ఏమీ అర్థంకాకుండానే "సరే" నన్నాడు. చంద్రశేఖరం బంధువుల్నీ స్నేహితుల్నీ చూసే వ్యవధి కూడా యియ్యకండా అతన్ని వెంటబెట్టుకుని బెజవాడకు తీసుకుని వచ్చాడు.

చంద్రశేఖరం మళ్ళీ యింటికి ఎందుకు వొచ్చాడో సుందరమ్మకి అర్థం కాలేదు. పెళ్ళిముహూర్తం నిశ్చయమయి అన్ని యేర్పాట్లూ జరిగే దాకా ఆమెకేమీ తెలీనేలేదు.

రోగికి యెంత బాధకలిగించ పోతున్నాడో

తెలిసి యింక గతిలేక రోగికి తెలీకండా ఆపరేషనుకి తయారుచేసే డాక్టరులాగా పెళ్ళికి యత్నాలు చేయిస్తున్నాడు వెంకట్రామయ్యగారు. తనకు పెళ్ళిచేస్తారని తెలిసిందన్నమాటే గాని ఆమె వుద్దేశం అడిగినవాళ్లు ఎవరూ లేరు. తనే కలుగజేసుకుని మాట్లాడడానికి సిగ్గు. తల్లికి అసలు ఏమీ తెలీనట్టేవుంది. వెంకట్రామయ్యగారు అసలు కనపడడం మానివేశారు.

ఆచంద్రశేఖరం మీాది పరమ అసహ్యం ఆమెని బాధిస్తోంది. తాను తనవాళ్ళకి కలిగించిన వ్యసనానికి ఎంతో బాధపడుతోంది. తన గర్భంవల్ల కలగబోయే ఆపదలుకూడా క్రమంగా తడుతున్నాయి. సందేహాలతో కర్తవ్యం తెలీక సలహా యిచ్చేవాళ్లు లేక లోకంలో వొంటరిది అయిపోయి వొణుకుతో బిక్కమొహంతో సుందరమ్మ పెళ్ళికూతు రయింది రెండోసారి.

పెళ్ళి కాగానే చంద్రశేఖరానికి అవూళ్లోనే బాంకిలో వుద్యోగ మిప్పించి కాపరాన్ని యేర్పరిచి తన చేతులు దులుపుకున్నాడు వెంకట్రామయ్య. పెళ్ళికూడా తనకేమీా సంబంధం లేనట్టు దూరాన్నించే చేయించాడు.

ఇక సుందరమ్మ తల్లి అవూరే వొదిలి యాత్రలకు వెళ్లిపోయింది.

౬

కాపరం ప్రారంభించిన వారం రోజుల్లో చంద్రశేఖరం తరహా మారింది. తన పోషకుడూ ధనవంతుడూ అయిన వెంకట్రామయ్యగారి మేనకోడలు —తనకి అందని వేగుజుక్క - ఆమె ఒక్కకిరణం తనమీద ప్రసరిస్తే తన జీవితం ధన్యమవుతుం దనుకున్నది - ఆమె తలంపులతో సంబంధించిన భావాలన్నీ ప్రబంధాల్లోంచి ఏరుకున్నవి - అతని దృష్టి ఆమె సౌందర్యంమీదా - అతని ఆశ ఆమె కరుణమీదా - నిలిచాయి అప్పుడు. ఇప్పుడా సుందరమ్మే అతనిభార్య అయింది. తాను దూరాన్నించి చూసి, మురిసి, తామర పువ్వులతో పోల్చి భ్రమిసి వర్ణించిన ఆమె చేతులు తనని తాకగానే తన వొళ్ళంతా పులకరింపచేసిన ఆమె వేళ్లు - ఇప్పుడా చేతులే ఆ వేళ్ళే కాయలు కాసేట్టు రుబ్బుతున్న కందిపచ్చడి రుచిమీదనిలిచింది అతని మనస్సు. ఆమె చర్మపు బంగారు నునుపుకన్న ఆమె అంట్లు తోమక పోతే దాసిదానికి కర్చయ్యే వెండిరూపాయి యెక్కువ విలువగలదయింది.

అతను ఆమెను ప్రార్థించడం ఆమె దయని పొందడం అనే భావమే పోయి తనకి ఆమె చేసే సేవలో లోపం చేస్తున్నదే, గౌరవం చెయ్యడంలేదే, తన కోపానికి ఆమె జడవడం లేదే, అనే ఆలోచనలు

కలుగు తున్నాయి.

ఆమెచేత ఎన్నివిధాల సేవ సేయించుకో వొచ్చో, ఆమె శరీరకష్టం వల్ల తా నెంత ఆదా చెయ్య వచ్చో, ఆమెనంట వల్ల తా నెంత రుచిపొందవచ్చో, యోజి స్తున్నాడు.

దరిద్రుడు అకస్మాత్తుగా ధనవంతుడయితే దుబారా కోరన్నా అవుతాడు, లేక పిసినిగొట్టుగా నన్నా మారుతాడు. పదిహేను రూపాయల జీతం దొరికితే మహాభాగ్య మనుకున్న చంద్రశేఖరానికి యిరవై అయిదు రూపాయల గుమాస్తాగిరి చాలా అదృ ష్టంగా తోచింది. జీవితమంతా పల్లెటూరి బడిపంతు లనే మహా కూపంలో నివసించడానికి సంసిద్ధుడయిన అతనికి యీ ప్రపంచ ద్వారాలే తెరుచుకుని గొప్ప జీవితాలకూ పదవులకూ ఆహ్వానిస్తున్నట్టయింది. తన పాతస్కూలు టీచర్లకు నమస్కరించే అవసరం లేకండా వీధుల్లో, దుకాణంలో సరి సమానంగా తిరగ గలగడం అతనికి గొప్పగా వుంది. తన ఆచారాన్నీ సనాతన పద్ధతినీ వొదులుకున్నందుకు తాను చాలా తెలివిగల పని చేశానని ఆనంద పడ్డాడు. సుందరమ్మ తోటి తన పూర్వ సంబంధంలోని సౌందర్యం మరిచి పోయి అదంతా తన పురోవృద్ధికి తాను వివేకంగా చేసిన యత్నమని గర్వపడుతున్నాడు.

గొప్ప పదవుల్ని యితరుల అనుగ్రహం వల్ల సంపా యించిన వాళ్లు ఆ అనుగ్రహించిన ఉపకారుల్ని

త్వరలో మరిచిపోవడానికి ప్రయత్నిస్తారు. కృతజ్ఞతా భారాన్ని మనుష్యస్వభావం భరించలేదు. కనక తమలో వున్న ఆధిక్యతే తమ కాపదవిని యిచ్చిందనీ, అనుగ్రహాన్ని సంపాయించిన తమ వివేకమే తమకి సహాయం చేసిందనీ సమర్థించుకుంటారు. తరవాత త్వరలోనే తమ జాతకమో - అదృష్టమో, తాము కొలిచిన దేవతో, తమ కాపదవి నిచ్చిందని సమర్థించుకుని తమ మీంది అభిమానంచేత తమకి యితరులు సహాయం చేశారనే సంగతిమాత్రం మనస్సుల్లోంచి వొదిలించుకుంటారు. అట్లానే చంద్రశేఖరం కృతజ్ఞతను మరిచి వెంకట్రామయ్యగారు తమ విధ్యుక్త ధర్మ ప్రకారమే తనకు పని యిప్పించారనీ సుందరమ్మని పెండ్లిచేసుకోడం ఆయనకి వుపకారమనీ పయిగా తానే మామూలు పెళ్లి చేసుకుంటే తాను గుమాస్తా గనక నాలుగయిదు వేలు కట్నం వచ్చివుండేదనీ తనకి ఆయన ఒక్క ఐదువందలయినా చివరకి ఒక్క బైసికిలన్నా యిచ్చాడుకాదనీ అనుకుంటున్నాడు. ఎట్లానయినా ఆయన దగ్గిర్నించి ఆవిలవ రాబట్టాలి. తనకు జన్మలో పెళ్లికి పిల్ల దొరుకుతుందా, పాల ఘాటుపిల్లను చేసుకునేట్లయితే వెయ్యిరూపాయలు యెన్నేళ్లకి పోగవుతాయి అని తాను దిగులుపడ్డ రోజులు జ్ఞాపకంలేవు.

అదిగాక యీ వచ్చే యిరవైఅయిదు రూపాయలలో సగం సుందరమ్మ చీరెలకీ భోజనానికీ ఖర్చు

యితే తనకు మిగిలే లాభ మేమిటి? సంసారం డబ్బు మీద ఆధారపడడం వల్ల సంసార్లకు - వాళ్ల ప్రేమ వాళ్ల అందం - వాళ్ల నవ్వులు - అన్నీ డబ్బుల లెక్కలమీద ఆధారపడతాయి. వూరికే వొచ్చే ఎండా వెన్నెలా అందంగా కనబడ్డట్టు ఎలెక్ట్రిక్కు దీపాలు కనబడవు. దృష్టిఅంతా ఖర్చవుతున్న దన్న డబ్బుమీదే వుంటుంది.

అట్లానే సుందరమ్మ మీద ప్రేమా, ఆమె అందంలో ఆనందం అన్నీ పోయి ఎంత భోజనముకు ఖర్చు అవుతుందో ఏచీరె ఆమెకి అందంగా వుంటుం దనే దృష్టిపోయి ఎంత చవకలో చీరె కొనవచ్చునసే ఆలోచనే వేస్తోంది. ఆమె తిరుగుతూ వుంటే ఆమె చక్కని బుజాలని కప్పే పమిట విసురుని చూడడం బదులు దేనికన్నా పట్టుకుని చిరగదు గదా, సరిగా పక్కకి దోపుకుంటేనేం అనుకుంటాడు.

తన తోడునీడ, తన భార్య - సహధర్మచారిణి తనని నమ్మి కష్టసుఖాలు తనతో పంచుకోడానికి వచ్చిన సుందరమ్మమీదకన్న, తనతో రహస్యంగా- అయిష్టంగా వ్యభిచారం చేసిన సుందరమ్మ మీద అతనికి గౌరవం యెక్కువ, అతనికే కాదు; అందరికీ అంతే. అది పవిత్ర వివాహ ఫలితం.

పూర్వం - వివాహం కానప్పుడు మొదట్లో సుందరమ్మగారూ అని పిలిచాడు. మోహించిన తరు వాత 'సుందరీ - త్రిలోకసుందరీ - మృదుపద్మగంధ

సుందరి' అని స్వాంత కవిత్వగ పెట్టాడు. పెళ్లి అయిన కొత్తలో 'ఒసేవ్ - ఏమేవ్' అన్నాడు. వారం రోజులయ్యేసరికి గాడిదా, కళ్లు లేవుటే - ఈ పచ్చడిలో యింత కారం తగలేశావేమే _ నీ తెలివి తగలడ' అని యింకో రకం కవిత్వం ప్రారంభించాడు.

"గొప్పయింటి పిల్లని చేసుకున్నప్పుడు మొదటి నించీ అధికారం చూపకపోతే నెత్తిన యెక్కుతుంది. తరువాత భార్యకి చనువిస్తే తన చిక్కులకి అంతం వుండదు." అని తనే లోకంలో మొదటిసారి ఆసంగతి కనిపెట్టినట్టు అనుకుంటున్నాడు. అన్నిదిక్కులా, ఎక్కడ చూసినా "నేను - నాది — నాభారం - నా స్వంతం - నాబాధ్యత" అనిపిస్తోంది. ముఖ్యంగా ఉద్యోగం, తరవాత యిల్లు - ఒకచోట బాధ్యత ఇంకోచోట అధికారం. తాను ఆఫీసులో బానిస. యింట్లో సుందరమ్మ తన బానిసఅంటే బానిసకు బానిస. లోకమంతా ఒక సిష్టం-అధికారుల్లా- తాబేదార్లూను. గృహమూ అంతే. ఈఉద్యోగంపోతే తనకి దిక్కులేదు. కనక యేఆజ్ఞనూ-యేపరాభవాన్నీ న్యాయంకాని అన్యాయంగాని భరించాలి తనని మనిషినిగా కాకండా మరలాగ చూచి రాత్రింబవళ్లూ పనిచేయిస్తే చెయ్యాలి. సాయంత్రంయింటికి పోనిస్తే, ఆదివారం ఆఫీసుకి రానక్కర్లేదంటే, అది అధికార్ల దయ.

లోకంలో చాలామంది మనసులూ, ఆత్మలూ,

యిట్లా మరలో పెట్టి వృత్తిన పుస్తకాలవలె అణిగి పోతాయి. "పని - పని - పని" యింతపని - ఆత్మల్ని పిండి, ఆనందాన్ని నశింపచేసి, మనుషుల్ని మరలుగా చేసి నీచుల్నీ బానిసల్నీ చేసే యింతపని! యీ ఆనందమయ జీవితంలో యింతపని అవసరముందా? - చివరికి అంతపనీ మనుష్య స్వభావానికే అవసరమని గొప్పవారు కూడా అనే స్థితికి వొచ్చింది ప్రపంచం.

ఈ భావాన్నే చంద్రశేఖరం తన సంసారంలోకి తీసుకొచ్చాడు. తానింత కష్టపడుతూ వుంటే తానింత బానిసఅయిపోతే తన కష్టార్జితం మీద ఆధారపడుతూ తన రూపాయల్ని తరుగుచేసే మనిషి తన కిన్ను యెందుకు తక్కువ కష్టపడాలి! ఆమె తన మాటకి యెదురు చెప్పినట్టు తను ఆఫీసులో ఎదురు చెపితే!...తను మాటల్ని నిర్లక్ష్యంచేస్తే డిస్మిస్ కదా!...మరి తను యీమెని డిస్మిస్ చేస్తే?... చాలామంది భార్యలు దొరుకుతారు. తన కిప్పుడు బాంకిగుమాస్తాపని!! ఇరవై - పయిగా అయిదు రూపాయల జీతం. వితంతు శరణాలయం నిండా కులుకులాడుతూ మగవాడు కనబడితే చాలునని కిటికీల్లోంచి ఆత్రంగా లోకాన్ని వెతికే - కామాగ్నిలో దహించుకుపోయే - వితంతువులు ఎంతమంది లేరు? ...దీన్ని తరిమేస్తేనేం... వెంకట్రామయ్యగారు తన పని తీసివేయించగలడా? హెడ్ గుమాస్తా- ఆయన పనినంతా చూసిపెట్టే తనలాంటి గుమాస్తాను వొదిలి

పెడతాడా?...

అనాధ - దిక్కు లేదు-తలిదండ్రులు లేరు. వున్నా కనికరించరు. డబ్బు లేదు. సంపాయించుకోలేదు... అని తలచుకున్నప్పుడల్లా చంద్రశేఖరానికి తన గొప్ప తనం వెల్లడి అవుతో వుంటుంది.

అధికార్లకింద త్వరలోనే తరిఫీదయి, మజ్జిగలో చీమ పడిందనీ, తన చొక్కాకి కుట్టు పక్కకు వెచ్చిం దనీ, స్నానానికి నీళ్ళు వేడిగా లేవనీ తిడుతున్నాడు చంద్రశేఖరం సుందరమ్మని. పీట తగిలితే ఎందుకు ఆపీటని దోవలో వుంచావంటాడు. 'అజాగ్రత్తగా వుంటే తగలదా' అని సుందరమ్మ అంటే ఎదురు చెప్పడం అంటాడు. ఒకరిమీద ఆధారపడడంలోనే వుంది యీనీచత్వం!

కొద్దిరోజుల్లోనే అతనికి సుందరమ్మ మీద అను మానం యేర్పడ్డది. ఆమె స్వభావాన్ని గుర్తించలేక పోయినాడు. తనకు ముందు యెందర్ని మోహిం చిందో - తను అజాగ్రత్తగా వుంటే యింకెందర్ని మోహించి తనని మోసంచేస్తుందో అనే అనుమా నం పుట్టింది. తన భార్యని యితరపురుషుడు తాకు తాడేమోననే పౌరుషమే గాక, తను కష్టపడి సంపా యించిన ఆ స్త్రీని ఏమీ ఖర్చులేకండా యింకోడు అను భవిస్తాడే అనే బెంగా, లేచిపోయి తనను నవ్వుల పాలు చేస్తుందేమో ననే భయమూ పట్టుకుంది. ఆమెకి తనమీద యిష్టం లేకపోయినా తన దొంగ

వేషాలకి వెర్రిది లోబడ్డది కదా! ఇంకోడు ఆవేషాలే వేస్తే?...ఆమెకి తనమీద ప్రేమ వున్నట్టే వుంది. లేకపోతే ఎందుకు పెళ్ళి చేసుకుంటుంది?......కాని మొదటి భర్తని మరిచిపోలేదా?.........

ఆమెఅందమే అతనికి పరమ శత్రువయిపోయింది. ఎంత ముసలివాణ్ణిగాని, నీతిపరుణ్ణిగాని - ఆడవాళ్ళని సహితం 'ఏమి అందమా' అని నిలుచోపెట్టగలది సుందరమ్మ ఠీవి. ఎవరు ఆ అందాన్ని మాటలతో గాని కళ్ళతోగాని మెచ్చుకున్నా అతనికి విషాదం ఎక్కువవుతోంది. పెరుగుమనిషి "ఎంత అందమయిన దానివమ్మా! మీదేవ్వూరు" అంటుంది. కట్టెలు వేసినవాడు ఆశ్చర్యంతో మైమరిచి యెవరో దేవతని చూసినట్టు ఆమెవంక చూస్తో నుంచుంటాడు.

తన భార్యకి యింత అందం యెందుకు? తనకి పని చెయ్యడానికీ, యిల్లు కనిపెట్టుకుని వ్వుండడానికీ యింత అందం యెందుకు? ఎవరో మేడల్లో పహరాలు పెట్టుకుని దాచుకో గలవాళ్ళకి గాని తనకెందుకు యీ అందం? దీపం పెట్టుకో డబ్బులేనివాడికి పెద్దమేడ లభించినట్టు వుంది.

తన పరువెప్పుడో కూలదోస్తుంది. ఇంత అందం ఆగదు. ఎవరన్నా కావలి వుంటే బావుండును. తన తల్లిమీద చప్పున ప్రేమకలిగింది. అన్ననీ తల్లినీ వొదిలి ఎప్పటినించో ఎక్కడెక్కడో చదువుకున్నాడు చంద్రశేఖరం. ఇప్పు డామెని ప్రేమతో పిలిస్తే?...

ఈవివాహం ఆమె అంగీకరించలేదు. ప్రయత్నించి తీసుకురావాలి. కొంత కుదట పడుతుంది గుండె! కాని ఆమె భోజనం యెక్కడ చేస్తుంది?... ఈ ఆలోచనతో తల్లిమీద ప్రేమ యెక్కువయింది.

ఈ సుందరమ్మ తననీ తనబంధువుల్నీ విడతీసింది. తను మోహంలో ముంచి మోసపుచ్చి వెలిలోకి దింపింది. తనకేమి లాభం - యీఅందం? ఎందుకిది? ఒక పండుగలేదు. అత్తవారు తీసుకెళ్ళడం లేదు. బట్టలు పెట్టడంలేదు మోహించి అనుభవించి నంత మాత్రం చేత ఆడవాళ్లని పెళ్లి చేసుకుంటున్నారా అందరూ?.. నీతిపరుడు గనక తాను వొప్పుకుని పెళ్లి చేసుకున్నాడు. సుందరమ్మ భర్త బతికి వుంటే బావుండేది. అప్పుడు యీ పెళ్లిచేసుకునే అవసరం తప్పిపొయ్యేది. దయదలిచి తాను చేసుకోకపోతే దీనిగతి ఏమయ్యేది? పయిగా గొప్పదానిలాగా నీలుగుతుంది.

భార్యలో స్వేచ్ఛనీ, తన కర్థంగాక తనకి లోబడక మిగిలిన స్వభావాన్ని క్షమించలేదు పురుషుడు. ముఖ్యముగాసుందరమ్మ సహజ ధిక్కారాన్ని సహించలేకండా వున్నాడు చంద్రశేఖరం. ఎంతగాయం చెయ్యాలా, ఎట్లా తనపాదాల మీదపడి కరుణించమని యేడ్చేట్టు చెయ్యాలా, అని ఆలోచిస్తున్నాడు.

సుందరమ్మకి మొదటినించి యీ కాపరం కంటకం గానే వుంది. చంద్రశేఖరాన్ని చూస్తే ఆమెకీ

ప్రేమ లేదు. అటువంటివాణ్ణి ప్రేమించడం స్వభావ విరుద్ధం. అతనితో కలిసివుండడంవల్ల, అతని బోధనల వల్ల, బాధవల్ల కొన్ని యేళ్ళకి క్రమంగా ఆమె స్వభావం కూడా నీచత్వం పొందితే అప్పుడు ఒకటే ఆశయాన్ని ఆరాధించడంలో యిద్దరూ అయిక్యమవుతారు. అంత వరకూ తృణీకారం ఆమె మాన లేదు. అతని దార్ఢ్యం ఆమెకి కష్టం కలిగించింది కాని, ఆశ్చర్యం కలిగించ లేదు. తనవంశపు పూర్వవనితల అణకువా, సత్ప్రవర్తనా మొదలయిన గుణాలు ఆమెలో యిమిడి పోయినవి.

ఈ జన్మకి తనగతి యింతేనని సర్వమయిన ఆశలూ వొదులుకుని ఒక విధమయిన జడత్వం పొందిందామె. ఇదే ధర్మమనే సులభమయిన నమ్మకం ఆమెకి సహాయం చేసింది. భర్త యెటువంటివాడో అనే ప్రమేయమే లేదామెకి. అగ్నికి వేడీ, తేలుకు కుట్టే స్వభావమూ ఒకరు కల్పించినవి కావు. భర్త స్వభావమూ అంతే. అనుభవించవలసిందే గాని అనుకుని లాభం లేదు. ఇక ఏ ప్రయత్నమూ లేకండా దిగులు పడకండా నిశ్చలత్వమూ, విరక్తీ అనే కవచంతో వుంది సుందరమ్మ.

కాని ఎవడు మొన్నటిదాకా తనకన్న కింది మెట్టుమీద నుంచున్నాడో, తన దయకోసం తన అంగీకారం కోసం పరితపించి కాళ్లు పట్టుకున్నాడో వాడు యీనాడు తనకధికారి అయి తనని ఆజ్ఞాపిస్తే-

మహారాణిలాగా ఎవడికి తాను మోహావరాలిచ్చిందో వాడు ప్రభువయి తన హక్కయిన అమూల్యా నందాన్ని లాక్కుంటే ఆమె శరీరం మీదనే ఆమెకి అసహ్యాం కలిగింది. అతని అధికారమూ, అనుమా ఘూ, నీచపరిహాసమూ, ఆమె నెంత బాధించినా పవిత్ర బ్రాహ్మణ కుటుంబాలలో అటువంటి దౌర్జ న్యాలు సాధారణంగా వుంటాయని ఆమెకి తెలుసును గనక ఆమె సంసారస్వభావమే అంత అని మాట్లాడ కండా తలవొంచుకుని వూరుకుంది.

ఆచారంవల్లనూ, పెంపకంవల్లనూ, సుందమ్మకి వితంతు వివాహం ఘోరపాపాలలో ముఖ్యమయిం దని నమ్మకం. గతిలేక ఆలోచించే వ్యవధానం లేక శక్తిలేక తన కాశ్రయమిచ్చిన కుటుంబానికి అపకీర్తి తెస్తున్నాననే భయంతో వొప్పుకుంది. కాని ఆపాడు పని చేయక ముందు ప్రాణం అర్పించి వుండేది. ఎక్కడో ఎవరో దిక్కుమాలినవాళ్ళు తలచనన్నా తలచకూడని వాళ్ళు కిరస్తాను లయిపోయి మళ్ళీ పెళ్ళిళ్ళు చేసుకుంటారని చిన్నప్పుడు విన్నది. వాళ్ళని చూడడం కూడా దోషమనుకుంది. గోబ్రాహ్మణ హత్యకన్న వ్యభిచారంకన్న గొప్ప పాపమనుకుంది. చంద్రశేఖరంతోగానీ, యింకెవడితోగానీజన్మమంతా రహస్య సంబంధానికి వొప్పుకునేదేమో గాని వివా హానికి మాత్రం వొప్పుకునేది కాదు. వితంతువివా హం అంత నీచమనే అభిప్రాయంతో ఆమె పెరిగింది.

ఎంతో జాగ్రత్తతో, ధయిర్యంతో విజ్ఞానముతో యోజించినవారి మనసులలో తప్ప సాధారణపు ప్రజల నీతి అభిప్రాయాలన్నీ హేతువాదం మీద ఆధారపడి వుండవు. చిన్నప్పటినించీ గౌరవనీయులయిన వారు ఏవిధముగా తలుస్తున్నారో దండిస్తున్నారో ఆపద్ధతులమీద నీతిని గురించిన అభిప్రాయాలేర్పడుతాయి, అది నాటుకున్న తరవాత వాటి అన్యాయమూ హేతువైరుధ్యమూ విశదంగా యెత్తి చూపించినాకూడా గుర్తించలేరు. ఒకవేళ గుర్తించినా ప్రయత్నించికూడా వాటి ప్రాబల్యాన్ని మనసులోకి రానిచ్చి వొదిలించుకుని తమప్రవర్తనని దిద్దుకోలేరు. ఒకసారి ఆచారం యేర్పడ్డ తర్వాత అది వేదకాలంలో లేదనీ, శాస్త్రాలన్నీ ఖండిస్తున్నాయనీ సయిన్సు ప్రకారం హానికరమనీ, అర్థవిహీనమనీ, బోధించినా ప్రయోజనం లేదు. ఆ ఆచారం నశించాలంటే కొందరు ఆ ఆచారానికి తిరగబడి వ్యతిరేకంగా ఆచరించడమే మందు. వితంతు వివాహం శాస్త్రసమ్మతమనీ, న్యాయమనీ, వ్రాసిన వ్యాసాలన్నిటికన్నా, ఉపన్యాసాలన్నిటికన్నా, ఒక్క వివాహం జరిపించడం యెక్కువ మార్పుని తీసుకుని వొచ్చింది. ప్రజలు తాము చేసిన పనిని సమర్థించడానికి శాస్త్రాల్ని పిలుచుకుని వెస్తారు; కాని శాస్త్రాలను ముందుగా అడిగి ఆప్రకారం ఒతకరు.

వివాహమయి తన స్థితి ఆలోచించుకోడానికి

వ్యవధి దొరకగానే సుందరమ్మకి తన రక్తంలోవున్న ఆలోచనా పద్ధతులన్నీ తిరగబెట్టాయి. ఈ వివాహం వల్ల తాను ఘోరపాపం చేశాననుకుంది. తనను కని పెట్టివున్న భర్తకు మహాగ్రహం తెప్పించానను ంది. ఈశ్వరుడికే తనమీద క్రోధం కలిగింది. తన న్మఅంతా ఆపదలమయం కాబోతోంది. ఈవిపత్తుల కన్నిటికీ కారణం యీ చంద్రశేఖర మని అతన్ని అమితంగా ద్వేషించింది. అదిగాక శరీర స్థితి వల్ల నైతేనేం పెళ్ళిఅయినా అతనితో శరీర సంబంధం మానుకుంటే కొన్ని పరలోక ఆగ్రహాలను తప్పించుకోవచ్చు ననే ఆశతో నైతేనేం, అతన్ని తనదగ్గిరికివస్తే తప్పించుకోవాలని చూసింది. జన్మఅంతా విడిగా వుండటానికి నిశ్చయించుకుంది. పెళ్ళి అయిందన్న మాటేగాని వాళ్ళిద్దరూ ఒక్కసారయినా ప్రేమగా మాట్లాడుకోలేదు. ఒకర్నొకరు పరమ శత్రువులవలె భావిస్తున్నారు.

తనని నిరాకరించడానికి కారణం పరాకర్షణ అని నిశ్చయించుకుంటున్నాడతను. ఈభయమంతా ఒక వేష మనుకున్నాడు. ఇటువంటి విపరీత ద్వేషాలతో ప్రారంభ మయింది వారి పవిత్ర సంసారం.

౭

సుందరమ్మ గర్భానికి ఆరోనెల వొచ్చింది. గర్భ

వలిగా వున్న యువతికి జరగవలసిన సరదాలు, ముచ్చట్లు, తంతులు ఏమీ జరగటం లేదు. జరగటానికి వీలూ లేదు, అనుకోడానికి పెద్దవాళ్ళూ లేరు, ఖర్చుపెట్టడానికి డబ్బూ లేదు. ఆమె బాధలుగాని యెక్కువైన ఆమె ఆకలివిషయం గాని, రాబో కష్టాన్ని గురించిన ఆమె భయాలు గాని వినేవా కూడా లేరు. మొదటిది వితంతు వివాహం; రెండోది పెళ్లైన రెండునెలలకే ఆరునెలల గర్భం, క్రొత్తమనుష్యులు, క్రొత్తకాపరం. అందుచేత యిరుగుపొరుగు వారెవరూ మాట్లాడరు. ఇంటి పని అంతా సుందరమ్మే చేసుకోవాలె. ఏమి సంభవించినా సరే, చంద్రశేఖరంతో మొరపెట్టుకోడంగాని, అతని కనికరాన్ని అన్వేషించడం గాని, ఆమె చెయ్యతలుచుకో లేదు. శరీరకష్టంకన్న మనోవేదన యెక్కువగా వుంది. ఏ ఆచారమూ, పండగా లేకపోవడం కిరస్తానీగా తోచింది. ఏపూజా లేదు. బ్రాహ్మలు దారు. దేవుడు తక్కువజాతి యిళ్ళల్లో పనిచేస్తున్నట్లు చూస్తుంది. ఇట్లా దేవతల్ని ఉపేక్ష చెయ్యడంవల్ల గొప్ప ఘోరాలు కలుగుతాయని ఆమె నమ్మకం. వెంకట్రామయ్యగారి యింటో, ఆయనకాకపోయినా ఆడవాళ్లు పూజలు, పండగలు, వ్రతాలు అన్నీ ఆచరిస్తారు. ఇప్పుడు ఆమెకు దేవతలు కలల్లో కనపడి బెదిరిస్తున్నారు.

సంఘంనించి విడబడ్డవాళ్లు సంఘానికి యేదో వ్యతి

రిక్తంగా నడుచుకుని వుంటారు. వ్యతిరిక్త ప్రవర్తన న్యాయమనీ, సంఘమూర్ఖత్వమే తమని వెలిబరిచిం దనీ, విశ్వాసముంటేనే గాని వొంటరితనాన్ని, సంఘ నిర్లక్ష్యాన్ని, తిరస్కారాన్ని ప్రజలు భరించలేరు. తాము సత్యాన్ని నమ్మామనీ, సంఘానికి ఆదర్శం చూపుతున్నామనీ వుండే విశ్వాసమే వారికి బలమై 'లోన్లీ'గా వుండడం ఇబ్బంది లేకండా కాపాడుతున్నది. తమ బాధకు అర్థమూ ప్రయోజనము వున్నదని సమ ర్థించుకోగలరు. ఇతరులు తమని దూషిస్తే ప్రజల మూర్ఖత్వమని సంస్కర్తలు నవ్వుకుంటారు గాని ఆగ్రహపడరు-తాము తమజీవితంలో అవలంబించిన సంస్కరణం, ఆత్మసంస్కారానికే గాక, సంఘ సంస్కారానికి వినియోగపడుతోంది గనక! కాని వితంతు పునర్వివాహం వారికి చాలా మందికి యీ చిత్తసంస్కారంలేదు. చాలామంది సంఘంలో గతి లేక భార్యకోసం వెలిపడ్డవారు. చాలామంది స్త్రీలు కామాన్ని పరిపాలించుకోలేక, భర్తఅనే పేరుతో పురుష మృగం దొరికితేచాలునని ప్రపంచంమీద పడ్డవారు. వారిసంస్కరణంలో వారికే విశ్వాసం లేదు-కామంలో తప్ప. అందుచేత "విధవావివాహం వాళ్లు"అని వెక్కిరిస్తే, బాధపడతారు, ఆగ్రహపడ తారు. "అవును—ఏమి! వితంతు వివాహం చేసుకో గలిగిన ధైర్యంగలవారము. బలవంత వైధవ్యాన్నించి స్త్రీలని కాపాడ్డానికై, సంఘ బహిష్కారాన్ని భరి

స్తున్న వీరులము." అనుకోరు. అందులో యీ గోల యేమీపట్టని సుందరమ్మ, యీ వివాహంవల్ల, సుఖముగాని, శాంతినిగాని లాభంపొందని సుంద రమ్మ, యీ బహిష్కారం వల్ల చాలా బాధపడ్డది.

స్వభావంవల్ల తనతోడి వారి స్నేహాన్నీ, ప్రేమనీ అభిలషించేది ఆమె. తనుచేసిని దోషంమరిచి, యిరుగు పొరుగువారిని అతిఉత్సాహంతో పలకరించి, ఆహ్వా నించి వారికోపం చూపులతోనూ, దొంగ తప్పించు కోడాలవల్లనూ గాయపడ్డది. లోకం వున్నది వున్నట్టు ఆమెకి నివాస యోగ్యంగానే వున్నది. ప్రజలు మంచివారుగానే వున్నారు. వారిలో లోపాలకంటె వారి సుహృద్భావమే గోచరిస్తుంది ఆసరళహృదయు రాలికి. వాళ్లు నవ్వి చక్కగా మాట్లాడితే చాలు, వారి జీవితము, అభిప్రాయాలూ ఎట్లాంటివైతే తన కేం? వారినికూడా తనని అట్లానే చూడమంటుంది. వారి క్రూరత్వానికి కారణం కనపడదు. ఈవివాహం వల్ల తాను అసలే బాధపడుతోంది. జాలిబదులు వారు క్రౌర్యం ఎందుకుచూపుతారా అనుకుంటుంది.

పురుడుకి మంత్రసాని తప్ప ఎవరూలేరు. చిన్న ప్పుడు తాను చూచిన కాన్పులూ, ప్రసవించిన స్త్రీకి కలిగిన ఆదరణా; తల్లిని కాగలిగాననే గర్వమూ, యితరులు చూపే శ్రద్ధవల్లా, చనువువల్లా వూరటా, బిడ్డకి వారు చూపే గొప్పతనమూ, "ఎట్టెన్షణ," తలుచుకుని, తన వంటరిబతుక్కీ, బాధకీ, యేడ్చింది.

ఆబిడ్డ అందం ఎవరికో చూపాలని వుంటుంది, పోలికలు అందరూ గుర్తు పట్టాలనిపిస్తుంది.

"మా అబ్బాయి మా అమ్మ. ఆ పోలికేనమ్మా! తెల్లగా వుంటాడు." అంది పట్టలేక దడి వెనక అంట్లు తోలుచుకునే వితంతువుతో.

"ఆహా! అవును తెలుపులో కూడా అందం లేకపోలేదు."

అని తోలవకండానే కొన్ని గిన్నెలు తీసుకుని యింటోకి పోయింది.

"అప్పుడే నన్ను చూచి 'వూ' అంటుందమ్మా!" అంది పొరుగింటి వంటావిడతో.

"అవును. కొందరు పిల్లలకి అట్లానే అతితెలివి. జాగ్రత్తగా వుండాలి" అంది. పత్యం చేసుకోలేక, పిల్లకి ఉపచారం చేసుకోలేక, ఎట్లా చేసుకోవాలో తెలీక బాధపడ్డది సుందరమ్మ. తనతో 'కంప్లైంటు' చెయ్యకపోవడంవల్ల చంద్రశేఖరానికి ఆమె కష్టాలు తెలీవు, తెలుసుకో తలుచుకోలేదు. ఆమెకి మాతృత్వమెంత కొత్తో, అతనికి పితృత్వమూ అంతే కొత్త. పిల్లని సృష్టి యిచ్చిందిగనుక, హృదయంలో ప్రేమనీ స్తనంలో పాలనీ ఏర్పరిచింది గనుక, యింక యేమీ అవసరంలేదనీ, మృగాలలోవలెనే, తల్లికికూడా సహజంగా పిల్లని జీవితానికి తయారు చెయ్యడం తెలుసుననీ అనుకుంటారు. తినాలంటే వంటా, తిరగాలంటే కట్టూ, మాట్లాడాలంటే భాషా, బతకాలంటే నీతీ,

ముందు నేర్చుకోడం యెంత అవసరమో, పిల్లల్ని పెంచేవిధం కూడా నేర్చుకోడం అంత అవసరమేనని గుర్తించరు. భర్తని ఆకర్షించాలన్నా, స్త్రీ, మృగాలకన్న ఎక్కువ నేర్పు కలిగి వుండాలని వొప్పుకోరు.

సుందరమ్మ బారసాల చేసుకోవాలని పట్టుపట్టింది. చంద్రశేఖరం చాలా ప్రయత్నించాడు కాని ఒక్క బ్రాహ్మడూ దొరకలేదు. ఆ వితంతు వివాహాల ఆయనకి బారసాల మంత్రాలు రావు. ఆమంత్రాలు చదివి దేవతలని ఆహ్వానించనందున వారికి ఆగ్రహం కలిగిందని ఆమె భయం. ప్రస్తుత హిందూ ప్రపంచంలో, వుత్త మంత్రపు శబ్దాలూ, వాటితో చేసే అర్థంలేని కలాపాలూ మిగిలాయి. అసలు దేవతల్నీ, వారిని చూస్తే భక్తి భయాల్ని మరిచిపోయినారు. బారసాలలూ, పెళ్ళిళ్ళూ, చావుకర్మలూ వీటికి మతసంబంధమైన అర్థం వూడిపోయింది. సంఘ సంబంధమైన అవసరమే మిగిలింది. మర్యాదకోసం భేషజంకోసం, తక్కినవారి అమర్యాదకు దడిశీ, ఆ తంతులు నడుపుతున్నారు. ఆకర్మలలోని మంత్రాల వల్ల ఏ దేవతల్ని ఆహ్వానిస్తున్నారో, ఏ శక్తుల్ని ప్రజ్వలింపచేయ వుద్దేశ్యపడుతున్నారో, ఏ ధర్మాల్ని ఏ విధుల్ని పరిపాలిస్తామని ప్రమాణాలు చేస్తున్నారో ఎవరికీ పట్టవు. అర్థంకావు. ఆదేవతల ప్రమేయమే అక్కర్లేదు. కాని పాపం, సుందరమ్మ హృదయంలో మాత్రం వారి అసలు 'స్పిరిట్' వుండిపోయింది.

ఆ దేవతలు తృప్తిపడి, ఆశీర్వదించాలి, పంచ భూతాలూ తన శిశువును పోషించి కాపాడతామని అభయ మివ్వాలి. అట్లా చెయ్యకపోతే జీవితం అపాయంలో పడుతుంది. తన బిడ్డ ఏ దేవతల సహాయమూ లేక అనాథ ఐపోయింది. మంత్రాలతో పూజలతో సంప్రీతుల్ని చేసి, ఆహ్వానించందీ, ఆ దేవతలెందుకు ఆశీర్వదిస్తారు? ఇంక ఆబిడ్డకి తానే దిక్కు. తల్లి పనీ, దేవతల సహాయమూ అన్నీ తానే చెయ్యాలి. తాను ఏమాత్రం ఏమరినా, మహదుపద్రవం తటస్థిస్తుంది. ఇట్లా నమ్మి, ఆలోచించి ప్రతినిముషమూ బిడ్డని కనిపెట్టుకుని కూచుంది. వంట తగలేస్తోంది. తక్కిన పనులికి భర్తపిలిస్తే పలకదు. మరీ గోలపెడితే "మీరే చేసుకోండి" అంటుంది. దేనికి కదలవలసి వచ్చినా, ఆబిడ్డతోనే బయలుదేరుతుంది. ఎవరన్నా ఆమె ఆదుర్దాని చూస్తే కోపమూ, నవ్వూ వస్తాయి. కిటికీలు తలుపులు తెరవదు. గాలి రానీదు. ఆబిడ్డ ఏడ్చినా భయమే, ఏడవక వూరుకున్నా భయమే. ఆవలిస్తే యేదో భయం, ఎక్కిళ్ళువొస్తే పెద్దజబ్బని నిశ్చయం. కళ్ళు ఎటుతిప్పినా సందేహామే. సహజంగా, కోమలంగా, విజృంభించి ఆవరించే సంతోషాస్పదమైన మాతృభావం యిట్లా వంకరులతిరిగి, ఆమెకి వెర్రు లెత్తించింది. ఆ లేత తల్లికి దిక్కు లేక, విద్య లేక, ధైర్యం లేక, వుత్త గుడ్డి ప్రేమతో, భయాలు కల్పించుకుని బాధపడుతోంది.

ఎండాకాలం నోరు ఆరుతుందని, అరగంటకి అరగం
టకీ పాలిచ్చి అజీర్ణం తెప్పించింది. పొట్ట వుబ్బి కడు
పులో నెప్పితో పిల్ల ఏడుస్తోవుంటే, సమదాయించడా
నికి, మళ్ళీ పాలిచ్చింది. ఆపిల్ల కుడుచుకునే "ఇర్ఘ
స్ట్రిక్టు"తో తాగి, యింకా బాధపడ్డది. కక్కులు
కలిగి, జ్వరంతగిలేప్పటికి దేవతల ఆగ్రహం ప్రారం
భించిందని ఏడుపు ప్రారంభించింది సుందరమ్మ
తానుతప్ప ఆపిల్లకి గతిలేదనీ, ముసలమ్మ ముద్దూ,
బంధువుల ముద్దూ, తానే చెల్లించాలనీ, ఎప్పుడూ
ఎత్తుకునే వుంటుంది. తన పాత మురుగులు అమ్మి,
ఆపిల్లకి బలువైన మురుగులూ, గొలుసులూ, కడి
యాలూ, చేయించి పెట్టింది. ఒక రక్షరేకు కట్టింది.
జ్వరానికీ, అజీర్ణానికీ మందులు ప్రారంభించింది.
ఈ దేశంలో సలహా ఉచితము. అంత చవకగా దొరి
కేది ఇంకేంలేదు. ఒకళ్ళూ బాధ్యత తీసుకోరు,
యింటి గుమ్మం తొక్కరు. కాని గోడమీదినుంచి
సలహాలు విసురుతారు, అమితంగా.

"ఏమమ్మా! మీపిల్లకి జ్వరమా? పాపం!
ఏంచేస్తాం ఖర్మం! వాముతెచ్చి రసంతీసి పోంగించి
పొయ్యి."

"వాము తెచ్చేవాళ్ళెవరూ లేరే!"

"లేరూ?" అంటో యింటికి పోతుంది.

"మాచంటివాడికి యింతేనమ్మా! దుంపరాష్ట్రం
కాల్చి బూడిదచేసి, ఆనీళ్లు పోస్తే జ్వరం పోయింది.

అట్లా చెయ్యి."

"నాకు చాతకాదు. కొంచెం చేసి పెడుదురూ."

"నాకెక్కడ తీరుబడి!" అంటో వెళ్లింది యింకో ఆమె.

ఈవితంతు వివాహం చేసుకున్న వాళ్లకి చిక్కులు రావడం తక్కినవాళ్లకేమీ విచారంగా లేదు. అట్లాంటి పాడుపని చేస్తే ఏమవుతుంది మరి! దేవుడు లేడూ?

పాపం తనే బజారుపోయి ఆవిషాలు కొని తెచ్చింది. రోడ్డు వెంట నడిస్తే, పక్కన రౌడీలు, ఆమె యెప్పుడు లభిస్తుందా అన్నట్టు, యీ పోలీసులనే వాళ్లు వున్నారుగాని, లేకపోతే అమాంతంమీదపడి యెత్తుకుపోమా అన్నట్టు చూస్తారు. మర్యాదస్తులూ, వుద్యోగస్తులూ, కళ్లుకోరగా వాల్చి పక్కకిచూసి చూసి దత్తిపడతారు. ఆచూపుల్ని వోర్చుకో లేక అసహ్యపడి, ప్రపంచాన్నీ తననీ తిట్టుకుని, బిడ్డ యేమయిందో అనే ఆతురతతో యింటో వొచ్చి పడుతుంది.

ఆమందుల్ని నూరి పొంగించి, పొరుగువాళ్లని ప్రశ్నించి విసిగింది, ఆ కారంరసాల్ని ఆపసిపిల్లనోట్లో పోస్తే, ఆపిల్ల ఆబాధ అర్ధంగాక, తన్నుకొని, ఆమె వంక జాలిగా చూస్తే గుండె తరుక్కుపోయి యేడుస్తుంది, ఆ పిచ్చితల్లి.

చివరికి ఒకరోజు మధ్యాన్నం ఆబిడ్డకి జబ్బు ఎక్కువై గడబిడ చేసింది. ఎవరూ యింటో లేరు.

సుందరమ్మకి యేమీ తోచక, తల్లిదగ్గర్నించి నేర్చుకున్న ఆపదుద్ధారక స్తవం ప్రారంభించింది. బిడ్డని వొదిలేసింది. ఆమె అవసరంవున్న స్థితిలో లేదుబిడ్డ. అతి దీక్షతో, విశ్వాసంతో పఠించి, తన యిష్టదైవమైన పార్వతికి, సహస్రనామార్చనా, కొత్తచీర కానుకా మొక్కుకుంది. చంద్రశేఖరం వొచ్చేప్పటికి, కిటికీ దగ్గిర కళ్ళుమూసుకు కూచునివుంది. పిలిస్తే పలకలేదు, అతను బిడ్డవంక చూసి డాక్టరు కోసం పరిగెత్తాడు. కాని డాక్టరు వొచ్చేప్పటికే పిల్ల ఏడ్చి పాలుతాగుతోంది, సుఖంగా. ఆయన అపాయం దాటిపోయిందని చెప్పి మందుఏదో పంపాడు. కాని సుందరమ్మ ఆ మందుని వాడనే లేదు.

బిడ్డకి కొంచెం కులాసా యివ్వగానే తన మొక్కు చెల్లించే ప్రయత్నం ప్రారంభించింది. చీరకోసం పదిహేను రూపాయలడిగేప్పటికి చంద్రశేఖరం గుండె పగిలి పోయింది. అతనికి అర్థం కాలేదు.

"ఇప్పుడెందుకు అమ్మవారికి చీర?"

"మన పాపకి నయం కాలేదా?"

"సంబంధమేమిటి, దానికీ, దీనికీ?"

"ఆమే నయం చేసింది."

బిగ్గిరిగా నవ్వాడు. ఇంక తనప్రార్థనా, మొక్కూ సంగతి ఆమె చెప్పతలుచుకోలేదు.

"పోనీ, నాకు కావాలి ఇయ్యండి."

"నీకుకావాలీ? పదిహేను రూపాయలా! రూపా

యలు కోళ్లు ఏరుకుతింటున్నాయా? నోరుముయ్యి."

తనూ తనబిడ్డా! ఇద్దరూ దరిద్రులు. ఎప్పుడైనా ధనం వొస్తుందా? జీవితమంతా యింతే. బిచ్చగాళ్లు ఈలోకంలోకి అష్టదరిద్రులై వొచ్చారు. ఇంత దరిద్రంలో, ఏమీ సహాయం చెయ్యలేని తనికి ఎందుకు పుట్టాలి ఆబిడ్డ! కూలిది, పాకీది, కష్టపడి, సంపాయించి కూడబెట్టే ఆశవుంది వారికి! తనకి యాచకత్వం తప్ప గతిలేదు. తన అవసరమైతే అభిమానంతో వూరుకుని వుందును. కాని తనబిడ్డ, మళ్ళీ రోగం వొస్తే!

అదీగాక దేవతలు వృత్త అభిప్రాయాలుకారు ఆమెకి వాస్తవమైన వ్యక్తులు. ఈ మనుష్యులందరి కన్నా ఆమెకి సన్నిహితులు. అంబను నమ్మించింది, ఆమెతో అబద్ధమాడింది. ఆమె ఆగ్రహిస్తుంది. అంతే కాదు "సుందరమ్మ ఏమోననుకున్నాను దానిమాట నమ్మి వుపకారంచేశాను. ఇంతమోసకత్తా!" అనుకుంటుంది ఆదేవి. ఆదేవతలు, తమ చీరెలకోసం, భోజనం కోసం భక్తులమీద ఆధారపడి వుంటారనీ, భక్తులు నిర్లక్ష్యం చేస్తే బాధపడతారనీ అనుకుంటుంది.ఏంచెయ్యాలి? మళ్లీమళ్లీ చంద్రశేఖరాన్ని బతిమాలింది. పాపం, ఒకరోజురాత్రి అతనిమీద, లేని మోహాన్నిచూపింది. అతన్ని లాలించి ఆనందపరిచింది. అతను చాలా సుఖంలో వుండగా, తన సిగ్గునంతా తొక్కిపట్టి, చిరునవ్వుతో,

" నాకా పది హేనురూపాయలూ యివ్వరా ! " అంది. వొణుకుతోంది. ఏం ప్రత్యుత్తరం వొస్తుందో!

" పిచ్చిపిల్లా ! కష్టపడి... నేను పని చేసి దాచుకున్న......డబ్బుకాస్తా యిట్లా ఖర్చుచేస్తే...... ఎవరికోసం !......నీకోసమేగా...మన అబ్బాయికోసం...మళ్లీ పిల్లలుపుడితే! ...పూరుకో...మూడు రూపాయలు...... "

సుందరమ్మ కుంగిపోయింది. వొళ్లంతా అసహ్యపడ్డది. వేశ్యాత్వంచేశినట్టయింది. చాలామంది పతివ్రతలగతి యింతే. భర్తలతో వ్యభిచారం చేస్తేనే గాని గతిలేదు. అప్పటికీ వేశ్యకి ముట్టేటంత ప్రతిఫలంకూడా దొరకదు. చంద్రశేఖరంమీద భరించలేని అసహ్యాం ద్వేషం కలిగాయిఆమెకి.ఆసమయంలో అతన్ని చంపడానికి ఏమాత్రమూ సందేహించి వుండదు. కాని మర్నాటినించీ మళ్లీ అతన్ని సేవించి, కామించి, పిల్లల్ని కనితీరాలి. ఇదీ కుటుంబచరిత్ర !

విధిలేక వెంకట్రామయ్యగారి నడిగి పదిరూపాయలు సంపాయించింది. తన చీరెలు తాకట్టుపెట్టి ఐదూ భర్తిచేసింది. ఇవన్నీ పట్టుకుని సాయంత్రం పక్కనవున్న యీశ్వరుడి గుడికి పోయింది. అక్కడ ఒకమూల పురాణం చెపుతున్నారు. పూజారికూడా అక్కడే కూచున్నాడు. పురాణంలో కూచున్న కామమ్మకోసం విటుడు, దుర్గయ్య మంటపంలో కూచున్నాడు. కామమ్మకీ పూజారికీ సంబంధమున్న

దని అతని అనుమానం. రెండోపక్కన గన్నేరు పొదవెనక డబ్బులుపెట్టి ఆరుగురు పేక ఆడుతు న్నారు. వొద్దంటారనే భయంతో యిద్దరు తొడకింద బీడీలు దాచుకుని తాగుతో వుమ్మేస్తున్నారు. ఆ ప్రదోష సమయంలో మహేశ్వరుడికి, తన వెయ్యి పేర్లబదులు బూతులు వినపడుతున్నాయి.

ఎవరో కొంకాయ తీసుకొచ్చాడని పూజారి బద్ధ కంగా లేచాడు. ఇంకెవరైనా స్త్రీఐతే ఎవరూ గమ నించకపోదురు. సుందరమ్మ లావణ్యం ఆ గుడి ఆవ రణనంతా మతాబువలె వెలిగించింది. ఆ సాయిం త్రపు ఎండలో, బంగారంమీద పొదిగిన రవ్వవలె మెరుస్తోంది ఆమె శరీరం. ఆరునెలల కిందటే పిల్లని కని గుడివెనక పారేశిన శేషమ్మ కళ్లు వురిమి ఆమె వంక చూసింది. వితంతు వివాహం చేసుకొన్న సుందరమ్మకి గుడిలో యేం పని? పవిత్రమైన ఆల యం గడప తొక్కడానికి ఆమెకేం అధికారముంది? పూజారి ఆ మెపళ్లాన్ని అందిపుచ్చుకుని, చీరెను చూసి ముగ్ధుడౌతున్నాడు. శేషమ్మ తొరగావచ్చి

"అయ్యా, సుబ్బయ్యగారూ ఒకమాట."

పూజారి తిరిగి వొచ్చాడు.

"అమ్మా, మీరు వునర్వివాహం చేసుకున్నారుట కదా! ఇది మర్యాదకాదండి." అని పళ్లెం అక్కడే పెట్టాడు. ఆయన కోపమంతా శేషమ్మమీదే. అన్యా యంగా చీరెదక్కకండా అడ్డపడ్డది. ఆ శేషమ్మ సం

గతి తెలీనిదెవరికి?

"కాని, నేనిక్కడే నుంచుంటాను. మీరు ఇవి అంగీకరించండి. అమ్మవారికి సమర్పించి పూజ చెయ్యండి."

అవును. దానికేం అభ్యంతరం వుంటుంది? తటపటాయించాడు. ఇంతలో శేషమ్మ పురాణందగ్గిరికి పోయి తన ఘనకార్యం వర్ణిస్తోంది. ఈసేవవల్ల తన గౌరవం కొంతవృద్ధి పొందవచ్చు. తన మీదవున్న కొన్ని నిందలు మాసిపోవొచ్చు. ఏమో యీశ్వరుడికి కూడా దయగలిగి, తన ప్రస్తుతపు రోగో అనుమానాన్ని నివర్తించవొచ్చు.

"పెళ్లి చేసుకుందిగాక, తనూ ముత్తైదనేసని, కులుకులో పల్లింపట్టుకుదయచేసింది చూడండి. వీళ్లకి సిగ్గూ భయమూకూడా వొదిలిపోయినాయి. ఇంక మన పంక్తికి భోజనాలకి తయారౌతారు." అంటోంది.

అందరికళ్లూ పూజారిమీద వున్నాయి. పురాణం శాస్త్రులు అనాథ్యుడు.

"వీల్లేదమ్మా. వీల్లేదు. తొరగా వెళ్లిపొండి ఇక్కణ్ణించి." అన్నాడు పూజారి దడిశి.

"ఇవి ఇక్కడే వొదిలి వెడతాను పోనీ."

కొందరు పురాణంవాళ్లు లేచి దగ్గిరికి వొస్తున్నారు - అందులో రాజమ్మకూడావుంది. ఆమె నోరు విప్పిందా యింక ఆ రెండు ప్రవాహాలాకీ అడ్డువుండదు. "వీల్లేదు. తీసికెళ్లండి."

అభిమానధనమైన సుందరమ్మ, ఆగుంపుచూపులు భరించలేక, పళ్లెంతీసుకుని చివాలున వెనక్కిపోయింది. ఆమె అందాన్నిచూసి గుటక లేస్తో మొగవాళ్లు నుంచున్నారు. తమ మతవిజయాన్ని సూచిస్తో స్త్రీలు దరహాసితవదనారవిందలై చూస్తున్నారు. పావురాలు నెమ్మదిగా మూల్గుతున్నాయి. పచ్చగన్నేరుపూలు గాలిలో కిందికిరాలాయి. భక్తపరాధీనయైన పార్వతి ఒక్కమాటలేక పెద్దగుడ్లు పెట్టుకొని చూస్తోకూచుంది. బిక్కమొహంతో, దేవతలు కూడా నిరాకరించిన తన నికృష్టపు కాన్కతో తిరిగి వచ్చి ఆపిచ్చితల్లి నిద్రపోయే తనబిడ్డవంక చూస్తో,

"నీవైనా నాకు దక్కుతావా? నన్ను వొదిలి వెళ్లిపోతావా? ఇంకనాకు బిడ్డలు పుడతారా? ఇంతేనా? ఎవరూ దిక్కులేక, ప్రేమించడానికి ఆధారమేలేక, ఎన్నియేళ్లు యీ వొంటరి ప్రపంచంలో బతకను? చివరికి, నువ్వుకూడా, నాప్రాణానివి, నా వంక అంతప్రేమగా చూచి, నాముఖం చిన్నిచేతులతో తాకే నువ్వుకూడా వెళ్లిపోతావా?" అన్నట్లు చూస్తోనుంచుంది. రెండు కన్నీటి చుక్కలు ఆమె పమిటమీద పడ్డాయి. పడమటి కడపటికాంతి ఆమె నల్లగా నిగనిగలాడే జుట్టులో మెరిసింది.

అగ్గిపెట్టికోసం వెతికింది. కనపళ్లేదు. సూర్యుడే వొదలిన జీవితాలకి, అగ్గిపెట్టిమాత్రం దొరుకుతుందా!

వూళ్లో ఆచివరవున్న గుడికి మర్నాడు వెళ్లాలని

నిశ్చయించేసుకుంది. అక్కడ తనని యెరిగివుండరు కద! మర్నాడు తలంటి పోసుకుంది. పూలూ అన్నీ తెప్పించింది. బండీ పిలిచింది. పళ్లెంవంక చూసేప్పటికి చీరలేదు. గొప్ప సంతోషం వొచ్చింది. పార్వతీదేవి తన అవస్థని కనిపెట్టి, తానే చీరని స్వీకరించింది. ఇంకేం అదృష్టంకావాలి తనకి అంతకన్న! అదేమీ ఒక వింతకాదు ఆమెకి. ఇట్లా దేవతలు తమకు కావలసినవి స్వీకరించడం పుట్టింటో తన చిన్నతనంలో చాలాసార్లు మామూలుగా జరిగేవి. ఎంతో ఆనందం కలిగింది. బండివాడికి అణాయిచ్చి పంపేసి, తన బిడ్డనెత్తుకుని ధైర్యంతో ముద్దాడింది.

రాత్రి చంద్రశేఖరంతో చెప్పకండా వుండలేకపోయింది.

"ఆపళ్లెంలో ఒక చీరె పెట్టాను."

"పళ్లెంలోనా! చీరెని పెట్టావా? పెడితే!"

"పెడితే, యీవాళ కనపళ్లేదు. ఏమయిందో కనుక్కోండి."

ఆమెమాటల్లోని సంతోషాన్ని గ్రహించలేదు అతను.

"అసలా కొత్తచీరె నీకెక్కడిది?"

ఇతనికి ఆకొత్తచీరెసంగతి యెట్లా తెలుసు? చప్పున తగ్గింది. అనుమానం కలిగింది.

"కొత్తచీర అని మీకెట్లా తెలుసు?"

ఒకవేళరాత్రి అమ్మూలకి వెళ్లిచూశాడేమో!

"నాకేం తెలుసు ? ఎట్లా తెలుసా? పళ్లెంలో పెట్టానన్నావుగా ! కొత్తచీరెమో అనుకున్నాను. నీకెక్కడిది?"

"నాకా! ఎక్కడిదో! కాని ఆచీర యేమయింది?"

"ఏమో! నాకేంతెలుసు నన్నడుగుతావేం? ముందు అది యెక్కడిదో చెప్పు."

ఆమె మాట్లాడలేదు. కోపం, రోషం, అసహ్యం, భయం, యిన్నీ వొక్కసారి కలిగాయి. ఆరాత్రంతా కిటికీదగ్గర కూచుని, గుడికేసి చూస్తో, పార్వతీదేవితో తనగతి విన్నవించుకుంది. భర్తని తిడితే మళ్లీ దేవతలకి కోపంవొస్తుందని భయం.

"తల్లీ! నీకు తెలుసు నాభర్త యెటువంటివాడో. అందువల్లనే నేను వాగ్దత్తం నిలుపుకోలేకపోయినాను. నన్ను కరుణించాలి." అంది.

అయినా మనసు ఆగలేదు. ఇంకో చీరె తాకట్టు పెట్టి, ఒకపట్టురవిక బట్ట కొంది.

దేవతలపూజ లంటే, తమ సౌఖ్యాన్ని, ప్రాణాల్ని కుటుంబాల్ని, సూర్యచంద్రుల్నే త్యాగం చెయ్యడానికి సంసిద్ధులైన మహరుషి పత్నుల రక్తం ఆమె నాళాలలో చిందులుతొక్కింది. ఎన్నడూలేని సాహసం అప్రయత్నంగా కనిపించింది.

రాత్రి యెనిమిదయింది. కటికచీకటి. రోడ్డుమీద మనుషులు తిరగడం తగ్గారు. తన మహాద్యత్నానికి గడిచిన గంటనించి ధైర్యం తెచ్చుకుంటోంది, మళ్లీ

చంద్రశేఖరం వొస్తే విఘాతం కలుగుతుంది. ఆ దేవి మీదనే భారంవేసి నిద్రపోతున్న బిడ్డకేసి ఒకసారి చూసి, కళ్లుమూసుకుని తెరిచి, వీధితలుపు దగ్గరవేసి చప్పున వీధిలోకి వెళ్లింది. తలవొంచుకుని ఇటూ అటూ చూడక నడిచింది. చంద్రశేఖరం ఎదురౌతాడని వొకటే ముఖ్యమైనభయం. సరాసరి రోడ్డు మీదనించి ప్రాకారంలోకి వెళ్లి ఆగింది. చుట్టూ చూసింది. ఎవరూ కదలటంలేదు. గుళ్లో రెండుమూడు దీపాలు దిక్కులేక వెలుగుతున్నాయి.

బైటనించి ‘ ఆకలేస్తోంది. అయ్యలారా ’ అని కాఫీహోటలు గుమ్మంలో కూచున్నవాడి ఆర్తనాదం వినపడుతోంది. ఒక్క నిముషం సందేహించి చటాలున లోపలికి వెళ్ళింది. పార్వతీ విగ్రహం ముందు ఒక చిన్న దీపం వెలుగుతోంది. అనంతకాలాన్ని హక్కుగాగొన్న ఆలయపు చీకట్లు ఆచిన్ని వెలుతుర్ని మింగుతున్నాయి. తన పని సమ్మతమేనా అనే ఆలోచన కూడా లేక, కార్యసాధనే ప్రాముఖ్యమనే ఏకాగ్రతవల్ల, పమిట కొంగుతో ఆ దీపాల్ని ఆర్పింది. పట్టుబట్టను తీసి అమ్మవారి మెడను చీకట్లో స్పృశించి, కప్పి, బిగ్గిరిగానే, చిన్నస్వరంతో, “తల్లీ” ఇంతకన్న నాకు శక్తి లేదు. సర్వమూ తెలిసిన దానివి. దీనినే గొప్ప చీరెగా గ్రహించి, నా కొడుకును కాపాడు” అని వొంగి ఆమె పాదాల్ని గట్టిగా పట్టుకుంది. తన నిస్సహాయత్వం, తాను పొందిన

నీచత్వం, తన బిడ్డ అపాయాలు అన్నిటికీ కలిపి పెద్ద యేడుపు వచ్చింది. ఆపుకోలేకపోయింది. గొల్లు మని ఏడ్చింది. ఆమె కన్నీళ్లతో దేవి పాదాలు అభి షేకాన్ని పొందాయి.

"ఎవరక్కా?"

చప్పున లేచి నీడవలె గర్భగుడి చీకట్లలో మాయ మయింది. ఎవరో వస్తున్నారు, బైటికివచ్చి చీకట్లో నుంచుంది. ఎవరూ లేరు. బిరబిరా నడిచింది బైటికి. ఎవరో వెనక నడినడిగా నడుస్తున్నారు. "ఎవరూ?" అంటో సమీపిస్తున్నాడు. గాలిగోపురంకింది చీకట్లలో కలుసుకున్నాడు. నాలుగుగజాల దూరంలో రొడ్డు కాచి నడుం పట్టుకున్నాడు.

"ఎవరు? రా."

లోపలికి లాగుతున్నాడు.

"తల్లీ, పార్వతీ రక్షించు."

ఎట్లా కేకలు వేస్తుంది? గుళ్ళో ప్రవేశించినందుకు శిక్షిస్తారుగావునే!

లోపలికి లాగుతున్నాడు, ఆ రెండో చెయ్యి.

హరి హరీ, యెట్లా?

"ఓరీ చస్తావురా! నేను పార్వతిని."

ఆ శబ్దం గర్భగుళ్ళోంచి విని, ఆ శిలావిగ్రహ నేత్రం ఆర్ద్రమయింది. నక్షత్ర కాంతిలో ఆమె వున్నత శరీరం, దీర్ఘ బాహువులు - బంగారుఛాయ గంభీర కంఠం, వణికిపోయినాడు. వొదిలాడు ఆమె

అదృశ్యమయింది.

అవును. ఆమె గర్భగుళ్లోంచే బైలుదేరింది. అవును పార్వతేనేమో! రాత్రి పూజారి సుబ్బయ్యకి పెద్ద జ్వరంవొచ్చి "తల్లీ, తల్లీ, పాపిని క్షమించు." అని సంధిలో అరవడం ప్రారంభించాడు.

౮

మూడునెలలు గడిచాయి. బిడ్డ రోజు రోజూ క్షీణించుకొస్తోంది. కక్కులూ దగ్గూ. వాటితో కూడా తల్లి ప్రేమ వృద్ధిఅవుతోంది. ఆమె ప్రేమవల్ల, అధికమైన శ్రద్ధవల్ల బిడ్డకి బాధలూ యెక్కువవుతున్నాయి.

సుందరమ్మకి యీ మాతృత్వాం 'ఇన్‌స్టింక్ట్' ఒక పిచ్చికింద తయారయింది. బిడ్డకీ, భర్తకీ, తనకీ, సంసారానికీ, గొప్ప ఆనందం యివ్వవలసిన శక్తులన్నీ వక్రించి, విషమించి యెదురుతిరిగి ఆమె హృదయాన్ని తినేస్తున్నాయి. రాత్రులు చంద్రశేఖరాన్ని దగ్గిరికి చేరనీదు. "చేసిన పాపంచాలు. ఇంక జన్మానికి అక్కర్లేదు" అని తీవ్రంగా నిరాకరిస్తుంది. అతనికీ స్త్రీ అవశ్యకతే గాని, సుందరమ్మమీద ప్రత్యేకమైన ప్రేమాలేదు, ఆకర్షణాలేదు. కామంపెట్టే కలతవల్లా, తన హక్కులు పోయినాయనే చింతవల్లా, అభివృద్ధి అవుతున్న ఆగ్రహంతప్ప.

ఆమధ్యనే ఆవూరు ఒక దివ్యజ్ఞాన సమాజకుడు వొచ్చి, పరలోకాలలో ఆత్మల జీవితాల్ని గురించి

స్త్రీలకు ప్రత్యేకం వుపన్యాసాలిస్తున్నాడని విని సుందరమ్మ ఆశతో మీటింగుకి వెళ్లింది. చచ్చిన వాళ్లు యెక్కడికీ పోరనీ, తాము యెవర్ని ప్రేమిస్తున్నారో వారినే అంటిపెట్టుకుని తిరుగుతారనీ, మంచీ హానీకూడా చెయ్యగలిగినశక్తి ఆ ఆత్మలకి వుంటుందనీ, తాను, తన సహచరులూ, దేహాల్ని యిక్కడ విడిచి వెళ్ళి వాళ్ళతో కాలం గడుపుతో వుంటామనీ చెప్పాడు అయన. సుందరమ్మకి ఆరాత్రి జ్వరం వొచ్చింది. ఆనాటినించి మొదటి భర్త ఆమెతో నివాసం ప్రారంభించాడు. అసలు చంద్రశేఖరం తన భర్త కానేకాడనే వుద్దేశ్యంలో పడ్డది. ఒకనాటిరాత్రి అతనుబలవంతంచేస్తే వొణికి, అరిచి, జుట్టుపీకి, రోడ్డుమీదికి దూకడానికి సిద్ధమయింది. అతిసాధువు, సుశీల, శాంతమూర్తి, ఐన సుందరమ్మ కానిభయంతో తన వంక చూస్తో కిటికీమీద చెయ్యేసి వెనక్కి చూసే లావణ్యరాశిని, చూసి, భ్రమిసి, అతనిబాంకు (Bank) హృదయం సహితం భగ్నమంది, చివరసారి.

చంద్రశేఖరానికి వేళకి వంటకూడా లయారుకాదు. పూజలూ, జపాలు, స్నానాలు, వ్రతాలు అతని ప్రాణం తీసేస్తున్నాయి. ఆఆచారాలూ బిడ్డా తప్ప వేరే ప్రపంచంలేదు సుందరమ్మకి. ఈమతాచారాల సన్నిటనీ, ముఖ్యంగా స్త్రీలలో, అర్థహీనమనీ, మూర్ఖమనీ సులభంగా అనేసి, యివి యెన్నాళ్ళకి వొదలవేమా అని దుఃఖిస్తారు, ఆఫీసర్లూ, దేశభక్తులూ. కాని

యీకర్మకలాపాలే, కడగడాలూ, పసుపులు పుయ్యాడాలే, లోకంలో యింక వేరే విలువలేని అనేకజీవితాలకి, ప్రాముఖ్యతవుందనే illusion "ఇల్యూజన్" కల్పించి self importance ని కలగచేసి యేగతీ, ఆనందమూ, ఆధారమూ,తృప్తిలేని,బతుకుల్ని యేదో వొక విధంగా సద్భరంగా చేస్తున్నాయో తెలుసుకోరు. ఇతరమైన ఆసక్తులన్నీ, 'ఇంటరెస్ట్సు'ని కలిగించకండా, తమఅనుకూలంకోసం, ఆఫీసులకోసం, దేశఅభివృద్ధికోసం, తమస్వంత అభిమానంకోసం, స్త్రీలని పాతమార్గాల్ని మానుకుని తమకి అనుకూలం కలిగించమంటారు. వేరేధ్యాసల్ని స్త్రీకి కలిగిస్తే, పాతివ్రత్యపు డబ్బాల్ని తెరిచి విచ్చలవిడిచేస్తామేమోనని భయం. పూర్వపు మూర్ఖత్వాన్ని వొదలాలి స్త్రీ, నవీన విజ్ఞానాన్ని పొందకూడదు. ఇదీ యీనాటి పురుషుడి ఆశయం.

తక్కిన ఆనందాలు తగ్గినకొద్దీ, చంద్రశేఖరానికి యిష్టంలేదని తెలిసినకొద్దీ, తన వివాహం తనమర్యాదకు, కులాధిక్యతకు కళంకం తెచ్చిందని తోచినకొద్దీ సుందరమ్మ తనఆచార చాదస్తాన్ని యెక్కువచేసుకుంటోంది, సహజంగా.

విద్యా, సెక్సు, ధనం, యివన్నీ కల్పించే అంతరాలకన్న, ఎక్కువైనది, వున్నతమయింది ఆత్మ ఆధిక్యతను, జన్మయిచ్చేట్టుంది స్త్రీ పురుషులకి. చంద్రశేఖరం భర్తగనక అధికారి. తనఅధికారం నిలుపుకో

డానికి ప్రయత్నిస్తాడు. కాని జన్మవల్ల సుందరమ్మ అధికురాలు. ఆమె ఆత్మఔన్నత్యంవల్ల. దానిముందు జంకుతున్నాడని తాను చంద్రశేఖరానికి తెలీదు. తన పిరికితనానికి నిందించుకుంటాడు.

చంద్రశేఖరం, ఆమెని అదమాయించే ధైర్యమూ, వోపికా లేక, యింటో శాంతీ,సుఖమూ లేక, యింటికి రావడమే మానేసి, ఎక్కడెక్కడో రాత్రుళ్ళంతా డబ్బుపెట్టి చీట్లపేకలాడడంలో, తనకి బరువైన సంసారమున్నదనీ, యిల్లు నరకంగా వుందనీ, తనకి ఒక ఆత్మవున్నదనీ మరిచిపోవడానికి ప్రయత్నిస్తున్నాడు.

మూడురోజులనించి పిల్లకి మగతగావుంది, సగం కాలం బాధతో గిలగిలలాడడం, సగంకాలం కదలకండా పడివుండడం. ఏది నయమో నిర్ణయించుకో లేకండావుంది సుందరమ్మ. ఆపిల్లపడే బాధఅంతా, గుడ్లుతిప్పడం, చేతులు గుంజుకోడం, మెలికలు తిరగడం,యిదంతా తనుచేసిన పాపాలఫలితంగా జరుగుతున్నాయనే గొప్ప దిగులుతో వేదన అనుభవిస్తోంది. ఎట్లా పరిహారం చెయ్యాలి? ఏత్యాగంవల్ల, యేబాధ వల్ల, ఏ అసహ్యాపు అనుభవంవల్ల, తాను కాలిపోతే, ఆపిల్లకి పరిశాంతిని కలిగించగలదు ?

పిల్లకి మందువేయిద్దామంటే, ఆస్పత్రిడాక్టర్ని పిలిపిద్దామంటే చంద్రశేఖరం డబ్బివ్వడు. అసలు ఆపిల్ల వంకనే చూడడు. పదేపదే యాచించడం ఆమెకి అభిమానం; బిడ్డకి కావలసిన సహాయాన్నికై మొగ

వాణ్ని యాచించేగతి ఒక యీనాగరికపు తల్లులకే పట్టింది. వెంకట్రామయ్యగారు కుటుంబంతో సహా కాశీయాత్రకి వెళ్ళారు, వాళ్లనడుగుదామన్నా.

ఆరాత్రి పిల్లని పక్కలో వేసుకు పడుకుంది. నోట్లోంచి రొమ్ము తీస్తే యేడుస్తుంది. అదిగాక అది వొక్కటే సుందరమ్మకి మిగిలిన ఆనందం. పాలు కుడుచుకోడమనేపని, తల్లిరొమ్ముకిఆనుకుని శాంతంగా కడుపునించుకోడం, వుత్త ఆకలితీరడంకన్న గొప్ప తృప్తినీ ఆనందాన్నీ యిస్తుంది పిల్లకి. అంతకన్నా గొప్ప శాంతీ, సుఖమూ కలుగుతాయి తల్లికి. ఆ ఆనందంలో కళ్ళు మూతలుపడుతున్నాయి సుందరమ్మకి. దూరంగా గోడపక్కన పడుకుని చంద్రశేఖరం నిద్రపోతున్నాడు. ఎందుకో యీవాళ తొందరగావొచ్చి దిగులుగా పడుకున్నాడు. ఆమెకి కొంచెంగా జాలి కూడా కలిగింది అతనిమీద. కనుక్కుంటే! పాపం తాను అతనికి జీవితం దుర్భరంగాచేస్తుందేమో, కాని ......వొద్దు......అతను చీట్లపేకలో మూడున్నర వోడడంవల్ల ఆదిగులు పడుతున్నాడని ఆమెకేం తెలుసూ?

ఎంతసేపు నిద్రపోయిందో? కలవొచ్చింది. పిల్లలు, పిల్లలు, ఎంతమందో పసిపిల్లలు. పాలుతాగే పిల్లలు. ఒకటే, కుడుచుకుంటున్నారు. వేళ్ళు, చెవులు, బుజాలు వీపు, అంతా ఒకటే విద్యుల్లతలవంటి ఆనంద ఝరులు ఝల్లు ఝల్లుమంటున్నాయి. సౌఖ్యం

భరించలేక కళ్లు తెరిచింది. చంద్రశేఖరం ఆమెమీద ఆనుకుని అనుభవిస్తున్నాడు ఆఆనందమంతా. ఆశ్చర్య పడి, ఆగ్రహపడి లేవబోయింది. చాలదినాలనించి పురుషస్పర్శని మరచిన ఆ నరాలు గొల్లుమని యేడ్చాయి. శరీరం తిరగబడి అదమాయించింది. కాని అప్పటికే ఆమె ఆత్మ ఒప్పుకోక శాసించింది, నెట్టింది, తోసింది, తిరిగింది. వాడు, అదుర్మార్గుడు పిల్లమీదికి దొర్లి కిక్కురుమనిపించాడు. కాని వొద లేదు. విధిలేకకళ్ళు మూసుకుంది. ఆనిమిషాన అతని attitude చూస్తే తనమీద దయగా, ప్రేమగా వున్నాడనిపించింది. తరతరాలనించీ అనాధలైన స్త్రీల అనుభవం, భర్త అధీనులై బిచ్చమెత్తిన పూర్వీకుల రక్తం, ఆమె అభిమానాన్ని చంపి, నోరువిప్పాయి. పిల్లవంక చూసింది. పిల్లకోసం తల్లి చేయలేని త్యాగం యేముంది అనుకుంది.

"డాక్టర్ని పిలవరా?" అంది.

"ప్రొద్దున చూద్దాం" అన్నాడు దయగానే. తన శరీరత్యాగం వ్యర్థం కాలేదనిపించింది పాపం ఆపిచ్చితల్లికి.

కాని పొద్దున్న సుందరమ్మ జ్ఞాపకంచేస్తే అతను వినిపించుకోకండా వెళ్లిపోయినాడు. సుందరమ్మకి ఆతను తన మొహాన వుమ్మేసినట్టు, రాత్రి తాను వ్యభిచారం చేసినట్టు అనిపించి, తనమీద తనకే అమితమైన రోతకలిగింది. డబ్బుకి దేహాన్నమ్ముకుంది

పైగా ఆడబ్బుకూడాయివ్వక మోసంచేసి పోయినాడు.

మధ్యాన్నానికల్లా పిల్లకి రోగం ఎక్కువకావడంతో తానారాత్రి చేసినపనికి దేవతలో దెయ్యాలో ఎవరో వొకరు తీవ్రంగా ఆగ్రహించి, తనపిల్లను తీసుకు పోతలుచుకున్నారని నిశ్చయించుకుంది.

వొంటరిగా, బతికే సుందరమ్మకి భయాలు తీర్చేవారెవరూ లేరు. వెర్రెత్తింది ఆతలపుతో. ఎట్లానన్నా డాక్టర్ని పిలిపించాలి. తనదగ్గిర ఆరణాలువున్నాయి. గుమ్మందగ్గిరనుంచుంది. రోడ్డుమీది ఒక కుర్రాణ్ణి పిలిచి డాక్టర్ని పిలవమంది. తెల్లబోయి చూస్తోపోతున్నాడు. రెండణాలు చేతులో పెట్టి, డాక్టర్ని తెస్తే యింకో రెండణాలు యిస్తానంది. దాంతో ఆకుర్రాడి హృదయం కరిగింది. ఆనాలుగణాలతో డాక్టరువచ్చాడు. ఎనీమాయిచ్చాడు. పిల్ల అపాయస్థితిలోవుంది; ఇన్‌జక్షను యివ్వాలన్నాడు. ఇమ్మంది. మందు వ్రాసియిచ్చి తెచ్చుకోమన్నాడు. వాస్తవం వూడిపడే మొహంతో డబ్బులేదంది. ఆమె వాలకం చూసి అతను పిచ్చిది అనుకుని మాట్లాడకండా వెళ్లాడు. నటనచాతగాక, (Feelings) దాచుకునే నేర్పులేక, సహజంగా చరించే మానవుల్ని పిచ్చివారనుకుంటుంది లోకం.

రెండుగంటలసేపు అట్లానే కూచుంది. చీకటి పడుతోంది. వూరిబైట చెరువుమీద సూర్యుడు కుంకం చల్లుతున్నాడు. గట్టున స్కూలు పిల్లలు బంతి ఆడు

తున్నారు. వూళ్ళోవంటిళ్ళల్లో మళ్ళు కట్టుకుంటున్నారు, రాత్రి పొట్టలు నించుకునేందుకు పదార్థాలు తయారుచేయడానికని. భూమిమీద కొత్తపూలు పూశాయి; మళ్ళీపూశాయి. ఆకాశాన పాత నక్షత్రాలు మళ్ళీ మెరిశాయి, సుందరమ్మ గదిగోడమూల కిరసనాయిలు బుడ్డి వెలిగించి, పిల్లని కాళ్ళమీద పడుకో పెట్టుకుని, నల్లగుడ్లు సగం కనపడే కళ్ళవంక చూస్తో, చీకటి నీడలు కదిలే ఆగదిలో వొంటరిగా, "చిట్టీ, చిట్టీ!" అని పిలిచి 'వూ' అంటుందేమోనని తనబిడ్డ నోటిదగ్గిర చెవిపెట్టి వింటోంది.

చంద్రశేఖరం చీట్లపేకలో కుదేలుబేస్తు గెలుచుకుని, తొడలు ఎగరేస్తో, శ్వాస అమితంగా పీలుస్తో, పేకముక్కలతో చాపని చావబాదుతున్నాడు.

పిల్లకదిలి 'అమ్మా!' అని యేడ్చింది. ఆ కేకతో సుందరమ్మ తన హృదయాన్ని అరగతీసి మందుగా ఆబిడ్డకి పొయ్యలేకపోతినికదా అని యేడ్చింది.

"ఏమేఅమ్మా! ఏమేనాతల్లీ! నేనేంచెయ్యనే! దిక్కుమాలిన పాపిష్టిదాన్ని. నేను నీకేంచెయ్యనే!" అని యేడ్చింది వొంటరిగా!

పక్కనయింటో పుట్టినపండక్కి ముత్తయిదులు తాంబూలాలుతీసుకుని నవ్వుతో వీధివెంబడి బైలుదేరారు. సుందరమ్మకి తనచిన్నతనం జ్ఞాపకానికి వొచ్చింది. తనతండ్రిగాని తల్లిగాని వుంటేనా! ఎన్ని మందులు, ఎన్నిమంత్రాలు, ఎంతధైర్యం? ఏమైపో

యింది ఆ బ్రాహ్మణత్వం, ఆమహాత్యం, ఆదేవీప్రసన్నం, ఆవాక్శుచిత్వం! తనకి, తనకి వారిబిడ్డకి, తనకి, ఏమదంవల్ల, తాను యీమోహానికి లోబడి, యీచంద్రశేఖరంతో పాపంచేసి, ఎందుకు, తానిట్లా అధోగతిపాలయ్యింది? చేతులారా చేసుకున్న మహాపాతకానికి అనుభవించవొద్దా! కాని యీపిల్ల, నోరులేని యీకూన, ఎందుకీబాధ యీపిల్లకి! మరి తన పాపపు కడుపున పుట్టినందుకనకిది శాస్తి!

పిల్ల మేలుకుంది. చూస్తోంది. ఏదన్నా, యెవరన్నా చికిత్సచేస్తే బతుకుతుంది. తనకింకేముంది యీలోకంలో ఆచిన్నపాపగాక! తానే యీరోగాన్ని తెచ్చిపెట్టింది. ఏ త్యాగంచాతనైనా తానే నివృత్తి చెయ్యాలి. తనకేసి చూస్తోంది.

"అమ్మవి. నువ్వు నాకేంచెయ్యలేవా? ఈబాధని మాన్పలేవా?" అని చేతులు జాస్తోంది. ఆకళ్ళు తనని తిడుతున్నాయి.

"నాబాధ నీకుండె కరిగించటం లేదా? అట్లా కూచుంటావేం? నీ అభిమానం, నీ సోమరితనమేగాని, నువ్వేంచెయ్యలేవా, నిజంగా?" అంటున్నాయి వణికే ఆ పెదిమలు!

అన్నాయా నిజంగా! ఏమో! మనం విన్నామనుకుంటున్న మాటలన్నీ నిజంగానే అంటున్నారా? మనమే కల్పించుకుంటున్నామా?

ఆమె అంతరాత్మ ఆమాటల్ని ఆతిట్లని కల్పించు

కుందా? ఏమో మన అంతరాత్మలు యీలోకాన్నే కల్పించుకోటంలేదా?

ఇదంతా వాస్తవమైతే, అదంతా వాస్తవమే!

పిల్లని సముదాయించి పడుకోపెట్టింది. ఎవరు దిక్కు? మృత్యుదేవి హస్తాలులేవా? తలుపు దగ్గర వేళ పరుగుతో సమానమైన నడక ప్రారంభించింది రోడ్డువెంబడి. బళ్లు, దీపాలు, దుమ్ము, మనుషులు అన్నీ నీడలు, ఆమెకళ్లముందు ఏమీ కనపళ్లేదు.

" ఇంగ్లీషు సందులపాపెక్కడ? "

అది వాళ్ళకొక్కటే ప్రశ్న. గోడల్ని, చెట్లని, స్తంభాల్ని, అదే ప్రశ్న!

"ఇంకా వెళ్లండి" అంటున్నారు యెవరో వొకరు.

"ఇంకానా? ఎంత దూరం? ఎంత కాలం"

ఆమెని, ఆపడమటతోవతప్పి, యీమనుష్యమార్గాల అంధురాలై సంచరించే ఆ సంధ్యాదేవిని వికృతంగా చూస్తున్నారు ప్రజలు. కడుపునిండా సాయింత్రం భోజనంవేళైనాసరే, యిచ్చిన డబ్బుకి సంపూర్తిగా పోట్లాడి, కాఫీహోటల్లో మెక్కి, కిళ్లీతో బిగించే కోమటికుర్రాడు, ఆఫీసునించి రొండినిమూట పెట్టుకుని సంతుష్టితో యింటివేపు నడిచేగుమాస్తా ముందు బిళ్లజవాను ప్రజల్ని వెత్తిగిస్తోవుంటే, హోదాగా కర్రపట్టుకుని పక్కలకి చూచుకుంటూ సాగినడిచే అధికారి, ఇంకా ఎంతసేపటికి విస్తళ్లు వీధులో పడతాయని ఒక కన్నుమూసి ఆలోచించే

కుక్కలు— అందరూ చూస్తున్నారు "నాసంతానం, సంతానమని" రోదించే జగన్మాత కడుపు మంటని కళ్లలో ప్రతిఫలిస్తో రోడ్డువెంట పరుగుతీసే సుందరమ్మని వింతగా.

అందరూ ఆత్మలు, అన్నిహృదయాలు—అంతా కరుణ—గుమ్మాల్లో కూచుని శూన్యంవేపు చూసే ముసలమ్మలు, గెంతుకుంటో యిళ్లకిపొయ్యే పని కుర్రాళ్ళు, గడ్డిమోపులకింద వొంగిపొయ్యే కూలి స్త్రీలు, అంతా, అన్నీ అన్నీ, ఆత్మలే, అన్నీ హృదయాలే, చూస్తున్నారు వింతగా, యీనెత్రి సుందరి పరుగును.

షాపులో యెలెక్ట్రిక్ దీపాలు, బుడ్లు, నీడలు, పటాలు, మనుషులు. అన్నీ అన్నీ భ్రమలు, ఆలోచనలు, మనసుమీది మసకలు ఆమెకి—పిల్లఆత్మతో బాటు పైకి లేచిపోతున్న సుందరమ్మకిఅన్నీ—నీడలు, మసకలు.

చీటీ అతని చేతులో పెట్టింది.

"ఎన్ని గొట్టాలు?"

తెల్లబోయి చూస్తోంది—వినడంలేదు — అతను మళ్లీ "ఎన్నిగొట్టాలు?"

ఏమిటో అంటున్నాడు.

"తొరగా వెళ్ళాలి నేను."

"ఎన్నిగొట్టాలు?"

ఏమిటది? అడుగుతున్నాడు? ప్రయత్నించి భూమి

మీదికి తెచ్చుకోవాలి మనసుని.

"ఇయ్యండి"

"ఎన్ని?"

"ఇయ్యండి తొరగా."

బెంచీలమీది సోమరికబుర్ల విగ్రహాలు తలలెత్తి చూశాయి, ఆమెవంక, ఈలోకంవేపు దృష్టిలేని ఆలావణ్య రేఖవంక.

"ఒకటా? రెండా?"

"తెలీదు."

విసుగెత్తింది అతనికి

"ఒకటి రూపాయిన్నర!"......ఏమి? ఇవ్వండి!"

"లేవు. రెండణాలున్నాయి."

ఆడబ్బు పడేసింది.

ఎవరో నవ్వారు. చుట్టూ చూసింది, వెర్రిగా. వాళ్ళ మొహాలు చూసింది.

"ఇదేమిటి? తనుయెక్కడవుంది? అవును అవును. తొరగా యియ్యండి."

"డబ్బులు"

"లేవు."

ఆమెవెర్రివాలకం, భయం, ఆపద, అన్నీచూసి షాపువాడిమనసు కరుగుతోంది. కాని యజమానుడు తంతాడు. వాడూ దరిద్రుడే! అందరూ దరిద్రులే. కొంచెం యేమాత్రం హృదయమున్నవాడు ప్రతి వాడూ దరిద్రుడే! చుట్టూ యింతబాధ, యింత

మృత్యువు తాండవమాడుతో వుంటే, హృదయ మున్నవాడిదగ్గిర లక్ష్మి యెట్లా దాక్కుంటుంది ?

"ఎట్లా ? వెళ్ళితీసుకురండి."

ఒక్క నిమిషం నుంచుంది. అది యుగమనిపించింది. ఈలోకపు నిమిషాలలెఖ్క — పగలు రాత్రి, వారాలు, తేదీలు, అన్ని దాటిపోయింది ఆమెఆత్మ — బాధ బాధ అనే అనంతకాలంలో లీనమయింది.

అయ్యో ! ఒక్క యుగం దాటిపోయింది. బిడ్డ, తన బిడ్డ, లేచిందా ? వెతుక్కుంటోందా చీకట్లో ? "నువ్వు వొదిలావా అమ్మా" అనుకుందా? అట్లానే బిగుసుకుంటో చచ్చిపోయిందా ? తనచెయ్యి, మీద లేకండానే, తనకళ్లు భయంలేదని చెప్పకుండానే, ఫ్రెంటరిగా, కాలరాత్రిలోకి ప్రయాణమయ్యిందా తన బిడ్డ ? మరిచిపోయింది, మందుని, రెండణాలబిళ్ళని, తనవంకచూసే, బెంచిమేస్ట్రేటు రాఘవయ్యని, ఎవర్నీ చూడలేదు. చర్రున రోడ్డుమీద పడ్డది.

"ఎంత అందమైనమనిషో ! వెర్రిపట్టింది."

"మదపిచ్చి !"

"వెంటవెళ్ళరా లాభిస్తుందేమో !"

"కరి స్తే !"

"ఒరే, ఆబుజాలూ తొడలూ చూశావురా!

"బలేపిల్లరా !"

అంటోంది రెస్పెక్టబుల్ ప్రపంచం ఆమెవీపు వెనక.

మళ్లా వచ్చిన దోవనే—రోడ్డుమీద— దుమ్ము లో, చీకట్లో, బళ్ళని, బైస్కిళ్ళని తోసుకుని, బిచ్చగాళ్ళ గుండా, దీపాలు, యిళ్లు, నక్షత్రాలు— అన్నీనీడలు, అన్నీమాయలు, అన్నీమసకలు, కలలు, గుండెల్లో కొరుక్కుతినేవేదన ఒక్కటే నిజం. సత్యం. శాశ్వతం. వెళ్ళిపోతోంది. ఇదేయిల్లు. ఇదేగుమ్మం. లోపలే! బిడ్డ. బాధ, రోగం, మృత్యువు, చీకటి ఇదే గుమ్మం.

"చూడమ్మా !"

ఎవరు ?

అతను రామయ్యనాయుడు. గవర్నమెంటు. తండ్రి జవానుపనిచేస్తో చదివించాడు. క్రమంగా సొంత తెలివి వల్ల తాలుకాబోర్డు ప్రెసిడెంటయినాడు. లెజిస్ లేటివ్ కౌన్సిలులోకి పోవాలని ఆశయం. దయార్ద్రహృద యుడు. ప్రజలకు చాతనైనంతవరకు మేలుచేసినవాడు. ఆనాటి సాయంత్రం మందులషాపులో కూచున్నాడు. మందుల దగ్గిర కూచోడం అలవాటయిపోయింది. అది అతని తప్పుకాదు. ఇంకా గవర్నమెంట్ స్వేచ్ఛ అలవాట్లని మరిచిపోలేని అతని భార్య తప్పు.

సుందరమ్మ వాలకం, ఆమెకళ్ళలోని నిరాశ, పెద వుల్లోని దీనత్వం, గ్రహించాడు. అతని హృదయం కరిగిపోయింది. వుత్తగవళ్ళ రామయ్యే ఐతే ఆమెని అక్కడే పలకరించి వుండును. కాని ఎక్సుప్రెసిడెంటు రామయ్యకు పరస్త్రీని పలకరించడంనలుగురిముందూ మర్యాదైన పనికాదు. ఆమె వెళ్ళగానే యింటికి

పోతానని లేచి, తెర వెనకాలకి వెళ్ళి ఆమందుగొట్టం కొని, తొరతొరగా ఆమె వెళ్ళినమార్గాన్నే అనుసరించి గుమ్మంలో ఆమెని కలుసుకుని పలకరించాడు. చాలా సదుద్దేశ్యంతో.

"ఎవరమ్మా మీరు?"

"బ్రాహ్మలం."

ఆ ఒక్కమాటమీద సుందరమ్మ జీవితచరిత్ర, రామయ్య జీవిత కాలం, అతని కుటుంబం అదృష్టం, యింకా ఆసంబంధంగా అనేకవిషయాలు తారుమారై పోయినాయి. ఆమాటే ఆమె అనక, యింకేదన్నా పలికివుండును, ఆమెకింకా యొంతమంది సంతానం కలిగేవారో, యింకా యెన్నికష్టాలకు సుఖాలకు లోనయ్యేదో, రామయ్య లెజిస్‌లేటివ్ కవున్సిల్‌కి వెళ్ళడం, మంత్రికావడం, అతనికొడుకులు డిప్టీ సూపరెంటులుకావడం, అతనికూతుళ్ళు ఐ.సి.ఎస్.ల్ని పెళ్ళిళ్లు చేసికోడం, యెన్నిజరిగేవో!

ఆవొక్కమాట! ఆనాటు ఆమె ఆసమయాన అని తీరవలసిందేనా! ప్రపంచచరిత్రలో అది inevitable అయిందా? ఇదివరకే ప్రపంచసృష్టిలోనే, యిది నిర్ధారణ ఐపోయిందా? లేక సుందరమ్మ రామయ్యల పూర్వజన్మకార్యఫలితసంఘటనలవల్లా! లేక భూలోక వ్యవహారాల్ని కనిపెడుతో నడిపించే దేవతలు అట్లా నిశ్చయించా ఆనిమషాన — నేనీకథని ఎట్లా అంతం చెయ్యాలో యీనిమషాన నిర్ణయించినట్టు? లేక

ఆమాట అవసరం, సుందరమ్మ heridity వల్లనిర్ణయింపబడ్డదా! "బ్రాహ్మలం" అనే గర్వపుపలుకు యుగయుగాల బ్రాహ్మణరక్తం, బ్రహ్మజ్ఞానుల అధికారయోగ్యత, ఆమెనోటిలోనించి పలికిందా? సుందరమ్మ వృత్త కులం సంగతి మాత్రమే చెప్పతలచుకుని వుండవొచ్చు. పూరుకన్న, పేరుకన్న, ఉద్యోగంకన్న, వంశంకన్న ముందు కులంసంగతి వెల్లడిచేసే యీ దేశాచారమే ఆమెని ప్రోద్బలంచేసివుండవొచ్చు, కాని రామయ్యకి, ఆపలుకుల్లో బ్రాహ్మణాధిక్యత, గర్వం, తృణీకారం గంభీరంగా వినపడి గుండెల్లో ఝల్లుమనిపించాయి.

దానికి రామయ్య పూర్వచరిత్ర, అతని పూర్వుల మృతచరిత్ర కారణం. ఇట్లా ఒక్కొక్క అల్పవిషయం యీ ప్రపంచంలో అన్నీ, అన్నీ, ఒకటే నిమిషాన, స్థలాన, ఒకటే కేంద్రంలో, ఒకదాన్ని ఒకటి దాటుతో కలుసుకుని లోకపు రహస్యాన్ని విడదీయ ప్రయత్నించే వేదాంతుల్ని శాస్త్రశోధకుల్ని, సయన్సు వారిని పజిల్ చేసి వెర్రెత్తిస్తాయి. కర్మ, heridity, chance, fate, చరిత్ర, యీశ్వరేచ్ఛ, సృష్టిశక్తులు, అన్నీ, భిన్నంగా కనపడే యివన్నీ ఏకమేనేమో! అనేకమూలలనించి అనేకమంది యీ mystery ని సాధింప చూస్తున్నారు గావును!

రామయ్యకి బ్రాహ్మలంటే కోపం బ్రాహ్మణ వ్యక్తులమీదకాదు, ఆకులంమీద. ఈకోపానికీ, ఆకో

పం యీనిమిమంలో కల్పించిన ఘోరపర్యవసానాలకీ, కృతయుగంనాటినించి వొచ్చే యీవర్ణ బేధమూ, వర్ణస్తులూ, కారణం. తండ్రి జవానుగా చాకిరిచేసే యింటో రామయ్య అబ్రాహ్మలనించి పొందిన నీచత్వం అసలుపునాది, ఫలితం బ్రాహ్మణేతరసభ్యత్వం. ఫలితం జోస్టుపెసిడెంటుగిరీ. దాంతో బ్రాహ్మణద్వేషం పాలిసీ. బ్రాహ్మణేతర నాయకులవలె పూర్వకాలం బ్రాహ్మలు బ్రాహ్మణేతరులకు చేసిన ద్రోహాల్ని గురించి అతను పరిశోధన చెయ్యలేదు. అతని ద్వేషం intellectual మాత్రమేగాక, ముఖ్యం emotional.

రామయ్యే హిందూ విజ్ఞాన చరిత్రను నిష్పక్షపాతబుద్ధితో చదివివుండినట్టైతే, యీబ్రాహ్మణత్వమే, ఆప్రత్యేకత్వమే, ఆబేధభావమే, బ్రాహ్మణతపోప్రయత్నాలకు, ఆధ్యాత్మిక ఆశయాలకు, ఆనుచిత్వమే, ఆ ఆచారమే యెట్లా అవసరమై, ఎన్నడూ, యేదేశీయులూ అందుకోలేని, ధర్మాన్ని, కళను, జీవితాన్ని, సూక్ష్మవేదాంత రహస్యాన్ని, యోగమంత్రశక్తుల్ని, తమకేగాక, యేనాడో లోకాన్నంతా ఉద్ధరించగల ఆత్మతత్వాల్ని సాధించేందుకు బ్రాహ్మలకి ఎట్లా సహాయపడ్డదో తెలుసుకుని వుండును. ఏమైతేనేం, యీ Inferiority complex తో నేత్రాలంధమైన కాలంలో, ఎట్లాఅంతకన్న ఔన్నత్యాన్ని ప్రయత్నించగలడు రామయ్య! Creature

of the times!

అతని ఆశయం ఒక్క బ్రాహ్మణస్త్రీతో సంభోగం కావాలని. ఎందుకు? అని ప్రశ్నిస్తే ప్రత్యుత్తరం అతనికే తెలీదు, నిజం. తనలో నిజంగా లేనికసిని వెళ్ళకక్కుతాడు. ఆచిన్ననాడు, తనతండ్రి పనిచేసిన బ్రాహ్మణగృహంలో, తాను ఆరాధించిన, తనయీడుదే ఆ బ్రాహ్మణకన్య. అతన్నిచేసిన హేళనా, అతనిచేత చేయించుకున్న పనులూ, ఎంతకైనాపోని అతనికి ఆమెమీదగల గౌరవం, యివి కారణాలని psycho - analists అనవొచ్చు.

అతను సుందరమ్మని ఆషాపులో చూసి వాస్తవంగా, నిర్వ్యాజంగా జాలిపడ్డాడు. అతనిలోని దేవత్వమే పాలించింది. ఒక మానవుడు, హృదయమున్నవాడు రెండోమానవుడికి యిచ్చే సానుభూతినే యిచ్చాడు. కాని ఆమె "బ్రాహ్మలం" అన్నంత మాత్రాన, యింతసేపు ఎక్కడో అడుగున దాక్కున్న కులద్వేషం, రాక్షసత్వం, అధికారాన్ని పూనింది. అతను, మనుష్యుడు కాడు అప్పుడు, దేవుడుకాడు, ఆత్మకాడు, హిందువుడుకాడు, హిందూదేశస్థుడుకూడ కాడు. వృత్తనాయుడైనాడు.

"బ్రాహ్మలా ఆ ఆ ఆ!"

మనసు చురుకుగా పనిచేస్తోంది. ఇన్ని సంవత్సరాలనించి ద్వేషం పోసి భద్రంగా పెంచుకుంటున్న తనఆశయం యీనాటికి నెరవేరే సమయంవొచ్చిందా?

"ఏదీపిల్ల!"

"మీరుడాక్టరా?" అంది జాలిగా సుందరమ్మ, ప్రతిఅక్షరంలోనూ ధ్వనించే ఆశ రామయ్యని ఆనిమిషాన నాయుడేకాకపోతే మనుషుడేఐతే ఆకంఠంలోని నిర్మలత్వం, మాతృత్వం, దీనత్వం, అతన్ని సిగ్గుతో పాతాళానికి తొక్కివేసి వుండును.

అతికష్టంతో, తనహృదయాన్ని తొక్కిపట్టి, సహజ దేవత్వాన్ని నోరునొక్కి, "ఊ" అంటూ లోపలికి వెళ్లాడు. అబద్ధాలు ధైర్యంగా పలికే సాహసం యింకాసంపాయించలేదు, బోర్డుప్రెసిడెంటైనాకూడా.

ఆయింటిమీద తాండవించే మృత్యువుని, గోడలకెగబాకుతున్న చీకట్లనీ, బొద్దింకల్నీ, ఆబిడ్డనీ, ఆమెనీ, ఆమె దిక్కులేని తనాన్ని, ఆమెసౌందర్యాన్ని, దేన్ని చూడటంలేదు, నాయుడికళ్ళు. గతంవేపుతిరిగి, తన కార్యదీక్షలో, తనజీవితాశయంలో లీనమైపోయినాయి. దేవతలకరుణ యెట్లావుందో అని ఆలోచిస్తున్నాడు.

సుందరమ్మ దేవతలు తనకైపంపిన యీఅనాయాచిత, మిత్రత్వానికై, భక్తితో, కృతజ్ఞతతో కుంగిపోతోంది.

బిడ్డ, బాధల్నీ, తల్లినీ, శుష్కశరీరాన్ని వొదిలి ఆనందకోశంలోకి, retreat అవుతోంది.

సుందరమ్మ పిల్లవంకచూసింది, ఆశతో అతనివంక చూసింది. చీకటయిందిగాని, వెలుతురులోనే ఆమె

కళ్ళని అతను చూసివుంటే, ఎంతఅడుగున పడిపోయిన దైనా రామయ్య మానుషత్వం, ఆవెర్రిచూపుతో సమస్తమోహామేఘాల్ని చించుకుని, ఆమెపై ప్రస రించివుండేది, కాని విధి తలపెట్టినప్పుడు, సంఘాల నన్నిటినీ, ఏవిఘాతానికీ, స్థలమివ్వక, అతినిపుణతతో, perfect గా తయారుచేస్తుంది. Fate చేసేప్రయ త్నంలో human error కి ఏమాత్రమూ ఎడ ముండదు.

" మరి...మరి... " అని రామయ్యనాయుడు పెదిమలు తడుపుకుంటున్నాడు. అతనికి అనుభవం లేదు. స్త్రీలోలుడుకాడు.

"ఏమిటి!"

"నాకేమిస్తావు?"

"ఏముంది? ఏంలేదునాకు—దిక్కులేని......" అతనిచెవులు యెప్పుడో మూతలుపడ్డాయి. శబ్దంతప్ప, ఆశబ్దంలోని మృదుత్వం, కారుణ్యం, వినపడవు అతని కిప్పుడు. ఈలోకంలో లక్షలమందికి ఎన్నడూ విన పడవు.

"నువ్వు కావాలి!"

"నేనా !!!!" అన్న అరుపును, ఆ ఆశ్చర్యాన్ని, ఆ భయాన్ని, సందేహాన్ని, యేదేవుడన్నా విన్నాడా? చెవులువున్నాయా? ఈరోదన వినపడుతుందా? నేల వ్రాదపడివున్న బిడ్డకేసి చూస్తో, 'నేనా?' అన్న ఆ దిక్కుమాలిన తల్లి మొర!

ఎందరు స్త్రీలు, యెందరు పతివ్రతలు, సుశీలలు, అన్నారో యిట్లా 'నేనా' అని, తమకున్న మాన ధనాన్ని ఆశించిన పురుషులముందు.

ఒక్కనిమిషమే యోచించింది. ఆమనిషి, దేవుశివేషంలో ప్రత్యక్షమైన యీరాక్షసి, ఆయిల్లు, తన కాపరం, తనపేరు, తన జీవితం, దేహం, అభిమానం, తనపిల్ల, తనశుచిత్వం, అన్నికలలు, మాయ, మనోపటంమీద చలించే యింద్రజాలాలు, తను, తనే, తనబాధే, అదేవాస్తవం. నిన్న రాత్రి భర్త అనేపురుషుడు, యీరాత్రి వీడెవడో, యీపురుషుడు కాని భర్తకన్న యితనే సత్యసంధుడు కావొచ్చు. ఏమైతేనేం? ఏంజరిగితేనేం? ఆలోచనాలోకాన్ని, సందేహకాలాన్ని అతిక్రమించింది. మృత్యువుముందు ఆత్మ కాల్లానించే గడపతొక్కి పూర్ధ్వలోకాల దృష్టి నిలిపింది. ఈదేహాన్ని కాలిస్తేనేం? అనుభవిస్తేనేం, ఆకట్టైని?

ఏమీ మాట్లాడలేదు. మౌనం సంపూర్ణాంగీకారముగా తీసుకున్నాడు నాయుడు.

ఆ చచ్చిపోతున్న పిల్లపక్కన, ఆ కిరసనాయిలు బుడ్డి ముందు కదిలే బికారి నీడల్లో, సుందరమ్మని కావిలించుకున్నాడు. దేవతలు కలలు గని సృష్టించిన సుందరమ్మ పవిత్ర దేహాన్ని, ఆమె అందాన్ని చూడలేదు అతను. ఆమె నిర్మలత్వాన్ని గుర్తించలేదు. ఆమె నిర్లక్ష్యంతో పనిలేదు. ప్రాణమున్నదా

అనే పరీక్షకూడా లేదు. అతని కసలు సౌందర్యమంటే యేమిటో తెలీదు. స్త్రీ మనఃపూర్వకంగా యివ్వగల స్వర్గపు అంచులకన్నా అతనెన్నడూ సామీప్యానికి వెళ్ళలేదు. బ్రాహ్మణ స్త్రీ దొరికింది. జీవితాశయం నెరవేరుతోంది.

ఆమె—యిక్కడ యీ లోకాలలోనే లేదు. ఆ బిడ్డ—ఆ బిడ్డ యేసహాయమూ అందని స్థలాలు, యీభూమిని మించిన planes లోని అందాన్ని గుర్తుపట్టి కేలవేసిన గుడ్డలో—లోపల లోపల నవ్వు కుంటోంది.

సుందరమ్మ రక్తంలో కలిసి జీవించిన బ్రాహ్మణ ఆత్మలు, జపాలు, తపాలు, శ్రోత్రియం, యాజ్ఞాలు, ఆధ్యాత్మికసంపద, ఆధిక్యగర్వం, శూద్రున్ని గుమ్మమవతల, జ్ఞానానికి అవతల, శాస్త్రాధికారానికి అవతల నుంచోబెట్టిన అధికారం, "అమ్మో, అమ్మో" అని అరుస్తున్నాయి.

బ్రాహ్మలనించి, అన్యాయాన్ని, అవమానాన్ని, తృణీకారాన్ని, క్రూరికతో, యుగాలు భరించిన శూద్రుల అంధకారం, మాధ్యం; క్రూరశిక్షలకు, పక్షపాతాలకిపాలై నశించిన, మనుశ్రుతినాటి, శూద్ర ఆత్మల క్రౌర్యం; సేవలో, దాస్యంలో, కుంగి, తోవ తెలియక, పెనుగులాడుతున్న వేదన,నిరాశ; బ్రాహ్మల చేతుల్లో చిక్కి, మానాల్ని ప్రాణాల్ని అర్పించిన శూద్రవనితల అవమానాగ్ని, కసి, అన్ని అతని

రక్తంలో తాండవమాడుతో, తృప్తినొంది, అనంత కాలంలోని నిద్రకై పరుగులెత్తుతున్నాయి.

తమ వంశీయురాల్ని, శుద్ధ పవిత్ర బ్రాహ్మణరక్తాన్ని, ఆక్రమించుకుని, అపవిత్రంచేస్తున్న, యీ అధోవర్ణస్తుణ్ణి ఏంచెయ్యలేక, చుట్టూ మూగి, ఆమె ఆత్మని, అన్వేషించి, ఆహ్వానిస్తున్నారు, పూర్వులు, ఆమలినమైన శరీరంలోంచి లేచిరమ్మని.

... ...

"ఇవ్వండి."

"ఏమిటి?"

మరిచిపోయినాడు.

అతని దృష్టి తృప్తివేపు, ఆమె దృష్టి బిడ్డవెపు.

"ఇంజక్షను యివ్వండి."

"నేను డాక్టరుకాదు."

ఎందుకన్నాడు ఆమాట! ఆ బ్రాహ్మణ స్త్రీ దేహానికి చేసిన గాయంకాక, హృదయానికి శాశ్వతమైన గాయం చేద్దామనా! లేక అబద్ధమాడడం చాతగాకనా? మాట్లాడకండా వెళ్ళిపొయ్యే ధైర్యం లేకనా, కఠినత్వంలేకనా? ఎవరికి తెలుసు? ఎవరు చెప్పగలరు? అతని అల్పత్వమో, అతని ధీరత్వమో, అతన్ని అట్లాపలికించింది? అతనికే తెలీదేమో! అడిగినా చెప్పలేడేమో? ఆలోచించి చెప్పినా నిజం కాదేమో! ఎవరుచెప్పగలరు, కార్యాలకు నిజమైన వుద్దేశ్యాల్ని? కర్తలకే తెలీవు! పైగా నీతి, అవి నీతు

లని, ధర్మాధర్మాలని, స్పష్టంగా విడతీయ బూనుకుంటారు, నీత్యధికారులు!

సగం యీలోకాన్ని అప్పుడే దాటిన సుందరమ్మ ప్రాణాలు కడపటి ప్రయత్నం చేసాయి, తమ శరీరానికి జరిగిన యీ తీవ్ర న్యూనతని పరిహారం చేసేందుకై. అంత మన్మథ ప్రయత్నంలోనూ చలించక గడ్డకట్టిన సుందరమ్మ రక్తం, పెద్ద ఘోషతో మేలుకుంది. హృదయద్వారాల సముద్రపు వరదవలె వొచ్చి ప్రవేశించింది. చంపలు తళ తళ మన్నాయి. కళ్ళు అగ్నివలె మెరిశాయి. వక్షం దీర్ఘ ఉశ్వాసంతోటి నిండిపోయింది. నడుమూ, కంఠమూ, మహోద్రిక్తితో పైకి లేచాయి. ఈలోకపు సంకుచిత వాసనల్ని, శరీరపు స్వల్ప బంధనాల్ని, తెంచుకున్న ఆమె ఆత్మ అతిక్రమించి, పూర్వలోకాల జ్వలించే మహాశక్తులతో, బ్రాహ్మణ తేజస్సుతో సంబంధం కల్పించుకుంది అనిమిషాన.

ఆదివ్యవిగ్రహాన్ని, ఆమహాసౌందర్యాన్ని ఒకనిమిషంకింద తనచేతులకింద, తొడలకింద నిర్జీవమైపడివున్న కళేబరంలో ఆనూతన విద్యుచ్ఛక్తిని చూసి, విభ్రాంతుడై, వెనక్కి నాలుగుఅడుగులు వేశాడు రామయ్య.

ఏంజరగబోతోంది? చంపుతుందా? మీదదూకి చీలుస్తుందా! ఏమిటాచూపు? ఏమిటాశబ్దంలేని పెదిమల చలనం?

ఎవరు? సాధారణమానవురాలేనా? రాక్షసి.

దెయ్యం, మహమ్మారి, మహిషాసురమర్దని, శక్తి, కాళీ—

ఇంకో కాలు వెనక్కి వేశాడు, ఆమె కళ్ళలోనించి జ్వలించే వెలుగును భరించలేక భగ్గుమని మండి పోయినాడు నిలువునా, కాలిపోయినాడు. భస్మమై నాడు.

వెనకనే మండేదీపం వేళ్లాడే అతనిపంచ కంటు కుందా? అతనిశరీరంలోనించి, కాళ్ళమధ్యనించి లేచిం దాఆమంట?

సుందరమ్మా!—ఏమయిందో? ఏంజరిగిందో! నిలు వునా, పిల్లమీద పడివుంది. బైటగాయంలేదు. లోపల విషంలేదు.

బ్రాహ్మల కడపటి మహత్యం బ్రాహ్మణీకం. యీకలియుగానికి—సుందరమ్మతో అంతమయింది.

సమాప్తం.